www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 43 సంచిక : 23 విజయవాడ 5-4-2011 పేజీలు : 16 వెల: రు 5.00

లోపలి పేజీల్లో...


- 'నేటి చారిత్రక పరిణామంలో విప్లవాన్ని ఏ శక్తీ అడ్డుకొనలేదు' కా॥ కానూసన్యాల్ కోర్టు ప్రకటన
- మరువలేని మన ప్రియతమ నాయకుడు–కానూదా–ఎస్. ఝూన్సి
- లిబియాపై నాటోకూటమి సైనికదాడి–సిపి ప్రకటన
- ఈజిప్టులో నిరసనోద్యమం
- ఉద్యమాల ద్వారానే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం అమలు
- ఒడిషా : రైతుల ఆత్మహత్యలు–శంభుమిశ్రా
- కునారిల్లుతున్న ప్రభుత్వ వైద్యం


# కామ్రేడ్ కానూసన్యాల్ ఆశయాల కనుగుణంగా జీవిద్దాం



**చారిత్రక** నక్సల్బరీ పోరాటం కామ్రేడ్ కానూసన్యాల్‌ను బెంగాల్‌కు బయటవున్న విప్లవ శ్రేణులకూ, సానుభూతిపరులకూ, ప్రజలకూ పరిచయం చేసింది. నక్సల్బరీ పోరాటంతో విప్లవ రాజకీయాలవైపు ఆకర్షితులైన 1967-69 నాటి యువతరానికి ఆయన చారిత్రక వ్యక్తి. వారాయనను చూసినప్పుడు చిన్నగా పొట్టిగా సామాన్య జనంలో సామాన్యుడిగా కన్పించాడు. భావోద్వేగపూరిత అద్దాలనుండి విప్లవకారులను చూసేవారు దీనికి నిరుత్సాహపడివుంటారు. కానీ మార్క్సిస్టు–లెనినిస్టులకు కమ్యూనిస్టు నాయకులంటే సినిమా హీరోలు కాదు. విప్లవ సిద్ధాంతాన్ని, రాజకీయాలనూ నిర్దిష్ట పరిస్థితికి అన్వయించగల, దానిని ఆచరణలో వర్గపోరాటంగానూ, విప్లవోద్యమంగానూ అనువర్తించగల సామర్థ్యమూ, ప్రజల ఆశయానికి సంపూర్ణ హృదయంతో అంకితంకావటమూ ఒక కామ్రేడ్‌ను నాయకుడిని చేస్తాయి. కా॥కానూసన్యాల్ ఇలాంటి నాయకుడు.

1950వ దశకపు ప్రారంభంలో కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చిన కా॥కానూసన్యాల్ కమ్యూనిస్టు ఉద్యమపు గతానికీ వర్తమానానికీ, మధ్య వారధిగానూ కొనసాగింపుగానూ వున్నారు. తన సహచర కామ్రేడ్స్‌తో కలిసి ఆయన సంస్కరణవాద, రివిజనిస్టు, ఒంటెత్తువాద ఊబినుండి బయటకొచ్చారు. ఉత్తమ కమ్యూనిస్టు విలువలనూ, సాంప్రదాయాల వారసత్వాన్ని సమున్నతంగా నిలిపి కొనసాగించారు.

నక్సల్బరీ పోరాటం హఠాత్తుగా బ్రద్దలయినదో, ఒక బుర్రనుండి పుట్టినదో కాదనీ, దశాబ్దకాలం పాటు సాగిన కమ్యూనిస్టుల కృషి ఫలితంగా 1967 నాటి స్థాయికి చేరిందనీ కా॥కానూసన్యాల్ పదేపదే చెప్పేవారు.

అయితే దుస్సాహసిక పంథా దాని ఆచరణల ఫలితమే నక్సల్బరీవంటి విప్లవ రైతాంగ ఉద్యమమని చూపెట్టడం చరిత్రలో ఒక విషాదకర భాగం. ఈ పంథానే నక్సల్బరీ పంథాగా దేశమంతటా ప్రచారం సాగింది. నక్సల్బరీపై తప్పుడు వ్యాఖ్యానంతో మన దేశంలోని కమ్యూనిస్టు, విప్లవోద్యమాలకు కలిగిన తీవ్ర నష్టానికి కా॥కానూసన్యాల్ కలత చెందారు. వాస్తవాలను శక్తివంతంగా ముందుంచేందుకు లభించిన ప్రతి అవకాశాన్నీ ఆయన అందిపుచ్చుకున్నారు. నక్సల్బరీ ఉద్యమాభివృద్ధి యొక్క అన్ని దశల్లోనూ కార్యకర్తగా, నాయకుడిగా వున్న కామ్రేడ్‌గా కా॥కె.ఎస్.సరైన అవగాహనతో పోరాటాన్ని వుంచారు.

**"నక్సల్బరీపై మరికొంత వివరణ"** అన్న డాక్యుమెంటులో నక్సల్బరీ **"తేయాకు తోటల కార్మికుల, రైతాంగపు మహోజ్వల 17 ఏళ్ల దీర్ఘకాల(1951-67) పోరాటమ"**నీ, **"ఎగుడు దిగుడు మార్గంలో, శాంతియుతంగానూ–హింసాయుతంగానూ, చట్టబద్ధ చట్ట వ్యతిరేక ఘర్షణలతో కమ్యూనిస్టు కార్యకర్తల కష్టభరిత కృషితోనూ, పురోగమించిందనీ"** ఆయన వివరించారు. 1967 మే నెలలో చారిత్రక నక్సల్బరీ తిరుగుబాటు వెల్లువ గురించి **"కార్మిక, రైతాంగ ప్రజాసంఘాలూ, ప్రజా పోరాటాలే దానిని సృష్టించాయ"**ని కా॥కానూదా అన్నారు. **"భూముల ఆక్రమణ కర్తవ్యాన్ని అమలు పరచటమే ఈ వెల్లువను తెచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల, తోటల యజమానుల రాజకీయ ఆధిపత్యాన్నీ, అధికారాన్ని కూలద్రోసి, దాని స్థానంలో కార్మికుల కర్షకుల రాజకీయ ఆధిపత్యాన్ని, అధికారాన్నీ నెలకొల్పినప్పుడు మాత్రమే వ్యవసాయ విప్లవ కర్తవ్యం పరిపూర్తి అవుతుందని భూస్వాధీన కార్యక్రమం రైతాంగానికి నేర్పింది".** ఆయనిలా నిర్ధారించారు: **"రైతాంగానికి భూమి పంపకం చేయటం వ్యవసాయ విప్లవ ప్రధాన సారాంశం; తమ స్వాధీనంలో వున్న ఈ భూమిని నిలబెట్టుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిఘటనా పోరాటాలు అభివృద్ధి చెందుతాయి. ఇవి రాజ్యాధికారం కోసం పోరాటాలుగా పరివర్తన చెందుతాయి. నక్సల్బరీ పాఠమిదే. కనుక ప్రజాస్వామిక లేదా వ్యవసాయ విప్లవదశలో భూమి కొరకు పోరాటం, రాజ్యాధికారంకొరకు పోరాటం పెనవేసుకుని సాగుతాయి".** ఈ పోరాటానికి దుస్సాహసిక ధోరణితో సంబంధంలేదనీ, వాస్తవానికి దానిని తిరస్కరించి అభివృద్ధి చెందిందనీ కా॥కె.ఎస్.వివరించారు.

**మధు**

వాస్తవాల ప్రాతిపదికగానూ, సరైన దృక్పథంతోనూ నక్సల్బరీ పోరాటాన్ని విశదీకరించటాన్ని దేశంలోని కమ్యూనిస్టు విప్లవకారులు ఆహ్వానించారు. అయితే ఇంకా వ్యక్తిగత హింసావాద పంథాను అనుసరిస్తున్న కమ్యూనిస్టు విప్లవకారుల్లోని సెక్షన్లకు అది రుచించ లేదు. తమ కందుబాటులో భిన్నమైన వాస్తవాలుండి వుంటే వాటితోనూ, దానినుంచి తీసిన గుణపాఠాల తోనూ, రాజకీయ, సైద్ధాంతిక చర్చలోకి దిగే బదులుగా, వారు కా॥కె.ఎస్.పై అబద్ధాలు, దురభిప్రాయాలను వ్యాప్తిచేసి నిందా ప్రచారానికి పూనుకున్నారు. అతివాద ఒంటెత్తువాదాన్నీ, వ్యక్తిగత హింసావాదాన్నీ తిరస్కరించటమంటే విప్లవ పంథాను తిరస్కరించటంతో సమానమని చిత్రించబూనుకున్నారు.

నక్సల్బరీ పోరాటం తర్వాతి నాలుగు దశాబ్దాల కాలంలో కా॥కె.ఎస్. అనేక పరిణామాలనూ, ధోరణులనూ చూశారు. ఒకప్పటి ఆయన సన్నిహితులు దూరమయ్యారు. కొందరు రాజకీయాలనూ ఉద్యమాన్ని వదిలివేశారు. కొందరు రాజకీయంగా రంగుమార్చకుండానే దిక్కుమార్చారు. నక్సల్బరీ పంథాపై కొందరు సందేహాలనూ వ్యక్తం చేశారు; ప్రశ్నించారు. చారుమజుందార్ పంథా పర్యవసానాలనుండి నేర్చుకొనటానికి తిరస్కరిస్తూ ఒంటెత్తువాద, వ్యక్తిగత హింసావాద పంథానే కొందరు కొనసాగించారు. ఈ పరిణామాలు, ధోరణులపట్ల కా॥కె.ఎస్. అసంతోషం చెందారు.

అదే సమయంలో, విప్లవకర ప్రజాపంథాకు కట్టుబడివున్న, దానిని అమలుచేస్తున్న, కమ్యూనిస్టు విప్లవోద్యమం ప్రారంభంనుండీ అతివాద ఒంటెత్తువాదంపైనా, వ్యక్తిగత హింసావాదంపైనా నిలకడగా పోరాటం సాగిస్తున్న, కమ్యూనిస్టు విప్లవకారులతో ఆయన ప్రత్యక్ష సంబంధాల్లోకి వచ్చారు. ఒకప్పుడు ఒంటెత్తువాద, వ్యక్తిగత హింసావాద ప్రభావంలోపడి కొట్టుకుపోయిన కమ్యూనిస్టు విప్లవకారుల్లో కొందరిని, సరిచేసుకునే క్రమంలో వున్నవారిగా ఆయన చూశారు. నక్సల్బరీ ప్రజలనుసరించిన వ్యవసాయ విప్లవపంథా, విప్లవ ప్రజాపంథా నేటికీ వర్తిస్తాయన్న విశ్వాసంతో కా॥కె.ఎస్. వున్నారు. నిర్దిష్ట పరిస్థితిలో వచ్చిన మార్పులను నిశితంగా అధ్యయనంచేసి, ఈ పంథాను నిర్దిష్టంగా అనువర్తింపచేయాలి. కుళ్లు పార్లమెంటరిజానికి తిరోగమనంకానీ, వ్యక్తిగత హింసావాద పంథాను కౌగలించుకోవటంకానీ భారత విప్లవాన్ని పురోగమింపచేయవు.

దేశ పరిస్థితిలో వచ్చిన అనుకూల పరిణామాలకు కా॥కె.ఎస్. స్పందించేవారు. పాలక వర్గాలకూ, వారి రాజ్యానికీ వ్యతిరేకంగా ప్రజల మిలిటెంటు చర్యలను ఆయన హృదయపూర్వకంగా ఆహ్వానించేవారు. ప్రభుత్వమూ, దాని గూండా గుంపులూ సాగిస్తున్న దాడులనుండి తమ

(తరువాయి 4వ పేజీలో)

## ప్రథమ వర్ధంతి సందర్భంగా

## కామ్రేడ్ కానూసన్యాల్‌కి అరుణారుణ జోహార్లు!!

# 'నేటి చారిత్రక పరిణామంలో విప్లవాన్ని ఏశక్తీ అడ్డుకొనలేదు'

## కామ్రేడ్ కానూసన్యాల్ కోర్టు ప్రకటన

*పార్వతీపురం కుట్ర కేసుగా పేరొందిన కుట్రకేసు విచారణ సందర్భంగా విశాఖపట్నం ప్రత్యేక మేజిస్ట్రేటు కోర్టులో **1973** జూన్‌లో కామ్రేడ్ కానూసన్యాల్ చేసిన ప్రకటనయిది. భూస్వామ్య విధానం, దళారీ పెట్టుబడి, సామ్రాజ్యవాదాలు దేశప్రజల పురోగమనానికి ఆటంకంగా వున్న తీరునూ, విప్లవం ద్వారా వాటిని నాశనం చేసి జనతా ప్రజాతంత్ర వ్యవస్థ నెలకొల్పవలసిన ఆవశ్యకతనూ ఈ ప్రకటనలో కా॥ కానూసన్యాల్ వివరించారు. కమ్యూనిస్టు విప్లవకారులపైనా, ప్రజలపైనా పాలకవర్గాలు సాగిస్తున్న దమనకాండను ఖండించారు. కుట్రచేసిన పాలకవర్గాలు మోపిన కేసు రైతాంగ ఉద్యమాన్ని ఆపలేదని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు విప్లవకారుల అవగాహనను స్వంతం చేసుకుని ప్రతిభావంతంగా సమర్ధించారు.*

*-సంపాదకుడు*



**ఈ** అభివృద్ధి నిరోధక ప్రభుత్వంచేత పాశవికంగా హత్యచేయబడిన అమరవీరులకు మొదట మా జోహార్లు అర్పిస్తున్నాం.

ఈ కుట్రకేసు ఇలా జరుగుతుండగానే, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల వత్తాసుకలిగిన, అమెరికన్ సామ్రాజ్యవాదుల నాయకత్వాన వున్న పెట్టుబడీదారీ సమాజం కుళ్ళి కంపుకొట్టి కూరుకుపోయే తీవ్ర సంక్షోభస్థితిని ఎదుర్కొంటోంది. డాలరు విలువ తగ్గింపు, అధికారం కొరకు వాటర్ గేట్ తతంగం, అమెరికన్ సామ్రాజ్యవాదం అత్యంత శక్తివంతమైనదనే పుక్కిటి పురాణాన్ని బ్రద్దలు చేశాయి. సామ్రాజ్యవాదుల మధ్య ఆంతరంగిక వైరుధ్యాలు తీవ్రతర మవుతున్నాయి. దీని ఫలితంగా పశ్చిమ యూరప్, మధ్య ప్రాచ్యం తదితర ప్రాంతాలలో పరస్పర నిరోధం, పరస్పర కుమ్మక్కు జరుగుతున్నాయి. ఇదే కాలంలో సోషలిస్టు దేశాలు, చైనా ప్రజాతంత్ర రిపబ్లిక్ నాయకత్వాన అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ప్రపంచమంతటా ప్రజలు జాతీయ విముక్తి పోరాటాలు సల్పుతూ ఘనవిజయాలను సాధిస్తున్నారు. మూడవ ప్రపంచం అనగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలోని స్వతంత్ర దేశాలు-స్వంత సంస్థలను స్థాపించుకొని, తమ సార్వభౌమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని సుస్థిరం చేసుకొనడానికి సామ్రాజ్యవాదులతో పోరాడుతున్నాయి. శ్రమజీవుల విముక్తికై, సాంఘిక పీడన వ్యవస్థను రూపుమాపడానికి కమ్యూనిస్టులు పోరాడుతున్నారు. అందుకే మార్క్సిజం పుట్టిన నాటినుండీ ప్రపంచంలో వున్న దోపిడీదారులు, అభివృద్ధి నిరోధకులు తమ కసిని తీర్చుకొనడానికి కమ్యూనిస్టులపై కుట్రకేసులు బనాయిస్తూనే వున్నారు.

"రాజకీయ పోరాటాలను కుట్రకేసులుగా పేర్కొనటాన్ని కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తూ వచ్చారు. మున్ముందుకూడా సహజంగానే వ్యతిరేకిస్తారు" అని లెనిన్ ప్రవచించినట్లు, 1852లో కమ్యూనిస్టులపై బనాయించిన "కలోన్ విచారణ" నుండి నేటివరకు తమపై చేసిన ఆరోపణలను కమ్యూనిస్టులు తిరస్కరించి కుట్ర నేరాలు అబద్ధమని రుజువుచేశారు. కుట్రఅన్నది మార్క్సిస్టు వ్యతిరేకమైనది. ప్రపంచంలో విప్లవాలు కుట్రల ద్వారా విజయం పొందలేదు.

మేము భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) సభ్యులం. సోషలిజం రెండవ దశగా, జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చెయ్యకుండా మనదేశ సమస్యలు పరిష్కారం కాజాలవని భారతదేశ, విదేశ కమ్యూనిస్టు ఉద్యమ అనుభవాల ద్వారా మేము నిర్ణయానికి వచ్చాము. ప్రియతమమైన మన మాతృభూమి పురాతన సంస్కృతి కల్గివున్న దేశాలలో ఒకటి. అపార ఖనిజసంపత్తి, సారవంతమైన భూములు కలిగి కష్టించి పనిచేసే కోట్లాది ప్రజలువున్న దేశమిది. కానీ 200 సంవత్సరాలుగా కొనసాగింపబడిన బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నిర్దాక్షిణ్య దోపిడీ మన దేశాన్ని ప్రపంచంలోని అత్యంత బీదదేశాల్లోను, వెనుకబడిన దేశాలలోను ఒకటిగా చేసింది. కాంగ్రెసు పరిపాలన క్రింద భారతదేశానికి వున్నది నామమాత్రపు స్వాతంత్రం మాత్రమే. వాస్తవానికి ఇది అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశం. కాంగ్రెసు పరిపాలన - భారత ఫ్యూడల్ రాకుమారుల, బడా భూస్వాముల, నిరంకుశ, దళారీ పెట్టుబడిదారుల అవసరాలకు పాతినిధ్యం వహిస్తున్నది. ఈ దేశంలో కాంగ్రెసుపాలన భారత ప్రజలను నిర్దాక్షిణ్యంగా అణగదొక్కుతూ వారి రక్త మాంసాలను పీలుస్తున్నది. అంతర్జాతీయంగా సరికొత్త యజమాని అమెరికన్ సామ్రాజ్య వాదానికి, దీనికి మొదటి తోడు దొంగ సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదానికి, యిందుకు జతగా తనపాత ప్రభువు బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి కాంగ్రెసు ప్రభుత్వము నిరంతర సేవలు చేస్తోంది. ఈ విధంగా భారత జాతీయ అవసరాలను భారీ యెత్తున అమ్మి వేస్తున్నది. సామ్రాజ్య వాదం, సోవియెట్ సోషల్ సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజం, నిరంకుశ, దళారీ పెట్టుబడిదారీ విధానం ప్రియతమ భారత ప్రజల, ముఖ్యంగా నిరంతర శ్రమతో బతుకుతున్న కార్మికులు, రైతుల వీపుల మీద పెద్ద పర్వతాలవలె పడుతున్నాయి.

25 సంవత్సరాల కాంగ్రెసు పాలనలో భారతప్రజల కళ్ళముందు కారుచీకట్లు వ్యాపించాయి. నెలకు 20 రూపాయల కంటె తక్కువ ఆదాయం కల్గి ఆకలితో అలమటించే ప్రజలు జనాభాలో నూటికి 41.2 మంది వున్నారు. పట్టణవాసులలో 53 శాతం, గ్రామీణ ప్రాంతాలలో 78 శాతం ప్రజల దినసరి ఆదాయం 93 పైసలు మాత్రమే. వ్యవసాయ కార్మికుల నెలసరి ఆదాయం 9,8 రూపాయలు మాత్రమే. 'ఆహార స్వయంసమృద్ధి' అనే జొల్లుకబుర్ల మధ్య వ్యావసాయక దేశమైన భారతదేశం, నిత్యం ఆహార కొరతతో బాధపడుతూ, అనేక షరతులతో సామ్రాజ్యవాద దేశాలనుండి ఆహారధాన్యాలు కొనడానికి వేల కోట్ల రూపాయలు చెల్లిస్తోంది. దేశంలో నిరంతర కరువు పరిస్థితులు తాండవమాడుతున్నాయి. నిరుద్యోగం ప్రబలిపోతున్నది. కార్ఖానాలు మూతపడ్డాయి. వేలాది రైతులు భూముల నుండి వెళ్ళగొట్టబడి ప్రతిసంవత్సరం తిండీ తిప్పలకోసం ఇండ్లు వదిలి పోతున్నారు. ప్రభుత్వ పన్నులు ఏటేటా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ పన్నులు 1950-51లో 394.28 కోట్ల రూపాయలనుండి 1972-73 నాటికి 3893.84 కోట్ల రూపాయలకు పెరిగాయి. 1947-48లో తలసరి కేంద్రపన్ను 5 రూ॥కాగా, 1972-73 నాటికి అది 170 రూ॥లకు పెరిగింది. ప్రస్తుత సంవత్సరంలో ఇది ఇంకా 300 రూ॥లకు పెరిగే విధంగా ప్రకటనలు వినబడుతున్నవి. భూమి సంబంధాలు, తత్సంబంధమైన శాసనాలు యధాతథంగా వున్నాయి. రైతాంగం ఘోరాతి ఘోరంగా దివాళా తీయబడి పట్టణాల్లో బిక్షగాళ్ళ సంఖ్య పెరిగి పోతూవుంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులచేత ప్రవేశ పెట్టబడిన వలస విద్యావిధానం నేటికీ కొనసాగింప బడుతూవుంది. ఫలితంగా విద్యారంగంలో నిరక్షరాస్యత, విపరీతమైన లంచగొండితనం పెరిగిపోతూవుంది. ఒకపక్క తిండీబట్టా లేకుండా జనం అలమటిస్తుంటే మరోపక్క కొద్దిమంది చేతిలో భూమి, సంపద కేంద్రీకృతమైంది. లాభాలు ఆశించే సామ్రాజ్యవాద దోపిడీదొంగలకు మన ప్రియతమ మాతృభూమి అమృత భాండంలా వుంది. 1500 కంపెనీలపై పెత్తనం చెలాయించే 48 పారిశ్రామిక సంస్థలు గత 25 సంవత్సరాల్లో 4000 కోట్ల రూపాయలు, బిర్లాలు 600 కోట్ల రూపాయలకు పైన సంపాదించారు. 1968-69లో సుమారు 12000 కోట్ల రూపాయల సొమ్ము గుప్తధనంగా (Black Money) చలామణి అవుతున్నట్లు ప్రభుత్వ కమిటీలే కనుగొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం భారత దేశంలోని విదేశీ కంపెనీలలో మరికొన్ని పెట్టుబడులు పెట్టడానికి విదేశాలిస్తున్న ప్రోత్సాహమే కాక, యిప్పటికే పరిశ్రమలలో భారీయెత్తున జొరబడిన విదేశీ పెట్టుబడులు కాక, భారతదేశం విదేశాలకు చెల్లించవలసిన రుణం 7620.80 కోట్ల రూపాయలు. ఇందులో అమెరికాకు చెల్లించవలసిన రుణం చాలాపెద్దది. ఈ రుణంపైన భారతదేశం ప్రతి ఏటా 400 కోట్ల రూపాయల వడ్డీ చెల్లిస్తున్నది. అందుచేత భారత విదేశాంగ విధానం సామ్రాజ్యవాదుల దయాదాక్షిణ్యాలకు వదిలివేయబడి మనదేశం ఆగ్నేయాసియా, ఆఫ్రికా దేశాల నుండి వేరుచేయబడింది. పైగా 20 సంవత్సరాల ఇండో-సోవియట్ సంధి భారతదేశాన్ని సోవియట్ సోషల్ సామ్రాజ్యవాద నయావలస సంకెళ్ళలోకి లాక్కుపోయింది. భారత పాలకవర్గం ఒకవైపు దేశ స్వాంతంత్ర్యాన్ని సామ్రాజ్యవాదులకు అమ్మివేస్తూ మరొకవైపు సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల సహాయ సహకారాలతో యితర దేశాల్లోకి విస్తరణ తత్వాన్ని అమలు జరుప ప్రయత్నిస్తోంది.

పేదరికం, ఆకలి మూలంగా సామూహిక చావులు భారతదేశంలో ప్రతిదినమూ జరిగే సామాన్య సంఘటనలుగా తయారైనవి. నిపుణులైన శాస్త్రజ్ఞులు సైతం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఉద్యోగాల కొరకు ఈ దేశపు ఇంజనీర్లు గుంపులు గుంపులుగా విదేశాలకు తరలిపోతున్నారు. అంతేకాదు, తిండి, పని అడిగితే ఈ అభివృద్ధి నిరోధక ప్రభుత్వం తుపాకి గుండ్లతో ప్రజలకు జవాబు చెబుతున్నది. ప్రభుత్వం దమనకాండ యంత్రాంగాన్ని విస్తృత పరుస్తున్నది. మిలటరీ, పోలీసు బలగాల సమాయత్తతకై పెద్దపెద్ద మొత్తాలు కేటాయింప బడుతున్నాయి.

నేటి అభివృద్ధి నిరోధక కాంగ్రెసు పాలనలో భారత ప్రజలకు తిరుగుబాటు తప్ప గత్యంతరంలేని పరిస్థితి యేర్పడింది. అన్ని రకాల ప్రజలు దేశం మొత్తంలో తిరుగుబాటు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులతో ఘర్షణ పడుతూ కార్మిక వర్గం దేశమంతటా పోరాటం సాగిస్తోంది. ప్రభుత్వం ఎంతగా భయపడి పోతున్నదంటే అన్ని రాష్ట్రాలలోనూ సమ్మె వ్యతిరేక చట్టాలను ప్రవేశ పెట్టడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రైల్వే కార్మికుల సమ్మెలో వారి గొంతునులమడానికి భారతదేశ రక్షణ నిబంధనలను కేంద్రప్రభుత్వం అమలు జరిపింది. కరువుకాటకాలకు, భూమినుండి అక్రమ తొలగింపునకు వ్యతిరేకంగా రైతాంగం దేశమంతటా తిరగబడుతున్నారు. బలప్రయోగం ద్వారా అనేక రాష్ట్రాల్లో వరి పంటలను వశపరచుకుంటున్నారు. కుళ్ళి పోయిన వలస విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు దేశమంతటా ఎదురుతిరుగుతున్నారు. వివిధ రాష్ట్రాల్లో ఆహారానికై దొమ్మీలు జరుగుతున్నాయి. ప్రభుత్వఉద్యోగులే దీర్ఘకాలిక సమ్మెలకు తలపడుతున్నారు. 1967లో ఢిల్లీలో ఒకసారి, యిప్పుడు ఉత్తర ప్రదేశ్‌లోనూ ప్రభుత్వ సాయుధపోలీసులు సైతం తిరగబడుతున్నారు.

భారతదేశ చరిత్రలో సర్వసామాన్యమైపోయిన యీ తిరుగుబాటును ప్రపంచంలో యేశక్తీ అడ్డలేదు, వెనక్కినెట్టి వెయ్యలేదు. అభివృద్ధి నిరోధక పాలనకు మెరుగులు దిద్దుతున్న రివిజనిస్టులు ప్రజలను యీ చారిత్రక పంథానుండి ప్రక్కదారికి మళ్లించడానికి గతంలో ప్రయత్నాలు చేశారు-ఈ నాటికీ ప్రయత్నిస్తూనే వున్నారు. డార్జిలింగ్ జిల్లా లోని నక్సల్‌బరీ ప్రాంతవిప్లవ రైతాంగం, రివిజనిస్టుల బూటకాన్ని ధిక్కరించి పక్కకు పడద్రోసి తిరుగుబాటు జరిపారు. రివిజనిస్టులు, నయా రివిజనిస్టులు పాలకవర్గాలతో కలిసి 'గాంధీయిజం', పార్లమెంటరీ పంథాఅనే మత్తుమందులను వాడి ప్రజలను నిర్వీర్యులుగా చెయ్యడానికి పన్నిన అతినీచపు పన్నాగాలను నక్సల్‌బరీ రైతాంగం సంపూర్తిగా బట్టబయలు చేసింది. రైతాంగంపై ఆధారపడి, నిర్మాణరీత్యా సాయుధుల్ని చేసి పోరాటానికి ఉద్యుక్తుల్ని చెయ్యాల్సిన ప్రాముఖ్యతను నక్సల్‌బరీ రైతాంగం అత్యంత శక్తి వంతంగా చూపించగలిగారు. వ్యవసాయక విప్లవం అనగా 55 కోట్ల భారత ప్రజల విముక్తికి రైతాంగ యుద్ధపంథా అత్యంత ఆవశ్యకమైనదని, తప్పనిసరి ఆయినదని కూడా వారు నిరూపించారు. ప్రస్తుత భారత విప్లవం జనతా ప్రజాతంత్ర విప్లవదశలో వున్నది కాబట్టి రైతు సమస్య యిందులో అత్యంత ప్రాముఖ్యతను పొందుతున్నదనీ, కార్మికవర్గానికి విస్తృతమైన, నమ్మకమైన మిత్రులు రైతులేనని నక్సల్‌బరీ పాఠాలద్వారా భారత కమ్యూనిస్టుపార్టీ (మా-లె) సభ్యులమైన మేము నేర్చుకున్నాము. ప్రస్తుత దశలో భారతదేశ పరిస్థితుల కనుగుణ్యమైన మార్క్సిజం-లెనినిజం మావో ఆలోచనా విధానపు నిర్దిష్ట విశదీకరణ యిదే. అన్ని సాంఘిక విప్లవాలకూ శాస్త్రీయమైన మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానం నుంచే మేము సిద్ధాంత మార్గదర్శకత్వాన్ని గ్రహిస్తున్నాం. విశ్వజనీన సత్యమైన ఈ పంథాను ఏ పెద్ద కుట్రగానీ, వ్యక్తిగత భయానక కాండగానీ లేక రహస్య ఖతం కార్యక్రమంగానీ ఆక్రమించలేవు. ఎందుకంటే మావోసేటుంగ్ చెప్పినట్లు "సాంఘిక మార్పులు ప్రధానంగా సమాజంలోని అంతర్గత వైరుధ్యాల పరిణామం మూలంగా సంభవిస్తాయి; ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్యవున్న వైరుధ్యం, వర్గాల మధ్య వైరుధ్యం, కొత్తపాతల మధ్య వైరుధ్యం-ఇవే సమాజంయొక్క అంతర్గత వైరుధ్యాలు. ఈ వైరుధ్యాల పరిణామమే సమాజాన్ని ముందుకు నెడుతుంది. పాత సమాజాన్ని త్రోసివేసి నూతన సమాజమేర్పడే విధానాన్ని ప్రారంభిస్తుంది."

ఈ మార్గాన్ని అనుసరించే శ్రీకాకుళం ఏజన్సీ ప్రాంత గిరిజన వీరులు, తదితర రైతాంగం కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వాన భూస్వాముల పీడన, రివిజనిస్టుల మోసకృత్యాలకు వ్యతిరేకంగా తిరుగబడి సాయుధ వ్యవసాయక పోరాటాన్ని ప్రారంభించారు. అదేవిధంగా బీహారులోని ముషాహరీ, వుత్తరప్రదేశ్‌లోని లఖింపూర్, ఖేరీ, పశ్చిమబెంగాల్‌లోని డెబ్రా, గోపివల్లభ పూర్ రైతాంగ ప్రజలు కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వాన అభివృద్ధి నిరోధకులకు, రివిజనిస్టులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

సాయుధ వ్యవసాయక పోరాటాల అభివృద్ధిని చూసి భారత అభివృద్ధి నిరోధక పాలకులు బెంబేలు పడిపోతున్నారు. నక్సల్‌బరీ నాటి నుండి ఈ పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచి వేయుడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక ప్రక్క సాయుధ సంఘర్షణ పేరుతో అత్యంత విలువైన మన కామ్రేడ్స్‌తోసహా అసంఖ్యాకులైన రైతులను నేలమట్టం చేశారు. స్త్రీలను మానభంగం చేశారు. అమానుషమైన దారుణకృత్యాలు కొనసాగించారు. తప్పుడు కేసులుపెట్టి వేలాది రైతులను, రాజకీయ కార్యకర్తలను జైళ్ళలోనే చంపివేశారు.

మరొకవైపు ఈ అభివృద్ధి నిరోధక పాలకవర్గం, ప్రజలందరికీ వ్యతిరేకులైన ఈ గుప్పెడు కుట్రదారులు ఈ కుట్రకేసును, అనేక ఇతర కేసులను బనాయించారు.

భారత కమ్యూనిస్టుపార్టీ (మా-లె) సభ్యులమైన మేము ఈ అణచివేత చర్యలకు భయపడేదేమీ లేదు. భారత విప్లవానుభవంలో ఎన్ని కష్టాలు వచ్చినా. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానానికి కట్టుబడి కార్మికవర్గానికి అత్యంత సన్నిహితులైన రైతాంగ ప్రజలపై ఆధారపడినంతకాలం మేమున్మ్ముందుకు పురోగమించగలం అని మాకు తెలుసు.

అభివృద్ధి నిరోధకులు మాపైన ఎల్లప్పుడూ దాడిచేస్తారు. యెందుకంటే నిజమైన కమ్యూనిస్టులంటే వారికి భయం. 125 సంవత్సరాల క్రితం మార్క్సు ఎంగెల్స్ చేసిన ప్రకటనకు మేము ఎల్లప్పుడూ కట్టుబడి వుంటాము.

"తమ అభిప్రాయాలను, ఆశయాలను దాచుకోవటాన్ని కమ్యూనిస్టులు అసహ్యించుకుంటారు. అమలులోవున్న సాంఘిక పరిస్థితులను బలప్రయోగంతో కూలదొయ్యడం ద్వారా మాత్రమే తమ ఆశయాలు సిద్ధిస్తాయని వారు బహిరంగంగా ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవమంటేనే పాలకవర్గం గడగడలాడి పోతుంది. కార్మికులకు పొయ్యేదేమీలేదు, సంకెళ్ళు తప్ప. వారు ప్రపంచాన్నే జయించవలసి వుంది."

**(4-7-1973 జనశక్తి నుండి పునర్ముద్రితం)**

*రైతాంగం, రివిజనిస్టుల బూటకాన్ని ధిక్కరించి పక్కకు పడద్రోసి తిరుగుబాటు జరిపారు. రివిజనిస్టులు, నయా రివిజనిస్టులు పాలకవర్గాలతో కలిసి 'గాంధీయిజం', పార్లమెంటరీ పంథా అనే మత్తుమందులను వాడి ప్రజలను నిర్వీర్యులుగా చెయ్యడానికి పన్నిన అతినీచపు పన్నాగాలను నక్సల్‌బరీ రైతాంగం సంపూర్తిగా బట్టబయలు చేసింది. రైతాంగంపై ఆధారపడి, నిర్మాణరీత్యా సాయుధుల్ని చేసి పోరాటానికి ఉద్యుక్తుల్ని చెయ్యాల్సిన ప్రాముఖ్యతను నక్సల్‌బరీ రైతాంగం అత్యంత శక్తి వంతంగా చూపించగలిగారు. వ్యవసాయక విప్లవం అనగా **55** కోట్ల భారత ప్రజల విముక్తికి రైతాంగ యుద్ధపంథా అత్యంత ఆవశ్యకమైనదని, తప్పనిసరి ఆయినదని కూడా వారు నిరూపించారు. ప్రస్తుత భారత విప్లవం జనతా ప్రజాతంత్ర విప్లవదశలో వున్నది కాబట్టి రైతు సమస్య యిందులో అత్యంత ప్రాముఖ్యతను పొందుతున్నదనీ, కార్మికవర్గానికి విస్తృతమైన, నమ్మకమైన మిత్రులు రైతులేనని నక్సల్‌బరీ పాఠాలద్వారా భారత కమ్యూనిస్టుపార్టీ (మా-లె) సభ్యులమైన మేము నేర్చుకున్నాము.*

# మరువలేని మన ప్రియతమ నాయకుడు–కానూదా

ఎస్. ఝాన్సి

**భారత** విప్లవోద్యమ ముఖ్యనాయకులు, మన ప్రియతమనేత, కామ్రేడ్ కానూసన్యాల్ మనల్ని వీడి అపుడే సంవత్సర కాలం గడిచింది. కామ్రేడ్ కానూసన్యాల్ భారత విప్లవోద్యమ క్రమంలో తలెత్తిన మితవాదానికి, అతివాదానికి వ్యతిరేకంగా రాజీలేని సిద్ధాంత నిబద్ధతతో పోరాటం సాగించటంతోపాటు కడవరకూ ఆచరణ రంగాన్ని వదలకుండా కొనసాగిస్తూ వచ్చారు. మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానాన్ని ఒక శాస్త్రంగా, శస్త్రంగా మలచుకొని మనదేశ నిర్దిష్ట పరిస్థితులకు దానిని అన్వయించటంలో వస్తున్న ఇబ్బందులు, పొరపాట్లు, లోటుపాట్లను అధిగమించేందుకు చివరిక్షణం వరకూ సంఘర్షిస్తూ శారీరక అనారోగ్యాన్ని లెక్కచేయక, మానసిక ధృడసంకల్పంతో, భవిష్యత్‌పట్ల అచంచల విశ్వాసంతో, ఆశావహ ధృక్పథంతో చివరివరకూ కొనసాగారు.

సిలిగురి ప్రాంత ప్రజలమధ్య మారుమూల ప్రాంతంలో జీవిస్తూకూడా అంతర్జాతీయంగానూ–దేశీయంగానూ, ఆయా రాష్ట్రాలలోనూ జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించి, విశ్లేషించుకొని, మార్క్సిస్టు దృక్కోణంలో వ్యాఖ్యానించటాన్ని కామ్రేడ్ కానూసన్యాల్ ఒక కళగా అభివృద్ధి చేసుకొన్నారు. మరోవైపున ప్రజలమధ్య–తేయాకుతోటల కార్మికులు, ఆదివాసీలు, రైతాంగపు సమస్యలు, వారి పోరాటాల నడుమ జీవించటాన్ని ఒక విధానంగా కొనసాగించారు. తేయాకుతోటల కార్మికుల ఆందోళనలు, వేతన ఒప్పందాలు తదితర అంశాలలో చివరివరకూ కా॥సన్యాల్ ప్రత్యక్షపాత్ర వహించారు.

భారత విప్లవోద్యమ వేగుచుక్కగా తెలంగాణా రైతాంగ సాయుధపోరాటాన్ని నడిపిన ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు నాయకత్వంపట్ల, ఆ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తున్న విప్లవ ప్రజానీకం, నాయకత్వం పట్ల అంతులేని విశ్వాసాన్ని, ఆదరాభిమానాల్ని కామ్రేడ్ కానూసన్యాల్ పలుసందర్భాల్లో వ్యక్తం చేసేవారు.

1969 –శ్రీకాకుళ గిరిజనోద్యమం నాటినుండి రాష్ట్రంలో సాగిన, సాగుతున్న ప్రజాఉద్యమాలన్నింటిపట్ల కా॥కానూసన్యాల్ బాధ్యతాయుతంగానూ, గమనింపుతోనూ వున్నారు. వివిధ కారణాలతో నగ్జల్బరీ ఉద్యమం వెనుకపట్టుకు గురైన తదనంతర కాలంలోనూ కామ్రేడ్ కానూసన్యాల్ ఆ ప్రాంత ప్రజలను, కార్యకర్తలను అంటిపెట్టుకునేవున్నారు. నగ్జల్బరీ పోరాటంలో పాల్గొన్న వారిమధ్య–ఆ ప్రాంత ప్రజల, కుటుంబాల మధ్య సజీవ సంబంధాలలో కడవరకూ సాగారు. పెద్దలు మొదలు పిన్నలవరకూ 'కానూదా!' అంటూ ఆయనను ఆప్యాయంగా పిలుచుకుంటారు.

ప్రపంచవ్యాపితంగా కమ్యూనిస్టు శ్రేణులలో పరిచయమైన, ముఖ్యంగా మన దేశ విప్లవోద్యమాన్ని ఒక కుదుపుకు గురిచేసిన నగ్జల్బరీ పోరాటానికి నాయకత్వం వహించినవారిలో ప్రముఖుడైన కానూసన్యాల్ జీవనం చాలా సాదా సీదాగా వుండేది. మట్టితో కట్టిన గోడలు, రెల్లుగడ్డితో కప్పిన ఇంటిలోనే తను నివసించటంతో పాటుగా ఆ ప్రాంత కార్యాలయంగానూ ఉపయోగించేవారు. కమ్యూనిస్టుపార్టీ ప్రారంభ దినాల్లో అలవరచుకున్న కఠినమైన జీవనశైలినే ఆయన కొనసాగించారు. మంచంపై కాక చాపమీదే నిద్రించేవారు. ఎక్కువభాగం 'మురీల'(మరమరాలు)నే ఆహారంగా తీసుకునేవారు. తనవద్దకు వచ్చే సామాన్య ప్రజానీకానికి, కార్యకర్తలకు, నాయకులకైనా, అంతర్జాతీయ వార్తాసంస్థ బి.బి.సి. ప్రతినిధులకైనా ఒకే విధమైన బ్లాక్‌టీని ఆప్యాయంగా అందించేవారు. బట్టలు, ఖర్చు విషయంలో అత్యంత పొదుపుగా వ్యవహరించేవారు.

కామ్రేడ్ కానూదా అనారోగ్యంతో వున్నప్పుడు పరామర్శించటానికి 2010 ఫిబ్రవరిలో ఆయన నివాసానికి తొలిసారిగా వెళ్ళిన నాకు స్ఫూర్తిదాయకమైన ఆయన జీవనశైలిని దగ్గరగా గమనించే, వాత్సల్యంతో కూడిన ఆయన ఆతిథ్యాన్ని పొందే అవకాశం లభించింది. ఆ ప్రాంత ముఖ్యకార్యకర్తలందరినీ ఆయన పేరుపేరునా పరిచయం చేయటంతోపాటు, కీలకమైన నగ్జల్బరీ ఉద్యమంలో కాల్పులు జరిగిన ప్రాంతంలో అమరుల స్మారక చిహ్నాలను సందర్శించే ఏర్పాట్లు చేయటంలో కా॥కానూదా చూపిన శ్రద్ధ మరువలేనిది. తన నివాసంలో గోడలపైవుంచిన నగ్జల్బరీ అమరుల చిత్రపటాలను చూపిస్తూ పేరుపేరునా వారి జీవిత విశేషాలను వివరించటం నాకు ఒక మంచి జ్ఞాపకం.

విప్లవోద్యమక్రమంలో సంఘర్షణలు, వత్తిడులు, తీవ్ర ఉద్రిక్తతల నడుమ సాగిన తన ఉద్యమ జీవితం కారణంగానే తాను అవివాహితుడిగా వుండిపోవటం జరిగింది మినహా విప్లవకారుల వివాహం ఉద్యమానికి ఆటంకమనే అవగాహన స్థాయికి దానిని లేవనెత్తి చర్చించటం సరికాదని కా॥కానూసన్యాల్ సన్నిహితులవద్ద వివరించే సందర్భంలో నేను వినటం తటస్థించింది. స్థానికంగానూ, ఉద్యమ నిర్మాణంలోవున్న మహిళలతోనూ కా॥కానూదా వ్యవహరించే తీరు చాలా సాదరంగా వుండేది. కమ్యూనిస్టు విప్లవకారులకు ఆతిధ్యం ఇచ్చే కుటుంబాలలో వున్న స్త్రీలపట్ల, తోటి మహిళా కామ్రేడ్స్ పట్ల చిత్తం వచ్చినట్లు వ్యవహరించరాదన్న మావో మహోపాధ్యాయునని బోధనలు గుర్తుకు వచ్చాయి.

1968 జులైలో శ్రీకాకుళంజిల్లా ఏజన్సీ ప్రాంతంలో కామ్రేడ్ సౌరేన్ బోస్‌తో కలసి కామ్రేడ్ కానూసన్యాల్ విస్తృతంగా పర్యటించారు. తమ సమస్యల ప్రాతిపదికపై గిరిజనులు ఏ విధంగా పోరాటాల్ని నిర్మించాలో నగ్జల్బరీ ఉద్యమ అనుభవాల వెలుగులో వారికి ఓపికగా వివరించారు. కా॥చౌదరి తేజేశ్వర్రావు మరికొందరు కామ్రేడ్స్ ఆనాడు కా॥కానూసన్యాల్ ఆంగ్ల ప్రసంగాలను గిరిజనులకు తెలుగులో అనువదించి చెప్పారు.

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను సాయుధంగా కూలదోయమని ప్రజలను రెచ్చగొట్టారనే ఆరోపణతో రాజద్రోహ నేరం మోపి కా॥కానూసన్యాల్,



కామ్రేడ్ కేంద్రుక అర్జున్‌తో కా॥ కానూదా

కా॥సౌరేన్ బోసులతో సహా వందలాదిమందిని చారిత్రాత్మక పార్వతీపురం కుట్ర కేసులో ముద్దాయిలుగా అరెస్టు చేశారు. ఆనాటికే కా॥కానూసన్యాల్, సౌరేన్‌బోస్‌లపై పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో నేరాలు మోపి అక్కడి పోలీసులు వారిని అరెస్టు చేసి, పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయిలుగా మన రాష్ట్ర పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో ముద్దాయిలుగా వీరు విశాఖ కేంద్ర కారాగారంలో 7 సం॥ నిర్బధించబడ్డారు.

ఆనాటి జైలు అధికారుల అవినీతి, రాజకీయ ఖైదీల కనీస హక్కుల నిరాకరణ, ఏకాంతవాస శిక్షలకు (సాలిటరీ సెల్స్)కు వ్యతిరేకంగా కామ్రేడ్ కానూసన్యాల్ జైలు అధికారులతో సంఘర్షణపడేవారు. 23 రోజుల పాటు నిరాహారదీక్షను చేపట్టారు. ఈ విధమైన ఆందోళనల ఫలితంగా అనంతర కాలంలో రాజకీయ ఖైదీలకు ఒకింత వెసులుబాటును సంపాదించుకోగలిగారు.

కామ్రేడ్ కానూసన్యాల్ తన జైలు జీవితాన్ని నిబద్ధతతో కూడిన రాజకీయ ప్రచార వేదికగా మలుచుకున్నారు. జైలులోనే తెలుగుబాషనీ నేర్చుకున్నారు. పార్వతీపురం కుట్రకేసులో భాగంగా అరెస్టయిన, తమతో పాటు వున్న శ్రీకాకుళ గిరిజనోద్యమ కామ్రేడ్స్‌తో సన్నిహితంగా వుంటూనే, వ్యక్తిగత హింసావాద విధానాల దుష్ఫలితాలను ఓపికగా వివరించేవారు. ఈ క్రమంలోనే 'నగ్జల్బరీపై మరికొంత వివరణ'ను రాయటం ద్వారా ప్రజాయుద్ధ పంథా యొక్క ఆవశ్యకతను దృఢంగా పేర్కొన్నారు. కామ్రేడ్స్ సౌరేన్ బోస్, నాగభూషణ పట్నాయక్, భువనమోహన పట్నాయక్, కొల్లా వెంకయ్య, తేజేశ్వరరావులతో కలిసి కామ్రేడ్ కానూసన్యాల్ జైలు నుండి ఆరుగురు పార్టీ కామ్రేడ్స్ రాసిన లేఖకీ–నగ్జల్బరీ ఉద్యమానికీ వ్యక్తిగత హింసావాదానికీ పొంతన లేదనీ, వ్యక్తిగత నిర్మూలనా సిద్ధాంతం ఆత్మహత్యా సదృశ్యమైనదని వివరంగా పేర్కొంది. సాంకేతికంగా చారుమజుందార్ నాయకత్వంలోని సిపిఐ(ఎం–ఎల్)లో ఉన్నప్పటికీ భారత విప్లవోద్యమానికి అతివాద దుస్సాహసికవాదం ఏ విధంగా తీవ్ర నష్టాలను కలుగజేస్తుందో వివరిస్తూ జైలులోనే సిద్ధాంత సంఘర్షణకు పూనుకున్నారు. వ్యక్తిగత హింసావాదాన్ని బహిరంగంగా నిరాకరించటానికి కూడా జంకుతున్న ఆ సందర్భంలో కామ్రేడ్ కానూసన్యాల్ నిబ్బరంగా, విస్పష్టంగా ఈ సిద్ధాంత వైఖరులను ప్రకటించారు. అప్పటికే కా॥దుప్పల గోవిందరావు వంటివారు ఉద్యమంలో తప్పులు జరిగాయని గ్రహించి పునరాలోచనలో పడుతున్న దశలో కామ్రేడ్ కానూసన్యాల్ వంటివారి సిద్ధాంత దన్ను తమ ఆలోచనలను స్పష్టంగా ప్రకటించటానికి దోహద పడిందని ఆయన జ్ఞాపకాలు వివరించారు. సాధారణ గిరిజన కామ్రేడ్స్‌తో కలిసి కామ్రేడ్ కానూసన్యాల్ వరుస క్రమంలో నిలబడి భోజనం తీసుకునేవారనీ, శ్రీకాకుళ ఉద్యమ ప్రాంతాలైన పెదఖర్జ, నీలకంఠంపురం, మొదెంఖల్లు, గుమ్మగ్రామాల గిరిజనులతో మరింత సన్నిహితంగా కామ్రేడ్ కానూసన్యాల్ మెలిగే వారని కా॥ గోవిందరావు చెప్పారు. తర్వాత క్రమంలో కామ్రేడ్ కానూసన్యాల్ శ్రీకాకుళం కామ్రేడ్స్ కలిసిన ప్రతీ సందర్భంలోనూ వారి పేర్లను ప్రస్తావించి మరీ అడిగేవారనీ. భువనమోహన పట్నాయక్‌ను మరో సన్నిహిత మిత్రుడిగా కామ్రేడ్ కానూసన్యాలు పరిగణించేవారనీ. కామ్రేడ్ కానూసన్యాల్‌తో తన జైలు జ్ఞాపకాలను ఆయన వివరించారు.

రాగద్వేష రహితంగా జైల్లో కా॥కానూసన్యాల్ సాగించిన ఈ సిద్ధాంత సంఘర్షణలో వీగిపోవటాన్ని సహించలేని వారు కామ్రేడ్ కానూసన్యాల్‌పై అనేక దూషణలకు, నిందలకు ఒడిగట్టినా ఆయన వాటిని సమర్ధంగా తిప్పి కొట్టారు. విప్లవకారుల లీగల్ డిఫెన్స్ అనవసరమనే వాదనలోని అతివాద ధోరణిని ఎత్తిజూపి కోర్టులను కూడా సమర్ధవంతంగా విప్లవ రాజకీయ ప్రచార వేదికలుగా మలుచుకున్నారు. 'చైనా ఛైర్మనే మన ఛైర్మన్' అనే నినాదంలోని అతివాద ధోరణిపై కామ్రేడ్ కానూసన్యాల్ సంఘర్షణ పడ్డారు. జైలులో రాజకీయ తరగతులు నిర్వహించటంలోనూ, ఆటలతోనూ, అధ్యయనంతోనూ కా॥కానూసన్యాల్ తీరిక లేకుండా వుండేవారు.

1976 ఆగస్టు 30వ తేదీన కోర్టు విచారణ అనంతరం పార్వతీపురం కుట్ర కేసులో కామ్రేడ్ కానూసన్యాల్‌తో పాటుగా మరికొందరికి ప్రభుత్వం యావజ్జీవశిక్ష విధించింది. 1977లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం–విప్లవకారులు తమ తప్పును ఒప్పుకొని జన జీవన స్రవంతిలో కలుస్తామని సంతకాలు చేస్తే శిక్షాకాలం రద్దుచేసి విడుదల చేస్తామంటే, దానికి కా॥కానూసన్యాల్ నిరాకరించటమే గాక, ఇది మరొక రకంగా రాజకీయ లొంగుబాటు అవుతుందన్నారు. బేషరతుగా విప్లవకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భారత విప్లవోద్యమ చరిత్రలో ఇంతటి సుదీర్ఘ కాలం జైలు జీవితం, అజ్ఞాతవాస జీవితం, అక్రమ కేసులకు గురైనప్పటికీ సిద్ధాంత నిబద్ధతతో ప్రజా ఉద్యమ విజయంపట్ల ఆశాభావంతో కడవరకూ నిలచిన అరుదైన కామ్రేడ్స్‌లో కామ్రేడ్ కానూసన్యాల్ అగ్రగణ్యులనటం అతిశయోక్తి కాదు.

## కామ్రేడ్ కానూదాతో నా తొలి పరిచయం–ఆంధ్రప్రదేశ్‌తో ఆ కామ్రేడ్ అనుబంధం

'తెలంగాణా, నగ్జల్బరీ ఉద్యమ పతాకాలను సమున్నతంగా నిలపండి' అంటూ 1997 నవంబర్ 7,8 తేదీలలో సి.ఓ.సి., సి.పి.ఐ (ఎం–ఎల్) జనశక్తి హైదరాబాదులో నిర్వహించిన సదస్సు సందర్భంగా కామ్రేడ్ కానూసన్యాల్, కామ్రేడ్ అరవింద సిన్హా హాజరయ్యారు. కా॥కానూసన్యాల్ ప్రారంభోపన్యాసం చేశారు. నేను వ్యక్తిగతంగా మొదటిసారిగా కామ్రేడ్ కానూదాను కలిశాను.

ఇదే సంవత్సరం నవంబర్7న పశ్చిమ గోదావరి జిల్లా మనుగోపాలలో భూమి సమస్యపై గిరిజనులు సాగిస్తున్న ఉద్యమంపై సాయుధ పోలీసుల సమక్షంలోనే ఆ ప్రాంత భూస్వామి హోతా శ్రీరామచంద్రమూర్తి తన తుపాకీతో కాల్పులు జరిపి కా॥కారంపార్వతి అనే ఆదివాసీ కామ్రేడ్‌ను బలిగొన్న సంఘటనను కా॥కానూసన్యాల్ తీవ్రంగా ఖండించారు.

1998లో – శ్రీకాకుళ గిరిజనోద్యమంలో భూస్వామ్య, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అమరులైన వారి స్మారక స్థూపాన్ని–శ్రీకాకుళం బైపాస్ కూడలిలో నిర్మాణం చేసి, ఆ స్థూపావిష్కరణకు కామ్రేడ్ కానూసన్యాల్‌ను ఆహ్వానించగా చాలా సంతోషంతో కామ్రేడ్ కానూసన్యాల్ హాజరయ్యారు. స్థూప నిర్మాణం పట్ల ప్రజలలో వచ్చిన అపారమైన స్పందనను రాష్ట్ర పోలీసు యంత్రాంగం పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి, నిషేదాజ్ఞలను విధించి, గిరిజనులను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి స్థూపావిష్కరణను అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఈ పరిస్థితి తెలుసుకున్న కా॥ కానూదా రైల్వేస్టేషన్ నుండి వస్తూ దారిలోనే ఆగి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కామ్రేడ్ కానూసన్యాల్ ఈ క్రూర నిర్బంధాన్ని, అప్రజాస్వామిక విధానాల్ని పత్రికా విలేఖరుల సమావేశంలో తీవ్రంగా నిరసించారు.

స్థూపావిష్కరణను ప్రభుత్వం అడ్డుకోవటంపై కా॥కానూసన్యాల్ తీవ్రంగా స్పందించారు. "దేశంలో భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాటాల్లో ప్రాణాలర్పించిన పంచాది కృష్ణమూర్తి వంటి అమరయోధులకు శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని అడ్డుకోవటం ద్వారా చంద్రబాబునాయుడు టిడిపి ప్రభుత్వం, తన భూస్వామ్య అనుకూల సామ్రాజ్యవాద అనుకూల స్వభావాన్ని బయటపెట్టుకుంది. నగ్జల్బరీ రైతాంగ పోరాట విప్లవ పతాకను సమున్నతంగా నిలిపిన సాంప్రదాయం గల శ్రీకాకుళం ప్రజానీకాన్ని, ఈ ప్రజా వ్యతిరేక చర్యను ప్రతిఘటించమని సమీప భవిష్యత్తులోనే స్థూపావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టమ"ని కోరుతూ కామ్రేడ్ కానూసన్యాల్ పత్రికా ముఖంగా పిలుపునిచ్చారు.

1999లో ఉద్యమ ప్రయోజనాల రీత్యా సాగించిన ఎన్నికల ప్రచార సభలలో పార్వతీపురం ప్రాంతంలో కా॥కానూసన్యాల్, కా॥సుబ్రతోబసు, కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డితో కలిసి పాల్గొని ఉత్తేజకర ఉపన్యాసాలు చేశారు. పాలకుల దళారీ రాజకీయ విధానాల్ని శక్తివంతంగా ఎండగట్టారు. పోలవరం బహిరంగ సభకు అనుమతి నిరాకరించి పోలీసులు ఆ సభను జరపకుండా అడ్డుకున్నారు.

1999 నవంబరు 17వ తేదీన విజయనగరంజిల్లా దుగ్గేరు ప్రాంత పెత్తందార్లు, పోలీసులు కుమ్మక్కై భూమి సమస్యపై (తరువాయి 4వ పేజీలో)

## మరువలేని... (3వ పేజీ తరువాయి)

ఆందోళన సాగిస్తున్న గిరిజనులపై మారణా యుధాలతో చేసిన దాడిలో కామ్రేడ్ జెన్ని తిరుపతి అమరుడయ్యాడు. బాధితులైన 77మంది ఉద్యమ ప్రాంత కామ్రేడ్స్‌పై పోలీసులు హత్యానేరం మోపి అరెస్టులు సాగిస్తూ ప్రజల్ని భయభ్రాంతుల్ని చేయటం ద్వారా భూస్వామ్య, పెత్తందార్లకు ఊడిగం చేయదలచుకున్నారు. అమరులు కామ్రేడ్స్ ఎన్.వి.కృష్ణయ్య, ఎమ్.ఓంకార్ లాంటి వారిని సైతం ఉద్యమ ప్రజానీకాన్ని కలవనీయ కుండా రాజ్యం నిర్బంధం విధించి తిప్పి పంపిన కాలమది! ఈ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, తిరిగి శక్తులను కూడగట్టుకొని 2000 మే 7న విజయనగరంలో వేలాదిమంది గిరిజనుల, ప్రజల సమక్షంలో జరిపిన కామ్రేడ్ జెన్ని తిరుపతి సంస్మరణ సభకు కామ్రేడ్ కానూసన్యాల్ హాజరై నిప్పులు చెరిగే తన ప్రసంగం ద్వారా పోరాడుతున్న ప్రజలను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత గిరిజన కామ్రేడ్స్ తమ సాంప్రదాయక కర్రలు, విల్లంబులతో, ఎర్రజెండాలతో కదంతొక్కుతూ ఎదురేగి కామ్రేడ్ కానూసన్యాల్ తదితర కామ్రేడ్స్‌కు గౌరవవందనం చేసి తోడ్కొని రావటాన్ని ఆయన ఒక మంచి జ్ఞాపకంగా పదిలపరచుకున్నారు.

2001 ఏప్రియల్ 7,8 తేదీలలో గుంటూరులో రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలు జరిగాయి. అమరుడు కా॥మండ్ల సుబ్బారెడ్డిగారి అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాన వక్తగా కామ్రేడ్ కానూదా పాల్గొన్నారు. 'గొప్ప పోరాటాల సాంప్రదాయం గల ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రైతుకూలీ మహాసభకు నేర్చుకునేందుకు వచ్చాను. వీరోచిత తెలంగాణా రైతాంగ పోరాటం నడిపిన ఈ రైతాంగం ఇంకా అనేక తెలంగాణా పోరాటాలను నిర్మిస్తారని ఆశిస్తున్నాను' అంటూ మాట్లాడారు. 'నాకు అనేక అనుభవాలున్నాయి. నేను చెబుతున్నాను మీరు నేర్చుకోండి' అంటూ చెపుతున్న నాయకులను ఈనాడు అనేకమందిని చూస్తున్నాము. కానీ 'నేను నేర్చుకోవటానికి మీ వద్దకు వచ్చాను' అని చెప్పటం ప్రజల పట్ల, ఉద్యమాల పట్ల ఆ కామ్రేడ్‌కు వున్న నమ్రతను తెలియజేస్తున్నది.

2003 జనవరి 5న వివిధ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచీకరణ వ్యతిరేక సదస్సులో కామ్రేడ్ కానూసన్యాల్ పాల్గొని సామ్రాజ్యవాద ప్రపంచీకరణ బహుముఖ దోపిడీ పార్శ్వాలను వివరించారు. ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటానికి భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని పోటీ పెట్టటాన్ని ఖండిస్తూ, భూస్వామ్య వ్యతిరేక పోరాటం తీవ్రంగా సాగించటం ద్వారానే సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు అడ్డుకట్టవేయగలుగుతామని ధృడంగా ప్రకటించారు. 2004 లో ముంబాయిలో జరిగిన అఖిలభారత సదస్సులోనూ కామ్రేడ్ కానూదా ఇవే అంశాలను వక్కాణించి చెప్పారు.

2002 ఫిబ్రవరి 2వ తేదీన కా॥కానూదా కలకత్తాలో పత్రికా విలేఖరుల సమావేశంలో రైతాంగ సమస్యలపై మాట్లాడిన దానిని వక్రీకరిస్తూ 'హింసను విడనాడమ'ని నక్సలైట్లకు కానూసన్యాల్ ప్రబోధించినట్లు పత్రికలలో రావటం, దీనిని ఆంధ్రలో పోలీసులు పోస్టర్స్ వేసి తెలంగాణా ఏరియాలో అంటించటం జరిగింది. కా॥జస్వంతరావు కానూదా దృష్టికి ఈ అంశాన్ని తీసుకుని వెళ్ళిన వెంటనే ఈ విషయాన్ని కా॥ కానూదా ఒక పత్రికా ప్రకటన ద్వారా ఈ విధంగా ఖండించారు:

"ఆంధ్రప్రదేశ్ పోలీసులు నిరాధారమైన అబద్ధపు కల్పిత పోస్టర్లు వేసి నాపై బురద జల్లే ప్రయత్నాన్ని నేను ఖండిస్తున్నాను. వాటిలోని చెత్తను నేనెన్నడూ చెప్పలేదు. నా రాజకీయ వైఖరి దేశ ప్రజలందరికీ తెలిసిందే.

దేశ గత చరిత్ర అంతా పాలక వర్గాలు సాగించిన హింసతో నిండి వుందనీ కనుక ఆత్మరక్షణ కొరకు పాలకవర్గాల హింసను హింసతో ఎదుర్కొనే హక్కు భారత ప్రజలకుందని నేనెపుడూ చెబుతూనే వస్తున్నాను. లీగల్ అవకాశాలు వుంటే దానిని ఉపయోగించుకోరాదని దీనర్థం కాదు.

1967 కాలంలో నక్సల్‌బరీలో సాగిన రైతాంగ, కార్మిక సాయుధ పోరాటం సరైనదని, ఈనాటికీ విలువ కలిగి వుందనీ కూడా చెప్పాను. అదే సమయంలో 1969లో సిపిఐ(ఎం-ఎల్) ప్రబోధించిన సంహారక (ఎనిహిలేషన్) లేక వ్యక్తిగత హత్యల రాజకీయ పంథా తప్పని కూడా చెబుతూ వస్తున్నాను. ఎందుకంటే టెర్రరిజం మార్క్సిజం కాదు. నక్సల్‌బరీ సాయుధ రైతాంగ పోరాట పంథా, 1969 నాటి సిపిఐ(ఎం-ఎల్) రాజకీయపంథా భిన్నమైనవి. ఇది నా రాజకీయ వైఖరి దీని నుండి నేనేనాడూ వైదొలగలేదు. దీనిని మీ పత్రికలలో ప్రచురించండి".

కా॥కానూదా సి.ఓ.ఐ(ఎమ్.ఎల్) ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు విడుదల చేసిన పత్రికా ప్రకటన ఇది.

నగ్జల్బరీ వుద్యమాన్నుండి వెనుదిరిగాడని తప్పుడు ప్రచారాలు చేస్తున్న ఎంతో మంది దీనిని సరైన సమాధానంగా తీసుకోమని విజ్ఞప్తి చేస్తున్నాను.

2004 అక్టోబర్ 17న అనంతపురంలో నాగిరెడ్డి స్మారక కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కా॥తరిమెల నాగిరెడ్డి కాంస్య విగ్రహావిష్కరణకు కా॥కానూదా హాజరై, విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కా॥టి.యన్. గురించి మాట్లాడుతూ, 'ప్రజల పక్షాన నిలచి పిన్న వయసులోనే, భూస్వామి అయిన తండ్రిపైనే తిరుగుబాటు చేసిన, జీవితాంతం పీడిత ప్రజల పక్షాన పోరాటాలు నడిపిన కా॥టి.యన్ విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం తనకు కలగటం చాలా సంతోషం కలిగిస్తున్నదన్నారు. విశాఖపట్నంలో నిర్బంధ కాలంలో తాను కామ్రేడ్ టి.ఎన్‌ను కలిసే అవకాశం లభించిందనీ, సామ్రాజ్యవాద, దళారీ బూర్జువా, భూస్వామ్య విధానాలని ఆనాడే 'తాకట్టులో భారతదేశం'లో విపులంగా వివరించిన సిద్ధాంతవేత్తగా కామ్రేడ్ కానూసన్యాల్ పేర్కొన్నారు. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి వలెనే కామ్రేడ్ కానూసన్యాల్ కూడా విప్లవకారుల విగ్రహాల ఏర్పాటుకు వ్యతిరేకమైనప్పటికీ ఆ ప్రాంత విప్లవాభిమానుల కోరికమేరకు, పార్టీ నాయకత్వ విజ్ఞప్తి మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసి వచ్చింది.

ఈ కార్యక్రమానికి ముందురోజు 16.10.04న అనంతపురంలో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో విలేఖరులు సిపిఐ(మావోయిస్టు) పార్టీకి, ప్రభుత్వానికి జరుగుతున్న చర్చలపై ప్రశ్నించగా-కీలకమైన అంశాలేమిటో తనకు తెలియకుండా వ్యాఖ్యానించబోనన్నారు. 'ఆయుధాలు వీడాలని ప్రభుత్వం అడుగుతున్నది కదా' అని ప్రశ్నించగా ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల కారణంగానే ప్రజలు ఆయుధాలు చేపట్టవలసి వస్తున్నదని, ప్రజలను ఆయుధాలు వీడమని అడిగే హక్కు పాలకులకు లేదని కరాఖండీగా ప్రకటించారు. మరో ప్రశ్నకు సమాధానంగా నక్సలిజం, నక్సలైట్లు అనే పదాలను ప్రభుత్వం, పత్రికలు సృష్టించాయని, వాస్తవ అర్థంలో నిజమైన విప్లవ కారులంతా మార్క్సిస్టు లెనినిస్టులేనని వివరించారు. కామ్రేడ్ కె.ఎస్ తన అపార అనుభవం, రాజకీయ, సిద్ధాంత పరిణితి మేళవించి ఈ విలేఖరుల సమావేశంలో అనేక అంశాలపై సవివరమైన సమాధానాల నిచ్చారు. కా॥ కానూసన్యాల్‌తోపాటు కామ్రేడ్ అసిత్‌సిన్హా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2004 డిసెంబర్ చివరి వారంలో సిపిఐ(ఎం-ఎల్) ప్లీనం పశ్చిమబెంగాల్‌లోని మిద్నపూర్‌లో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో 60 నిముషాల పాటు తన మాతృభాష అయిన బెంగాలీలో అంతర్జాతీయ, దేశీయ పరిస్థితుల మీద, విప్లవకారులుగా ఈ దోపిడీ వ్యవస్థను కూలద్రోయటానికి మనముందున్న కర్తవ్యాన్ని గురించి చేసిన ప్రసంగం అక్కడ ప్రజలకు, కార్యకర్తలకు నూతనోత్సాహాన్నిచ్చింది. ముగింపులో వేలాది నగ్జల్బరీలను నిర్మించండంటూ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఇది ఎప్పటికీ మరువలేని జ్ఞాపకంగా నాకే కాదు నాతోటి మిత్రులకు కూడా నిలిచిపోయిందను కుంటున్నాను.

2005 జనవరిలో విజయవాడలో జరిగిన విప్లవకారుల ఐక్యతా మహాసభ సందర్భంగా ప్రారంభసభలో నేటి పాలకవర్గాల దోపిడీ విధానాలు, ప్రజల స్థితిగతులపై, నేటి విప్లవకారుల ముందున్న కర్తవ్యాల గురించి పులిలా గాండ్రిస్తూ చేసిన ప్రసంగం మరపురానిది. ప్రారంభ సభ అనంతరం జరిగిన ప్రదర్శనలో కామ్రేడ్ కానూదా 8 కిలోమీటర్ల పొడవునా కాలినడకనే పాల్గొన్నారు. 'అలసిపోయారు, వెళదాం రండి' అని పిలిచినా 'ప్రారంభించాక వెనుదిరిగే సమస్యే లేద'ని మొండి సమాధానం చెప్పారు. విప్లవకారుల ఐక్యతా క్రమం సుగమమౌతోందన్న సంతోషం ఆయనలో వ్యక్తమైంది. చాలా ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనటంతోపాటు, స్ఫూర్తిదాయకంగా బాధ్యతలు నిర్వహించిన ఆంధ్ర కమిటీ కామ్రేడ్స్‌ను హృదయ పూర్వకంగా అభినందించారు.

సుదీర్ఘకాలం పాటు భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం అతి, మితవాదాలకు గురైన ఫలితంగా అపరిష్కృతంగా వుండిపోయిన అనేకానేక సమస్యలనే సామ్రాజ్యవాదులు సాధనాలుగా చేసుకుని తిరిగి ప్రజలపై ప్రయోగిస్తున్నారనే విషయాన్ని గుర్తెరిగి వివిధ సందర్భాలలో కామ్రేడ్ కానూదా వక్కాణించి చెప్పేవారు.

2006 జులై 4న దొడ్డి కొమరయ్య అమరత్వం పొంది 60 సం॥ల సందర్భంగా వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి నందుకోవాలని పిలుపునిస్తూ పార్టీ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన బహిరంగ సభకు కామ్రేడ్ కానూదా, కా॥సుబోధ్ మిత్రా తదితరులు హాజరై ప్రసంగించారు. కామ్రేడ్ దొడ్డి కొమరయ్యకు నివాళులర్పించారు.

2007 జులైలో విజయవాడలో జరిగిన పార్టీ అఖిల భారత ప్లీనం సమావేశాల సందర్భంగా జరిగిన బహిరంగసభలో కామ్రేడ్ కానూదా ఆరోగ్య పరిస్థితి సహకరించకున్నా పాల్గొని, ప్రజల సమస్యలు-పాలకుల దుర్మార్గాలపై 45 నిముషాలపాటు అనర్గళ ఉపన్యాసం చేశారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, ప్రత్యేకించి వామపక్ష ప్రభుత్వంగా పాలన సాగిస్తున్న పశ్చిమబెంగాల్‌లో నందిగ్రామ్, సింగూర్‌లో సాగించిన హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తూ కార్మికవర్గ పోరాటాలను తీవ్రం చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఇది ఆంధ్రా కామ్రేడ్స్‌కు ఇచ్చిన చివరి ప్రసంగం కావటం మానసికంగా కృంగదీసింది.

అఖిల భారత ప్లీనం సమావేశాల సందర్భంగానే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రచురించిన 'హిస్టారికల్ అండ్ పొలిమికల్ డాక్యుమెంట్స్'ను కామ్రేడ్ కానూసన్యాల్ ఆవిష్కరించి విలువైన కృషి సాగిస్తున్నందుకు ట్రస్టు కామ్రేడ్స్‌కు అభినందనలు తెలియజేశారు.

మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానపు తాత్విక చింతనతో ఆచరణ, రాజకీయరంగాల్లో అలుపెరగని పోరాటం సాగించిన విప్లవకారుడు కామ్రేడ్ కానూసన్యాల్. పార్టీ నిర్మాణంలోనూ, ఉద్యమంలోనూ చిన్నపాటి అవకాశవాదాన్ని కూడా సహించలేని, రాజీపడని మనస్తత్వం ఆయనది. ప్రజా ఉద్యమాలతో మమేకమవటం, అత్యంత నిరాడంబరంగా జీవించటం ఆయన జీవనశైలి. విషయాలపట్ల లోతైన పరిశీలన, అధ్యయనం-ముఖ్యంగా బెంగాలీ, నేపాలీ భాషలలో అనర్గళంగా మాట్లాడటం ద్వారా సామాన్య ప్రజానీకాన్ని కూడా ఆకట్టుకోగలగటం ఆయన ప్రత్యేకత. ఏ ప్రాంతానికి వెళ్ళినా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా ఆయనకు లభించే గుర్తింపుపట్ల వినమ్రంగా వుండే స్వభావం కామ్రేడ్ కానూసన్యాల్‌ది. ప్రచార పటాటోపానికి దూరంగా పరిమితిలో వుండగలగటము ఆయననుండి నేర్చుకోవలసిందే. అతి చిన్న కార్యకర్త మొదలు ఉన్నత స్థాయి నాయకత్వం వరకూ తాను పరిచయాల్లోకి వెళ్ళిన వారందరినీ పేరు పేరునా ప్రస్తావించగలగటం ఆయన కేంద్రీకరణ, జ్ఞాపకశక్తికి ఉదాహరణ. నిర్బంధం ఎక్కడ, ఏరూపంలో వున్నా నిర్ద్వంద్వంగా ఖండించటం ఆయన నైజం. దేశ వ్యాపితంగా ప్రజా ఉద్యమాలన్నింటినీ ఎత్తిపట్టగలగటం ఆయన విశాల ఉద్యమ ఆకాంక్షలకు రుజువు. 81 సం॥ల సుదీర్ఘ ప్రయాణం తరువాతకూడా మరెన్నో కర్తవ్యాలు వున్నాయి, ఆరోగ్యం అనుమతించటం లేదనేది ఆయన ఆవేదన. 2009 డిసెంబరులో ఒక సమావేశ సందర్భంగా కలిసిన కోరాపుట్ ఉద్యమ ప్రాంత ఆదివాసీ ఉద్యమ నాయకులు కామ్రేడ్స్ అర్జున్ తదితరులను ఆప్యాయంగా దగ్గర కూర్చోబెట్టుకొని బాగా పనిచేయమని ప్రోత్సహించారు.

2010 ఫిబ్రవరిలో కా॥కానూసన్యాల్ అనారోగ్యంతో ఉండటం వలన పరామర్శించటానికి ఆయన నివాసానికి నేనువెళ్ళిన సందర్భంలో నా రాకను ఎంతో ఆత్మీయంగా స్వీకరించారు. ఉత్తరాంధ్ర ఉద్యమం ముఖ్యంగా కోరాపుట్ ఉద్యమం గురించి వివరమైన రిపోర్టును అడిగి మరీ తెలుసుకున్నారు. గణనాథ్‌పాత్రో రాజకీయ వైఖరులు, పిన్నింటి సురేష్ హత్య, కామ్రేడ్ కిర్మపై అత్యాచారం, ఉద్యమంలో ఎదుర్కొంటున్న తదితర సంఘటనలను వివరాలనూ, తెలుసుకొని ఉద్యమంలో ఎదురౌతున్న పెదధోరణులపట్ల ఆవేదనను వ్యక్తం చేస్తూనే సరైన పంథాతో ప్రజల్ని అంటిపెట్టుకొని ఒడిదుడుకులను ఎదుర్కొంటూ నిబ్బరంగా పనిచేసుకుంటూ వెళ్ళటం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్ర రాష్ట్ర నాయకత్వం సరైన విధంగా మార్గదర్శకత్వం వహించగలుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ముందు ముందు ఈ పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారవచ్చుననీ, మారిన పరిస్థితులను ఎదుర్కోవటంలో నీవు ఎప్పటికంటే మరిన్ని కష్టాలను ఎదుర్కోవలసి వుంటుందని కా॥కానూదా మాట్లాడిన మాటలు సదా జ్ఞాపకముండిపోయాయి. ఉద్యమ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయా పార్టీ కమిటీలు సైద్ధాంతిక రంగంలో ఏ మాత్రం వెనుకబడరాదనీ, అధ్యయనం-సిద్ధాంతం - ఉద్యమం విడి అంశాలు కావనీ ఒకదానినొకటి ప్రభావితం చేస్తుందనీ, కనుక కమిటీలు దీనిని అందుకోవటానికి సన్నద్ధమవటం తప్ప మరో మార్గం లేదంటూ ఎంతో రాజకీయ దృష్టితో మాట్లాడిన విషయాలను నేను ఎన్నటికీ మరువలేను. 2010 ఆగస్టు 9న మావోయిస్టులు కామ్రేడ్ అర్జున్‌ను హత్య చేసిన సందర్భంగా, కామ్రేడ్ కానూసన్యాల్ పార్టీ రివిజనిస్టు పార్టీ అంటూ పేపర్లకు ఎక్కిన సందర్భంగా కానూదా నాతో సాగించిన చివరి సంభాషణ ప్రతిక్షణం గుర్తొస్తూ వుంది.

2010 మార్చి 23 మధ్యాహ్నం కామ్రేడ్ కానూదా భౌతికంగా మనల్ని వీడి వెళ్ళిపోయారన్న వార్త నన్ను నిశ్చేష్టురాలిని చేసింది.

కామ్రేడ్ కానూ సన్యాల్ మరణానంతరం సిలిగురి లోనూ, కలకత్తాలోనూ జరిగిన సంస్మరణ సభలలో పాల్గొన్న సందర్భంగా వివిధ పార్టీలు, సన్నిహిత సంబంధాలున్న మేధావులు, ప్రజలు పాల్గొని నివాళులు అర్పించిన తీరు మరచిపోలేనిది. సాధారణ ప్రజానీకాన్ని, చిన్న స్థాయి కార్యకర్తలను ఎంతగా ఆయన ప్రభావితం చేశారో, మేధావులనూ ప్రజాతంత్రవాదులనూ ఆయన ఆదే తీరులో ప్రభావితం చేశారని నాకర్థమైంది.

2010 మార్చిలో కామ్రేడ్ కానూసన్యాల్ మరణానంతరం మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కామ్రేడ్ కానూసన్యాల్ సంస్మరణ సభలు జరిపి నివాళు లర్పించాం. దీనిలో భాగంగానే శ్రీకాకుళంలో నిర్వహించ తలపెట్టిన కామ్రేడ్ కానూసన్యాల్ వర్ధంతి సభను జరపనీయకుండా పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించి అడ్డగించటమనేది ఈనాటికీ కా॥కానూసన్యాల్ అంటే పోలీసు, ప్రభుత్వ యంత్రాంగం ఎంతగా ఉలికిపడుతుందో స్పష్టమౌతున్నది. శ్రీకాకుళాన్ని ప్రస్తావించినప్పుడల్లా 'తప్పెటగుళ్ళు' కళారూపాన్ని ఆయన ప్రత్యేకించి ప్రస్తావించటం తలపుకొస్తుంది. భౌతికంగా మరణించినా ఒక ఉద్యమశక్తిగా, నిరంతర చైతన్యశీలిగా కార్యకర్తలకు, కామ్రేడ్స్‌కు కామ్రేడ్ కానూదా ఆదర్శమూర్తిగా, మార్గదర్శకుడిగా సదా నిలిచే వుంటారు.

**ఆ కామ్రేడ్‌కు నా ఎర్రెర్రని వందనాలు.** ✶

## కామ్రేడ్ కానూసన్యాల్... (మొదటిపేజీ తరువాయి)

భూములనూ, ప్రాణాలనూ రక్షించుకునేందుకు ఉవ్వెత్తున ఎగసిన నందిగ్రామ్ ప్రజల ప్రతిఘటనను ఆయన కొనియాడారు. నక్సల్బరీని మరింత పెద్ద స్థాయిలో పునర్నిర్మించగల అవకాశాన్ని ఆయన దీనిలో చూశారు. అదే సమయంలో, కమ్యూనిస్టు విప్లవ కారుల వ్యవహారశైలికి ఆయన ఆందోళన చెందారు. పాకలవర్గాల ప్రతిపక్ష ముఠా(తృణమూల్) ప్రజల న్యాయమైన పోరాటాన్ని తమ అధికార రాజకీయ యుద్ధంలో ఫిరంగి గుండుగా వాడుకునేందుకు అన్నిరకాలుగా ప్రయత్నిస్తుండగా, కమ్యూనిస్టు విప్లవకారుల్లో కొన్ని సెక్షన్లు దానికి ఏదో ఒక రూపంలో సహాయమందిస్తున్నారు. కాగా మరికొందరు విడిపోయి, బలహీనంగా వుండి స్వతంత్రంగా ఉనికిని చాటుకోలేని స్థితిలో, ప్రజలకు నాయకత్వాన్ని అందించలేని స్థితిలో వున్నారు.

విప్లవంలో ప్రజలకు నాయకత్వాన్ని అందించగల కమ్యూనిస్టు పార్టీని నిర్మించవలసిన జరూరు కర్తవ్యాన్ని కా॥కె.ఎస్. ఎప్పుడూ నొక్కి చెప్పేవారు. హృదయపూర్వకంగా ప్రజల్లోకి వెళ్లమనీ, ప్రజల్లో కలగలసి పొమ్మనీ, వారి విశ్వాసాన్నీ, ప్రేమనూ చూరగొనమనీ, కష్టాలను ఓర్చి, అంకితమై ప్రజలలో రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణకృషి సాగించమనీ పార్టీ కమిటీలను ఆయన నిరంతరం కోరేవారు. తెలంగాణా(1946-51) నక్సల్బరీలు చూపిన మార్గమే ప్రస్తుత వ్యవస్థకు మౌలికంగా మార్గమని ఆయన చెబుతూనే అలాంటి అవసరమైన పరిస్థితులను సృష్టించటం మన ప్రధాన కర్తవ్యమని కూడా చెప్పేవారు. రాజకీయ, నిర్మాణపర, ప్రజా కృషిగా బాగా జరిగిన నివేదికలను ఆయన శ్రద్ధగా విని తగిన సూచనలందించేవారు.

కమ్యూనిస్టు విప్లవశ్రేణులూ, ప్రజలూ ప్రేమించిన; రాజకీయంగా ఏకీభవించనివారూ, రాజకీయంగా వ్యతిరేకులూ కూడా గౌరవించిన నాయకుల్లో ఒకరు కా॥కె.ఎస్. కామ్రేడ్లతోనూ, ప్రజలతోనూ సన్నిహితంగా, ఆదరణగా వుండేవారు; అందరికీ అందుబాటులో వుండేవారు; సమస్యతో సంబంధం వున్న వారందరితో అభిప్రాయాలు కలబోసుకునేవారు. ఆయన రాజకీయ వ్యతిరేకులు వ్యంగ్యాస్త్రాలు వేయటానికి జంకేవారు. కఠినమైన తిరుగు సమాధానం వస్తుందని వారికి తెలుసు. అయినా ఆయన సాదాసీదా జీవనశైలి, సూత్రబద్ధ, క్రమశిక్షణా జీవనం, మార్క్సిస్టు సిద్ధాంతం, రాజకీయాలపై మొక్కవోని విశ్వాసం, కుండబ్రద్దలు కొట్టినట్టు మాట్లాడేతీరు ఆయన్ను గౌరవనీయుడిని చేశాయి.

2010 మార్చి 23న మనలను వీడిపోయే వరకూ కా॥కానూసన్యాల్ మా నిర్మాణం-సిపిఐ(ఎం.ఎల్)కు ప్రధాన కార్యదర్శి. బహుశా నక్సల్బరీ పోరాటం తర్వాత ఆయన జీవితంలో ఇదే ఎక్కువ సంతోషించినకాలం. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనావిధానం ప్రాతిపదికగా, తెలంగాణా, నక్సల్బరీలు చూపిన విప్లవ ప్రజా పంథాతో, మితవాద అవకాశవాదంనుండీ, అతివాద అవకాశవాదం, ఒంటెత్తువాదం, వ్యక్తిగత హింసా వాదాలనుండి స్పష్టంగా విడగొట్టుకున్న, కమ్యూనిస్టు విప్లవకారులను ఐక్యపరచి, పార్టీని నిర్మించే, ప్రజల్లో లోతుగా వేళ్లూనుకుని వారిని విప్లవోద్యమంలోకి సమీకరించగల నిర్మాణాన్ని ఆయన ఆకాంక్షించారు; దానికోసం నిరంతర పోరాటం సలిపారు. తాను నిర్మించిన ఈ సంస్థ తన ఆకాంక్షలకు సరితూగే విధంగా రూపొందుతున్నదన్న ఆశా, విశ్వాసం ఆయనకుండేవి. ఔను, తప్పనిసరిగా వాటిని మేము నెరవేర్చుతాము.

***కా॥కానూదాకు అరుణారుణ జోహార్లు!*** ✶

పత్రికా ప్రకటన

# లిబియాపై అమెరికా, పశ్చిమ యూరపు సామ్రాజ్యవాద దేశాల దురాక్రమణ దాడిని ఖండించండి!

**అమెరికా,** పశ్చిమ యూరపు సామ్రాజ్యవాదులు లిబియాపై 'ఆపరేషన్ ఒడిస్సీ డాన్' పేరిట దురాక్రమణ యుద్ధాన్ని ప్రారంభించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలితో లిబియా గగనతలంపై విమానాలు ఎగురరాదన్న తీర్మానం చేయించి, దానిని అమలు జరిపే సాకుతో ఫ్రెంచి సైన్యం బాంబులు వేసింది. మధ్యధరా సముద్రంలోకి చేరిన అమెరికా, బ్రిటన్, ఇటలీ నౌకాదళాలు లిబియాపై క్షిపణులతో దాడి సాగిస్తున్నాయి. గడాఫీ పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్ష నాయకత్వంలో సాగుతున్న ఉద్యమంపై నిర్బంధం పెట్టడం టెర్రరిజంతో సమానమంటూ, ఆ టెర్రరిజంపై పోరులో భాగంగా లిబియాపై సైనికచర్య తీసుకున్నట్లు ఒబామా ప్రకటించాడు. మొదటిరోజు దాడిలోనే 60మందికి పైగా లిబియా ప్రజలు మరణించారు. 150 మంది గాయపడ్డారు. ఈ దాడులు కొనసాగుతున్నాయి.

1969లో సైనిక తిరుగుబాటుద్వారా అధికారాన్ని చేజిక్కించుకున్న అనంతరం, గడాఫీ, లిబియాలోని చమురు వనరులన్నింటినీ జాతీయం చేశాడు. చమురుపై వచ్చే ఆదాయంలో అధిక భాగాన్ని లిబియా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి వెచ్చించాడు. వర్గ అంతరాలు కొనసాగుతున్నప్పటికీ, ప్రజల జీవన పరిస్థితులు చాలా అభివృద్ధి చెందాయి. ట్యునీషియా బెన్ ఆలీలాగా, ఈజిప్టు ముబారక్‌లాగా సామ్రాజ్యవాదుల చేతిలో కీలుబొమ్మగా వ్యవహరించేందుకు గడాఫీ నిరాకరించాడు. గఢాఫీని అధికారంనుండి కూలద్రోసే లక్ష్యంతో, అమెరికా సామ్రాజ్యవాదం 1986లో లిబియా రాజధాని నగరం ట్రిపోలీపైనా, చమురు ఉత్పత్తి కేంద్రమైన బెంఘాజీలపై వైమానిక దాడులు సాగించి పసిబిడ్డ అయిన గఢాఫీ కుమార్తెతో సహా 60 మందిని హతమార్చింది. ఇంకాపైగా, అమెరికా మరియు ఐక్యరాజ్యసమితీ లిబియాపై ఆంక్షలు విధించి ఆ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాయి.

ఆహారం, అత్యవసర సరుకుల దిగుమతిలేక తీవ్ర కొరతలను ఎదుర్కొనే క్రమంలోనే, 2003లో ఇరాక్‌పై అమెరికా సాగించిన దురాక్రమణ తదనంతరం గఢాఫీ సామ్రాజ్యవాదులను సంతృప్తి పరిచే వైఖరి నవలంబించటం ప్రారంభించాడు. విదేశీ బ్యాంకులకు, బహుళజాతి కంపెనీలకు తమ ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరిచాడు. ఐ.ఎం.ఎఫ్. షరతులకు ఆమోదం తెల్పటంద్వారా వ్యవస్థాగత సర్దుబాట్ల పేరిట అనేక దేశీయ కంపెనీలను ప్రైవేటీకరించటం; ఆహారం, ఇంధనాలపై ఇస్తున్న సబ్సిడీలలో కోతవిధించటం జరిగింది. సామ్రాజ్యవాద దోపిడీ కారణంగా ప్రపంచ దేశాలలో ప్రజలెదుర్కొన్న విధంగానే లిబియా ప్రజలు కూడా అధిక ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలతో సతమతమౌతున్నారు.

అరబ్ ప్రపంచంలో ఒక రాజకీయ మార్పుకోసం సాగుతున్న ఉద్యమాల ప్రభావం లిబియానూ తాకిందనే దాంట్లో సందేహంలేదు. గడాఫీ పాలనకు వ్యతిరేకంగా అసంతృప్తి పెరుగుతుండటం, ట్యునీషియాలో పరిణామాలూ లిబియాలో ప్రజాఉద్యమాన్ని ప్రభావితం చేశాయన్నదీ నిస్సందేహమే. ఏమైనప్పటికీ, లిబియాలో ప్రతిపక్ష నాయకులుగా చెలామణి అవుతున్న వారిలో అత్యధికులు పశ్చిమ దేశాల ప్రాపకంతో ముందుకొచ్చారనే విషయం, సామ్రాజ్యవాదుల దీర్ఘకాల నమ్మకమైన సేవకులనే విషయం ప్రగతిశీల శక్తులు తెలుసుకోవటం చాలా ముఖ్యమైనది. గణతంత్ర బావుటాను దింపేసి ఈ నాయకులు అమెరికా, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కీలుబొమ్మ అయిన, గద్దె దిగిన రాజు ఇద్రిస్ పతాకను ప్రతిష్టించారు.

లిబియా ప్రజల ఊచకోతల పేరిటా, పశ్చిమదేశాలు ఈ ప్రజలను ఆదుకోవాలనే పేరిటా పెద్దస్థాయిలో ప్రచారం జరుగుతున్నది. కానీ అమెరికా సామ్రాజ్యవాదపు నిరంతర అణచివేతలో బలౌతున్న పాలస్తీనీయుల గురించి, ఆఫ్ఘనులగురించి, ఇరాకీల గురించి మాటమాత్రంగా కూడా పేర్కొనటం లేదు. గడాఫీ ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న నిర్బంధాన్ని మనం ఖండిస్తున్నామంటే అది సామ్రాజ్యవాదుల చౌరబాటుకు అంగీకారం తెలియజేయటం కాదు. లిబియాలో ప్రజల ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటం సామ్రాజ్యవాదుల ఉద్దేశ్యం కాదు. ఆయిల్ వనరులపై పట్టుకోసం సామ్రాజ్యవాదుల తాపత్రయమది. ఆఫ్రికా ఖండంలోకెల్లా 45 బిలియన్ బారెళ్ళ అత్యధిక ఆయిల్ వనరులను కలిగిన దేశంగా లిబియా వుంది. గడాఫీ అందించే రాయితీలు సామ్రాజ్యవాదులకు ఏమాత్రం సంతృప్తిగా లేవు. తమ కీలుబొమ్మ ప్రభుత్వం అక్కడ వుండాలని వారు భావిస్తున్నారు. వారు ప్రయత్న పూర్వకంగా ప్రజాఉద్యమాన్ని తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని నెలుకొల్పే దిశగా నడిపిస్తున్నారు. వారి ప్రయత్నాలు ఈ రోజున సైనిక దురాక్రమణ దిశగా సైనిక దాడుల రూపం తీసుకున్నాయి.

ఇంకోవిధంగా చెప్పాలంటే అమెరికా, పశ్చిమ ఐరోపా పాలకుల అర్థవలసగా లిబియా పరివర్తన చెందాలనీ, లిబియాలోని ఆయిల్ వనరులపై నియంత్రణ, ఆధిపత్యం వారికి లభించటంతోపాటుగా ఆఫ్రికా దేశాల ప్రజలపై సైనిక చర్యలకు వ్యూహాత్మక స్థావరంగా రూపొందాలనీ భావిస్తున్నారు.

లిబియాను ఎవరు పరిపాలిస్తారనే సమస్య లిబియా ప్రజలు నిర్ణయించుకోవలసింది. కానీ సామ్రాజ్యవాదులకు ఏ రూపంలోనూ లిబియా దేశ ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకునే ఏ విధమైన హక్కూ లేదు.

ప్రగతిశీల, శాంతికాముక, ప్రజాస్వామిక, విప్లవ శక్తులన్నీ లిబియా ప్రజలకు అండగా నిలవాలి. వారి న్యాయమైన డిమాండ్లకు మద్దతివ్వాలి. సామ్రాజ్యవాదుల సైనికదాడితో సహా వారి జోక్యం ఏ రూపంలో వున్నా దాన్ని ఖండించాలి. లిబియా భవిష్యత్తును నిర్ణయించుకోవలసింది లిబియా ప్రజలే!

అరవిందసిన్హా, కేంద్ర కమిటి నాయకులు

21-3-2011

**సి.పి.ఐ (ఎం.ఎల్)**

# లిబియాపై నాటో దాడికి నిరసన ప్రదర్శన

**ఢిల్లీ, 24-3-2011**

**సిపిఐ(ఎం.ఎల్)**, ఎస్‌యుసిఐ(సి), సిజిపిఐ, పీపుల్సు ఫ్రంటులు సంయుక్తంగా పార్లమెంటు వీధిలో జంతర్‌మంతర్‌వద్ద నిరసన ప్రదర్శన చేశాయి. లిబియా ఆంతరంగిక వ్యవహారాలలో అమెరికా ఆధ్వర్యాన నాటో సైనిక జోక్యాన్ని అవి ఖండించాయి. ఈ సందర్భంగా ప్రదర్శకులనుద్దేశించి సిపిఐ(ఎం-ఎల్) ఢిల్లీ రాష్ట్రకార్యదర్శి కా॥పికె సాహి, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్రకార్యదర్శి కా॥ప్రతాప్ సామల్, కమ్యూనిస్టు గదర్‌పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి కా॥ప్రకాష్‌రావు, పీపుల్సు ఫ్రంటు కార్యదర్శి కా॥నరేందర్ ప్రసంగించారు.

అమాయక పౌరులపై నిరంకుశ గడాఫీ ప్రభుత్వ హింసాకాండను ఆపాలన్న సాకుతో అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వాన నాటో ప్రారంభించిన సైనిక దాడిని ఉపన్యాసకులు తీవ్రంగా ఖండించారు. గడాఫీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా లిబియా ప్రజల పోరాడే హక్కుకు మద్దతు తెలుపుతూనే, తమ దేశంలో ఎలాంటి ప్రభుత్వముండాలో నిర్ణయించుకోవలసింది లిబియా శ్రామిక ప్రజలేనని స్పష్టంచేశారు. ఐరాసను రబ్బరు స్టాంపుగా చేసి నాటో సైనికదాడికి పాల్పడి లిబియా ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు సామ్రాజ్యవాద రక్కసులకు లేదని స్పష్టంచేశారు. లిబియా ప్రజలనూ, ప్రజాస్వామ్యాన్నీ రక్షించే లక్ష్యంతో ఈ సైనిక దాడులు జరగటంలేదనీ, లిబియా ముడిచమురు క్షేత్రాలను ఆక్రమించి అక్కడ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పరచేందుకూ, ఈ ప్రాంత ప్రజాఉద్యమాలను అణచివేసేందుకూ సాగుతున్నదని వివరించారు. లిబియా దురాక్రమణను తక్షణమే ఆపాలని డిమాండు చేశారు.

లిబియా ప్రజలకు సంఘీభావాన్ని వ్యక్తంచేసిన నాయకులు, లిబియానుండి అమెరికా తప్పుకోవాలని ప్రజాభిప్రాయంతో ఒత్తిడి తెచ్చేందుకు సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాస్వామిక శక్తులు పూనుకోవాలని పిలుపునిచ్చారు.

# పశ్చిమబెంగాల్ శాసనసభ ఎన్నికలు

## సి.పి.ఐ[ఎం-ఎల్] పశ్చిమ బెంగాల్ రాష్ట్రకమిటి పిలుపు

**సామ్రాజ్యవాద** ప్రపంచీకరణతో రాజీపడిన; జీవితాలూ, జీవనాధారాల కొరకు పోరాడుతున్న శ్రామిక ప్రజల ఉద్యమాలనూ, వారి ప్రజాస్వామిక హక్కులనూ పాశవికంగా అణచివేస్తున్న, సిపిఐ(యం) వామపక్ష సంఘటనను తిరస్కరించండి! ఓడించండి!

దేశంలో వినాశకర సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను ప్రారంభించి అమలుచేస్తున్న కాంగ్రెసు, తృణమూల్ కాంగ్రెసు కూటమినీ, దాని తోకలుగా వున్న ఎస్‌యుసిఐ(సి) తదితర పార్టీలనూ తిరస్కరించండి! ఓడించండి!

సిపిఐ(ఎం-ఎల్), కమ్యూనిస్టు విప్లవకారుల, పోరాడే వామపక్ష, నిజమైన ప్రజాస్వామిక అభ్యర్థులను పార్లమెంటులోపలా, బయటా ప్రజానుకూల ప్రత్యామ్నాయం కొరకు, ప్రజాపోరాటాలను పురోగమింప చేసేందుకు బలపర్చండి! గెలిపించండి!

సిపిఐ(యం), సిపిఐలు అగౌరవపరుస్తున్న అరుణపతాకను సమున్నతంగా నిలపండి! సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దాడిపై ప్రజాపోరాటాల పంథాలో పురోగమించండి!

### పశ్చిమ బెంగాల్ సిపిఐ(ఎం.ఎల్) స్వతంత్రంగా పోటీచేస్తున్న స్థానాలు

**డార్జిలింగ్ జిల్లా**

ఫాన్సిదేవా–కా॥రామ్‌గణేష్ బరాయ్

మాటిగారా–నక్సల్బరీ–కా॥దీపూ హల్దార్

**ఉత్తర దీనాజ్‌పూర్ జిల్లా**

కలియాగంజ్–కా॥రబీంద్రనాథ్ బర్మన్

హమ్తాబాద్ – కా॥దేబా శర్మ

**దక్షిణ దీనాజ్‌పూర్‌జిల్లా**

కుష్‌మండీ–కా॥గౌరాంగ బర్మన్

హరిరామ్‌పూర్–కా॥శామూ సొరేన్

కలకత్తా

29-3-2011

సుబ్రతోబసు, కార్యదర్శి

పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటి

సిపిఐ(ఎం.ఎల్)

# తమిళనాడు శాసనసభ ఎన్నికలు

## సి.పి.ఐ[ఎం-ఎల్] తమిళనాడు రాష్ట్రకమిటి పిలుపు

**ఐదురాష్ట్రాలకు** జరుగుతున్న శాసనసభ ఎన్నికలలో తమిళనాడు ఒకటి. తమిళనాడులో రెండు కుటుంబాలు రాజకీయాధిక్యత కోసం పెనుగులాడుతుండటం అందరికీ తెలుసు. బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా పేరున్న తమిళనాడులో ప్రజల మౌలిక సమస్యలు అలాగే మిగిలివున్నాయి. కొన్ని సంవత్సరాలు ఒక కూటమి, మరికొన్ని సంవత్సరాలు ఇంకొక కూటమి అధికారంలోకి రావడం జరుగుతూనేవుంది. కానీ ఏ కూటమీ గ్రామసీమలకు సంబంధించిన భూమి సమస్యతో సహా ఇతర ఏ సమస్యలూ పరిష్కరించలేదు. పైగా అవినీతి అక్రమాలతో రాజ్యమేలుతున్నాయి. ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నాయి. ఆ కారణంచేత సిపిఐ(ఎం-ఎల్) ప్రజల మౌలిక సమస్యలైన దున్నేవానికే భూమి, అందరికీ కూడూ, గుడ్డా, ఇల్లూ సాధనకై ఉద్యమించమనీ ప్రజల ప్రజాస్వామిక హక్కులు–జీవించే హక్కు, ప్రచారహక్కు, సంఘం పెట్టుకునే హక్కు, పోరాడే హక్కుల కోసం నిలబడమనీ, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం సంసిద్ధం కమ్మనీ ప్రజలందరికీ పిలుపునిస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ సామ్రాజ్యవాద, దళారీ విధానాలకు ఏ విధంగానూ భిన్నంగాలేని విధానాలను అనుసరిస్తున్న తమిళనాడు పాలక పార్టీలు భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గానికి సేవలు చేస్తున్నవి. ప్రధానంగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తూన్న డిఎంకె, ఎఐడిఎంకేల రెండు కూటములూ ప్రజల్ని దోపిడీ చేస్తూ వేలకోట్ల రూ॥ కుంభకోణాలతో మునిగి తేలుతున్నారు. డిఎంకె కాంగ్రెస్‌తో; ఎఐడిఎంకె, సిపిఐ(ఎం)లతో పొత్తులు కుదుర్చుకుని ఎన్నికల్లో పోటీకి దిగాయి. ఇవన్నీ అధికార పగ్గాలు చేజిక్కించుకుని తిరిగి ప్రజల్ని యధేచ్ఛగా దోపిడీ గావించేందుకు ఈ ఎన్నికల్లో పోటీకి దిగి ప్రజల్ని ప్రలోభ పెట్టేందుకు అన్ని పద్ధతులూ అనుసరిస్తున్నాయి. గతంలో జయలలిత అధికారంలో వున్న సమయంలోనే తమ డిమాండ్ల సాధనకోసం ఆందోళన సాగించిన ప్రభుత్వ ఉద్యోగులను ఒక్క కలం పోటుతో డిస్మిస్ చేసి పోరాడే హక్కును కాలరాచి నియంతనని నిరూపించుకుంది. ఇలాంటి ప్రజావ్యతిరేక చర్యలకు ఒడిగట్టిన ఏఐడిఎంకెని ప్రజలు గత ఎన్నికల్లో చిత్తుగా ఓడించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన డిఎంకె కూడా –అన్ని అధికార పదవుల్నీ చేజిక్కించుకుని కుటుంబం మీడియా, సినీ, వ్యాపార రంగాలను శాసిస్తూ కుటుంబ గుత్తాధిపత్యానికి నిలయంగా మారింది. తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో పోటీచేస్తున్న ఈ రెండు ప్రధాన కూటములకూ ప్రజలు గోరీ కట్టాలి. ఇంతకాలం అధికారాన్ని వెలగబెట్టిన ఈ కూటములు మళ్ళీ మళ్ళీ బూటకపు ఎన్నికల వాగ్దానాలతో, ప్రలోభాలతో డబ్బు సంచులతో ప్రజల ముందుకు వస్తున్నాయి. దీనిని నిలదీయాల్సిన అవసరం వుంది. నూతన ప్రజాస్వామిక వ్యవస్థ సాధన కోసం కృషి చేస్తూ ప్రజలందరికీ భూమి, కూడు, గుడ్డ, ఇల్లు దక్కాలని ప్రజాఉద్యమాల్లో భాగస్వాములైన సిపిఐ(ఎం-ఎల్) అభ్యర్థులను, మేము బలపరుస్తున్న దళిత లిబరేషన్ పార్టీ (డిఎల్‌పి) అభ్యర్థులను గెలిపించమని కోరుతున్నాము.

**డిమాండ్లు :**

1. దున్నేవానికే భూమి కావాలి, పేదలకు ఇండ్లస్థలాలివ్వాలి. 2. సెజ్‌ల పేరుతో రైతుల భూములు లాక్కొని పెట్టుబడిదారులకు ఇవ్వరాదు. 3. నదీజలాల వినియోగంలో వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలి. 4. ప్రజల త్రాగునీటి సమస్యను పరిష్కరించాలి. 5. పెరిగిపోతూవున్న నిత్యావసర వస్తువుల ధరలకు కళ్ళెం వేయాలి. 6. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. 7. నల్లధనాన్ని వెలికితీసి ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించాలి 8. ప్రజల ప్రజాస్వామిక హక్కులకు రక్షణ కల్పించాలి 9. గిరిజనులపై, దళితులపై అణచివేతను అరికట్టాలి–స్త్రీలపై అత్యాచారాలను అరికట్టాలి. 10. తమిళనాడులో భాషా అల్పసంఖ్యాకులకు రక్షణ కల్పించాలి. 11. మైనార్టీ మతస్తుల, మైనార్టీ జాతులకు రక్షణ కల్పించాలి. 12. కమ్యూనిస్టు విప్లవకారులపై కేసులు ఎత్తివేయాలి.

### శాసన సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సి.పి.ఐ (ఎం-ఎల్) అభ్యర్థులు

| | | |
|---|---|---|
| 1. | కా॥ కృష్ణప్ప | – తాలి అసెంబ్లీ నియోజకవర్గం |
| 2. | కా॥ సనాఉల్లాషరీఫ్ | – హోసూరు అసెంబ్లీ నియోజక వర్గం |
| 3. | కా॥ ఆటో షణ్ముగం | – కోయంబత్తూరు నార్త్ అసెంబ్లీ నియోజక వర్గం |
| 4. | కా॥ వి.కె. రాజు | – ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం |
| 5. | కా॥ కమలనాథన్ | – పెన్నాగరం అసెంబ్లీ నియోజకవర్గం |

చెన్నై

27-3-2011

విందవేథన్, రాష్ట్ర కార్యదర్శి

సిపిఐ(ఎం-ఎల్), తమిళనాడు

# ఈజిప్టులో నిరసన ఉద్యమం




**గత** డిసెంబరు–జనవరి నెలల్లో ట్యూనీసియాలో సాగిన ప్రజా ఉద్యమం 23ఏళ్ల బెన్ ఆలీ ప్రభుత్వాన్ని తొలగించింది. పశ్చిమాసియా దేశాలన్నింటా దీని ప్రభావం పడింది. ముఖ్యంగా ఈజిప్టులో 30 ఏళ్లుగా అత్యంత నిరంకుశ పాలన సాగిస్తున్న హోస్నీ ముబారక్ ప్రభుత్వం ప్రజాఉద్యమ వెల్లువతో గద్దెదిగింది. యెమెన్, బెహరీన్, మొరాకో, సిరియా, లిబియా మొదలగు దేశాల్లోని ప్రభుత్వాలు వెల్లువెత్తిన ప్రజాఉద్యమాలతో గడగడలాడాయి.

ఈ నిరసనోద్యమాల సందర్భం, కారణాలు, రూపాలు, నాయకత్వాలు భిన్నంగా వున్నాయి. అయితే అవన్నీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగానూ, రాజకీయ మార్పులకొరకూ సాగిన రాజకీయ ఉద్యమాలు.

ఈజిప్టులోని ప్రజావెల్లువకు ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యత వున్నది. నేటి ప్రపంచంలో అనుకూల భౌతిక పరిస్థితికి అది అద్దం పట్టింది. సమాజంలో మార్పులు తీసుకరావటంలో ప్రజలెంతటి నిర్ణయాత్మక పాత్ర నిర్వహించగలరో అది చూపింది. ప్రజాఉద్యమపు బలాన్నీ, బలహీనతనూ, పోరాట ఫలాలు ప్రజలకందేట్లు చూడటానికి సరైన రాజకీయ నాయకత్వపు ఆవశ్యకతనూ ఎత్తిచూపింది.

## నిరసనోద్యమ క్రమం

8కోట్ల జనాభా కలిగిన ఈజిప్టు, పశ్చిమాసియాలో పెద్దదేశం. ఒక సమయంలో వలసవాద వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు సాగించిన చరిత్ర దానికుంది. ఇజ్రేలి జియోనిస్టులు దురాక్రమించిన మాతృభూమి కొరకు పాలస్తీనా ప్రజల పోరాటాలకు పెట్టని కోటగా వుండేది. అయితే గత నాలుగు దశాబ్దాలుగా ఈజిప్టును పాలిస్తున్న వర్గాలు విద్రోహబాటన నడిచాయి. సామ్రాజ్యవాదులకు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు దేశ ప్రయోజనాలను తాకట్టుపెట్టిన పాలకవర్గాలు అత్యంత నిరంకుశ, అణచివేత, దోపిడీ పాలనను ఈజిప్టు ప్రజలపై రుద్దాయి. ముబారక్ 30 ఏళ్లు దేశాన్ని పాలించాడు. ఈతని పాలన ప్రజలకు దుర్భరమైంది. ఈ పాలనకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమ వెల్లువెత్తడం సహజ పరిణామం.

ముబారక్ పాలనా తీరు గురించి సామ్రాజ్య వాదుల పత్రిక ది న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఇలా రాసింది: "కైరోలో ధనికులకూ, పేదలకూ మధ్య నానాటికీ పెరిగిపోతున్న వ్యత్యాసం కైరో నగర జీవనంలో ప్రముఖంగా కన్పించే అంశాలలో ఒకటి. అక్కడి సామాజిక ఘర్షణకు అదే మూలం. అయినా ముబారక్ పాలన కొద్దిమందికి ఆర్థిక లాభాలు చేకూరుస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించింది. ధనికులు నగరాన్ని విడిచి వెళ్లారు. అమెరికా ధనికుల ఇళ్లతరహాలో ఎత్తైన ప్రహరీ గోడలమధ్య బయటివారితో సంబంధంలేని భవంతుల సముదాయాల్లో నివశిస్తున్నారు. సామాన్య ఈజిప్టియన్ల నుండి వారు వేరుపడిపోయి ఒంటరిగా వుండటం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది". ఈ ప్రైవేటీకరణను రుద్దిందీ, దానినుంచి లాభపడిందీ సామ్రాజ్యవాదులూ, వారి దళారీలేనన్న వాస్తవాన్ని అది చెప్పకుండా వదలివేసింది.

"ముబారక్ దిగిపో", "ప్రజాస్వామిక పాలననూ, ప్రజాస్వామిక హక్కులను పునఃస్థాపించాలి"–ఇవి నిరసనోద్యమ ప్రధాన నినాదాలయ్యాయి. కొద్ది రోజుల్లోనే రాజధాని కైరోనుండి ప్రజాఉద్యమం అన్ని నగరాలకూ వ్యాపించింది. విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, జనాభాలోని ఇతర సెక్షన్లు లక్షలాదిగా వీధుల్లోకి వచ్చారు. వివిధ రూపాల్లో నిరసన వ్యక్తంచేశారు. తహ్రీర్ స్క్వేర్ సమీకరణ కేంద్రంగానూ, వార్గదర్శిగానూ రూపొందింది.

ఈ నిరసన–"ఆగ్రహ దినం"గా పిలువబడు తున్న జనవరి 25న ప్రారంభమైంది. ట్యూనీషియా పరిణామాలు ఈజిప్టులో పునరావృతం కానివ్వరాదన్న తలంపుతోనే ముబారక్ ప్రభుత్వం మొదటి నుండీ వ్యవహరించింది. ప్రదర్శనలను నిషేధించింది. బుల్లెట్ల వర్షం కురిపించింది. అరెస్టులు సాగించింది. అయితే ఈ చర్యలు ప్రజల ఆగ్రహాన్ని మరింతగా పెంచాయి. వారిని మరింతగా మిలిటెంటు చర్యలలోకి తెచ్చాయి.

జనవరి 28న ప్రజలను బుజ్జగించేందుకు మంత్రి వర్గాన్ని రద్దుపరచినట్లు ముబారక్ ప్రకటించాడు. ఆంతరంగిక భద్రత ముఖ్యఅధికారి ఒమర్ సులేమాన్‌ను ఉపాధ్యక్షుడిగానూ, వైమానిక దళకమాండరు అహ్మద్ సఫీకిని ప్రధానమంత్రిగానూ నియమించాడు. ప్రజలు దీనిని తిరస్కరించారు. "ముబారక్ దిగిపో" అని ముక్తకంఠంతో నినదించారు. జనవరి 29న పాలక పార్టీ నాయకులపైనా, మంత్రులపైనా, కార్యాలయాలపైన ప్రజలు విరుచుకుపడ్డారు.

జనవరి 30న ప్రజల ద్వేషానికి గురైన ఆంతరంగిక భద్రతా దళాన్ని రంగంనుండి తప్పించి, టాంకులతో, సాయుధ శకటాలతో సైన్యం ప్రవేశించింది. నిరసనోద్యమ కార్యకర్తలు ప్రదర్శనలను నిర్వహించే కృషిలో నిమగ్నమై వుండగా, అసాంఘికశక్తులు సూపర్ మార్కెట్లు, షాపులు, హోటళ్లను దోచుకొన్నాయి. దీనిని అడ్డుకునేందుకు నిరసనోద్యమకారులు ప్రయత్నించారు. వారు బృందాలుగా ఏర్పడి రోడ్లను దిగ్బంధించి పేటలలో అరాచకాన్ని అదుపు చేశారు. దక్షిణ కైరో మసీదులల్లోని మైకులలో దోపిడీని ఆపేందుకు ముందుకురమ్మని యువతకు విజ్ఞప్తి చేశారు. జాతి మ్యూజియంను దోచుకునే ప్రయత్నాన్ని నివారించేందుకు 3000 మంది నిరసనకారులు మ్యూజియం చుట్టూ గొలుసుకట్టి రక్షణగా నిలచిన సంఘటనను ఒక విలేఖరి సవివరంగా పేర్కొన్నారు.

అదేరోజున 5 సంస్థలు కలిసి "మార్పుకొరకు జాతీయకూటమి"గా ఏర్పడ్డాయి. ఫిబ్రవరి 2న తహ్రీర్ స్క్వేర్‌లో పెద్ద ప్రజాప్రదర్శనకు పిలుపు నిచ్చింది. దేశం నలుమూలలనుండీ 20 లక్షలమంది అక్కడకు చేరి ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించారు. దీనితో 2011 సెప్టెంబరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తాను పోటీచేయబోనని ముబారక్ ప్రకటించాడు. దీనితో సెప్టెంబరువరకూ అధికారంలో వుండి రాజకీయ మార్పుల క్రమాన్ని తానే నడిపిస్తానని స్పష్టంచేశాడు.

## విచ్ఛిన్నకుల తరిమివేత

వేలాది ప్రజలు కూడిన తహ్రీర్ స్క్వేర్‌తో సహా కైరో అంతటా గూండాలనూ, అసాంఘిక శక్తులనూ ఫిబ్రవరి 3న ముబారక్ పంపాడు. ప్రజాఉద్యమాన్ని విచ్ఛిన్నంచేసేందుకు తీసుకున్న అసహ్యకర చర్య యిది. ప్రదర్శకులపై విచ్ఛిన్నకారులు రాళ్లు, పెట్రోలు బాంబులూ విసిరారు. తుపాకీ కాల్పులు చేశారు. దీనితో ప్రదర్శకులకూ విచ్ఛిన్నకులకూ మధ్య ఘర్షణలు సాగాయి. సైన్యం చూస్తూ వూరకుంది. విచ్ఛిన్నకులనేమీ చేయకుండా స్వేచ్ఛనిచ్చి ప్రదర్శకులను గుర్తింపు కార్డులు చూపమని వేధించింది. అయితే ప్రదర్శకులు అద్భుత ధైర్యాన్ని, ఐక్యతనూ చూపారు. ప్రజల సహాయ సహకారాలు పొందారు. చీకటి పడేసరికి విచ్ఛిన్నకారులను తరిమివేశారు. తహ్రీర్‌స్క్వేర్‌ను తమ ఆధీనంలో వుంచుకున్నారు. వారి ప్రభావం కైరోలో విస్తరించింది.

అదేరోజు రాత్రి ముబారక్ రెచ్చగొట్టే ప్రకటన చేశాడు. తాను పదవినుండి తప్పుకోబోననీ, కొత్తమంత్రి వర్గాన్ని ఏర్పాటుచేస్తాననీ, తన నాయకత్వంలో తరువాయి చర్యలుంటాయని ప్రకటించాడు. దీనికి ప్రతి స్పందనగా నిరసనకారులు ఫిబ్రవరి 4ను "ముబారక్‌ను దించివేసే రోజు"గా పరిగణించి దేశవ్యాపిత ప్రదర్శనలు చేయమని పిలుపునిచ్చారు.

ప్రజాగ్రహాన్ని చవిచూసిన పాలకులు ప్రజలను శాంతపరిచేందుకు నిరసనకారులపై హింసకు పాల్పడిన వారందరినీ శిక్షిస్తాననీ, అరెస్టుచేసిన నిరసనకారులను విడుదల చేస్తాననీ ఉపాధ్యక్షుడు సులేమాన్ ప్రకటించాడు. శాంతియుతంగావున్న ప్రదర్శకులపై(ముబారక్ పంపిన గూండాలు)దాడిచేసినందుకు (ముబారక్ నియమించిన) ప్రధానమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాడు. ఆ చర్యలను "వినాశకర పొరపాటు"ని ఖండించాడు. కొత్త మంత్రివర్గం కొన్ని ప్రజాకర్షక పథకాలను ప్రకటించింది. సంభాషణలకు సిద్ధంగా వున్నానని సూచించింది. తన తర్వాత పదవిని అప్పగించేందుకు ముబారక్ ప్రయత్నిస్తున్న అతని కుమారుడు పాలకపార్టీ ఎన్.డి.పి. ప్రధానకార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు ఫిబ్రవరి 6న ప్రకటించాడు. తన తర్వాత తన కొడుకును వారసుడిగా చేయాలన్న ముబారక్ ప్రయత్నం ఈజిప్టు పాలక ముఠాల్లో వివాదాంశంగా వుంది.

శాంతియుతంగా అధికారమార్పిడి చేసేందుకు ముబారక్ ప్రభుత్వం సముఖంగా వుందని ఉపాధ్యక్షుడు ఒమర్ సులేమాన్ సూచించాడు. ఫిబ్రవరి 10న ఒక సైన్యాధికారి తెహ్రీర్ స్క్వేర్‌కు వచ్చి "మీరు కోరుకుంటున్నంతా జరగుతుంద"ని నిరసనకారులకు హామీ యిచ్చాడు. ముబారక్ దిగిపోయి సైన్యానికి అధికారమప్పగించాడనీ, అధ్యక్ష భవనంనుండి ఎర్ర సముద్ర తీరానవున్న షర్మ్ ఎల్ షేక్‌లోని భవనానికి మారాడనీ ఫిబ్రవరి 11న వార్తలు వెలువడ్డాయి. ప్రజాస్వామ్య పరివర్తనను నడిపిస్తాననీ, కొత్త ప్రభుత్వ మేర్పడేవరకూ ఇప్పటి పౌర పరిపాలనా యంత్రాంగమే కొనసాగుతుందనీ సైన్యం ప్రకటించింది. సైన్య సర్వోచ్ఛ సమితి అధ్యక్షుడైన రక్షణమంత్రి కంతవీకే సర్వాధికారాలుంటాయి. ఫిబ్రవరి 13న సైనిక పాలకులు రాజ్యాంగ చట్టాన్ని సస్పెండ్ చేశారు. పార్లమెంటును రద్దుచేశారు. అధ్యక్ష, పార్లమెంటు ఎన్నికలు జరుపుతాననీ, రాజ్యాంగ చట్టానికి సవరణవంటి తదితర చర్యలు తీసుకుంటాననీ వాగ్దానం సైన్యం చేసింది. 1979లో ఇజ్రాయిల్‌తో గత ప్రభుత్వం చేసుకున్న శాంతి ఒప్పందమనే దానితో సహా అన్ని అంతర్జాతీయ ఒప్పందాలనూ గౌరవిస్తానని హామీ యిచ్చింది.

## నియంత వైదొలిగాడు–నియంతృత్వం వుంది

ముబారక్ తొలగిపోవటాన్ని అందరూ ఆహ్వానించారు. ఈజిప్టులో ఇంటర్నెట్‌లో ఫేస్‌బుక్‌ద్వారా నిరసనకు ఆజ్యంపోసిన గూగుల్ ఉద్యోగి వాయెల్ "గోనిమ్" కర్తవ్యం పూర్తయింద"ని ప్రకటించాడు. మార్పు కొరకు జాతీయ కూటమి అధ్యక్షుడు ఎల్‌బరాడీ "నా జీవితంలో ఇది గొప్పరోజు"ని అన్నాడు. ఈజిప్టులో ప్రధానపక్షమైన ముస్లింబ్రదర్ హుడ్(ముస్లిం సహోదరత్వం) "ఈజిప్టు ప్రజలు ప్రధాన లక్ష్యాన్ని సాధించార"ని వ్యాఖ్యానించింది. అయితే ప్రజలూ, నాయకత్వంలో వున్న కొందరూ ఈ పరిణామంపై భిన్న అంచనానూ, వైఖరులనూ, ఈజిప్టు రాజకీయ భవితత్వంపై ఆందోళననూ వ్యక్తం చేశారు. వాటిలో కొన్ని:

"సైన్యాన్ని నమ్మటమంటే, మన గోతిని మనం తవ్వుకోవటమే"

"నియంత పోయాడు కానీ నియంతృత్వం వుంది"

"అన్ని డిమాండ్లు తీరేవరకూ నిరసన కొనసాగించి తీరాలి"

"వెంటనే రాజ్యాంగ చట్టాన్ని రద్దుచేయాలి. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకనుగుణంగా కొత్త తాత్కాలిక రాజ్యాంగ చట్టాన్ని తేవాలి".

"రాజకీయ పరివర్తనను సరైన దిశలో నడిపేందుకు జాతీయ ఐక్యతా ప్రభుత్వాన్నేర్పాటుచేసి సైన్యం ప్రజలతో అధికారాన్ని పంచుకోవాలి".

"అత్యయిక పరిస్థితి చట్టాలను రద్దుచేయాలి. రాజ్యభద్రతా యంత్రాంగాన్ని క్షాళనచేయాలి".

దీనితర్వాత ప్రజలనేక రూపాల్లో తమ నిరసనను వ్యక్తంచేశారు. ఫిబ్రవరి 18న రాజకీయ ఖైదీల విడుదల, మంత్రుల తొలగింపు, అత్యయిక పరిస్థితి చట్టాల రద్దు తదితర డిమాండ్లతో లక్షలాది ప్రజలు ప్రదర్శనలు చేశారు. సైన్యం లాఠీలు, కొరడాలు నిరసనకారులపై వాడింది. మరోవైపున అవినీతి ఆరోపణలున్న కొందరు మంత్రులపై చట్ట పరచర్యలు తీసుకోవటం, ప్రధానమంత్రి తొలగింపు, రాజకీయ పరివర్తన త్వరితంగా ముగిస్తానన్న వాగ్దానంతో ప్రజలను బుజ్జగించచూసింది. ప్రజలకూ, సైన్యానికి మధ్య ఘర్షణ, నిరసనోద్యమం కొనసాగుతున్నాయి.

| | |
|---|---|
| **వైశాల్యం** | : 10,02,450 చ.కి.మీ. |
| **జనాభా** | : 7,90,89,650 |
| **జనసాంద్రత** | : చ.కి.మీ.కు 84 |
| **రాజధాని** | : కైరో |
| **అధికారభాష** | : అరబిక్ |
| **జాతులు** | : ఈజిప్షియన్లు : 99% |
| | నుబిమియన్లు : 0.9% |
| | గ్రీకులు : 0.1% |
| **జిడిపి** | : 21589 కోట్లడాలర్లు |
| **తలసరిఆదాయం** | : 2758 డాలర్లు |
| **కరెన్సీ** | : డాలర్ |

## కొన్ని నిర్ధారణలు

ఈజిప్టులోని పరిణామాలు కొన్ని విషయాలను స్పష్టంచేశాయి. దశాబ్దాలపాటు ఈజిప్టు ప్రజలు దారిద్ర్యం, నిరుద్యోగం, దోపిడీ, అభద్రత, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, అధిక ధరలు, అణచివేత, నిరంకుశ పాలన క్రింద నలిగిపోయారు. పేరుకుపోతున్న ఆగ్రహం అగ్ని పర్వతంలా పేలి నిరసనోద్యమం వెల్లువెత్తింది. దశాబ్దాల నిరంకుశపాలన పాలకవర్గాల్లో వైరుధ్యాలను తీవ్రంచేసి రాజకీయ సంక్షోభంలోకి నెట్టింది.

మూడు దశాబ్దాల ముబారక్ నిరంకుశపాలన ఈజిప్టును సామ్రాజ్యవాద ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాద దోపిడీ, అణచివేతలకు గురిచేసింది. పాలస్తీనా ప్రజలకు వ్యతిరేకంగా ఇజ్రాయిలు యూదు దురహంకారులతో సిగ్గులేకుండా రాజీపడింది. ప్రస్తుత నిరసనోద్యమం ఈ అంశాలను విమర్శించకపోవటం, తన డిమాండ్లుగా చేర్చకపోవటం నిజమే. అయినా ప్రజలలో ముబారక్ పాలనపై అసంతృప్తి పెరగడానికి ఇవి కూడా తోడ్పడ్డాయి.

ముబారక్ పాలనపై తిరగబడేందుకు ట్యునీషియాలో బెన్‌ఆలీని పదవీచ్యుతుడ్ని చేసిన ప్రజాఉద్యమం స్ఫూర్తినిచ్చింది. ఉత్సాహవంతులైన కొందరు యువకులు ఇంటర్నెట్‌ద్వారా దేశమంతటా సందేశాలు పంపి అగ్నిరగిల్చారు. నిరసన ప్రదర్శనలు హఠాత్తుగా ఎలాంటి నిర్మాణ ప్రయత్నాలూ లేకుండా ప్రధానంగా ప్రారంభమయ్యాయి. ఒక నిర్దిష్ట రాజకీయ నాయకత్వమూ లేకుండింది. ఆంక్షలూ, నిషేధాలూ వుండటంతో ప్రజాఉద్యమానికి బహిరంగంగా, ప్రత్యక్షంగా నాయకత్వం వహించలేని స్థితిలో ప్రతిపక్షాలున్నాయి. ప్రధాన ప్రతిపక్షపార్టీ ముస్లిం బ్రదర్‌హుడ్ కూడా ఇదే స్థితిలో వుంది. నిరసనోద్యమం ఊపందుకున్న తర్వాతే రాజకీయపార్టీలు దానితో కలిసాయి. "ఏప్రిల్ 6 యువజనోద్యమం", ముస్లిం బ్రదర్‌హుడ్, మార్పుకొరకు ఈజిప్టు ఉద్యమం, మాది ఖాలిద్ సయీద్ ఉద్యమం, కపాయా(ఇకచాలు) ఉద్యమం వంటి సంస్థలు నిరసనోద్యమంలో చురుకుగా వున్నాయి. అవన్నీ కలిసి ఎల్ బరాడే నాయకుడిగా "మార్పు కొరకు జాతీయ కూటమి" అన్న ఐక్యవేదికను ఏర్పరచుకున్నాయి. ముబారక్ నిరంకుశ పాలన ముగియాలన్న, ఈజిప్టులో బూర్జువా ప్రజాస్వామిక వ్యవస్థ ఏర్పడాలన్న డిమాండుపై ఈ శక్తులన్నీ చివరివరకూ ఐక్యంగా వున్నాయి. అదే సమయంలో పరిస్థితిపై అంచనాలు, వైఖరులు, లక్ష్యాలలో అవి విబేధించాయి. ముబారక్ ఎత్తుగడలను ఎదుర్కోవటంలో వారి నాయకత్వంలో కొరవడిన ఐక్యత, రాజకీయ అసమగ్రత కూడా వ్యక్తమైంది.

ప్రజలు అత్యుత్సాహంతో నాయకత్వమిచ్చిన పిలుపులకు స్పందించారు. సూయెజ్ నగరంలోనూ, నైలునదీ తీరానవున్న పారిశ్రామిక వాడల్లోనూ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు సార్వత్రిక సమ్మె చేశారు. కొన్నిచోట్ల నిరసనోద్యమానికి సంఘీభావంగా సమ్మె చేశారు. వేలాది మహిళలూ, పురుషులూ రోజుల తరబడి తహ్రీర్ స్క్వేర్‌లో బైఠాయించారు. ముబారక్ గూండాల నెదుర్కోవటంలో నిరసనకారులకు ప్రజలండగా నిలిచారు. వారికి నీరు, ఆహారం అందించారు. వీధులలో వారికి స్వాగతం పలికారు. మహిళలు వెనుకనుండి వారికి రాళ్లందించారు. గాయపడిన వారికి ప్రథమ చికిత్సచేసి తాత్కాలిక ఆస్పత్రులకు తరలించారు. అసాంఘిక, గూండాశక్తులు జాతీయ సంపదను దోచుకునే ప్రయత్నాలను అడ్డుకున్నారు. పిల్లలు, యువత, మహిళలు వీధుల్లో పేరుకున్న చెత్తను తొలగించే పని కూడా ఉత్సాహంతో చేపట్టారు. ఒక్కమాటలో నిరసనోద్యమానికి ప్రజా స్వభావం వుంది. నిరంకుశపాలన ప్రజలనుండి ఏకాకి అయిపోయింది.

చివరి క్షణంవరకూ ముబారక్ గద్దెను పట్టుకునే వున్నాడు. ఇంకా అధికారాన్ని అంటిపెట్టుకుని వుంటే మరింత వినాశకర ఫలితాలే తనకు

# "సామ్రాజ్యవాద, ఫ్యూడలు వ్యతిరేక రాజ్యాంగ చట్టం ఏర్పడాలి"

## యుసిపిఎన్(మావోయిస్టు) నాయకుడు కా॥బసంత

*యునైటెడ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్(మావోయిస్టు) పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడూ, అంతర్జాతీయ వ్యవహారాలశాఖ సభ్యుడూ కా॥బసంత ఇటలీ దినపత్రిక "ఇల్ మానిఫెస్టో"కు యిచ్చిన ఇంటర్వ్యూను అనువదించి యిస్తున్నాము. 2011 ఫిబ్రవరి 13న ముఖాముఖి జరిగింది.*

*నేపాలులో రాచరికపాలన కూలిపోయింది. ప్రజాస్వామ్య పాలన దిశగా మొదటి అడుగుగా రాజ్యాంగ నిర్ణయసభ ఏర్పడింది. దానికి మిగిలిన పార్టీలకంటే అధిక స్థానాలు పొందినా యుసిపిఎన్ (మావోయిస్టు) పూర్తి మెజారిటీని పొందలేదు. కా॥ప్రచండ ప్రధానిగా మిశ్రమ మంత్రి వర్గం ఏర్పడింది. సైన్యంపై ఆధిపత్యం రాజ్యాంగ సభకున్నదా లేదా అన్న అంశంపై విబేధించి కా॥ ప్రచండ రాజీనామా చేశారు. ఆనాటినుండీ ప్రభుత్వ ఏర్పాటు ప్రయత్నాలు సఫలంకాలేదు. నేపాలులో తనకనుకూల ప్రభుత్వ ఏర్పాటుకు భారత పాలకులు జోక్యం చేసుకున్నారన్న, దాని ఫలితంగా ప్రతిష్ఠంభన ఏర్పడిందన్న విషయం ఇటీవల వికిలీక్స్ పత్రాలతో బయటపడింది. కా॥ప్రచండ ప్రధాని పదవికి పోటీనుండి తప్పుకుని యుఎంఎల్ నాయకుడి అభ్యర్థిత్వాన్ని బలపరచటంతో ఖనాల్ ప్రధానిగా ఎన్నికయ్యారు. ఈ పరిణామాలను వివరిస్తూ ఇచ్చిన ఇంటర్వ్యూ యిది.*

*– సంపాదకుడు*

ప్రశ్న: **ఆరునెలల ప్రతిష్ఠంభన తర్వాత సిపిఎన్–యు.ఎం.ఎల్. అధ్యక్షుడు జలనాథ్ ఖనాల్ ప్రధాన మంత్రిగా ఎన్నికయ్యారు. యుసిపిఎన్–మావోయిస్టు సారధ్యకమిటి గెలుపు సాధ్యం కాదని గమనించి ప్రచండ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించి, ఖనాల్‌ను బలపరచాలని చివరి నిముషంలో నిర్ణయించింది. అలాంటి నిర్ణయానికి మీరెలా వచ్చారు?**

**సమాధానం:** నేపాల్‌లో ప్రధానమంత్రి ఎన్నికపై ఆరునెలలపాటు ప్రతిష్ఠంభనవున్నమాట నిజమే. నేపాల్‌కూ, నేపాల్ ప్రజలకూ అనుకూలంగా ఎలాంటి మార్పు జరగరాదని కోరుకుంటున్న భారత పాలకవర్గాలు నేపాలు ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్న ఫలితంగానే ఆరునెలలపాటు ప్రతిష్ఠంభన ఏర్పడిందని అందరికీ తెలుసు. నేపాల్‌లోని మౌలిక వైరుధ్యాన్ని పరిష్కరించే ఫ్యూడలు వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక రాజ్యాంగచట్ట మేర్పడాలనీ, దేశంలో సుస్థిరత ఏర్పడాలనీ నేపాలు ప్రజలు కోరుకుంటున్నారు. యధాతథ స్థితిని కొనసాగించి, భారత అనుకూలతను ఎక్కువగా కలిగివుండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యాలని భారత్ ప్రయత్నాలు చేయటాన్ని గమనించగానే అధ్యక్షుడు ప్రచండ పోటీనుండి తప్పుకుని, ఖనాల్‌ను బలపరిచారు.

ప్రశ్న: **మావోయిస్టు పార్లమెంటు సభ్యులు, చిన్న మావోయిస్టు పార్టీల ఓట్లతో ఖనాల్ ఎన్నికయ్యారు. సంస్థాగత త్రాసు వామపక్షం వైపు మొగ్గిందా? ఇప్పుడేం జరగబోతోంది?**

**బసంత:** విప్లవకర పురోగమనం లేదా యథాతధస్థితి అన్న మలుపులో నేడు నేపాలు నిలిచివుంది. దేశం మొత్తంగానే వర్గశక్తుల పొందికలో మార్పుల్లో వుంది. యధాతథ స్థితిని కొనసాగించేందుకు భారత విస్తరణవాద పాలకవర్గాలతో అభివృద్ధి నిరోధక రాజ్యానికి నాయకత్వం వహిస్తున్న (నేపాలు) దళారీ బూర్జువా వర్గం మిలాఖత్తు అవుతున్నది. కాగా జాతీయ సార్వభౌమత్వాన్నీ, ప్రజారిపబ్లిక్కునూ పరిరక్షించేందుకు దేశభక్త, రిపబ్లిక్కు, ప్రగతిశీల, వామపక్ష శక్తులను ఐక్యంచేసేందుకు పార్టీ తీవ్ర కృషిచేస్తున్నది. ప్రధానమంత్రి ఎన్నిక ఈ ప్రక్రియను ప్రతిబింబిస్తున్నది.

ప్రశ్న: **తన అభ్యర్థిని సమర్థించినందుకు నేపాలీ కాంగ్రెసు యుఎంఎల్‌ను విమర్శించింది. అంతేకాక ముగ్గురు సారధ్య కమిటీ సభ్యులూ, భట్టారాయ్‌కి సన్నిహితులైన 51 మంది పార్లమెంటు సభ్యులూ బహిరంగంగా తమ అనంగీకారాన్ని తెలిపారు. అయితే పార్టీ నిర్ణయానికే కట్టుబడి వుంటామని చెప్పారు. ఇప్పుడు నేపాలులో ఈ పార్టీలు ఏ శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. విదేశీ జోక్యాలెలా వున్నాయి? వాటి లక్ష్యమేమిటి?**

**బసంత:** నేపాలీ కాంగ్రెసు దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రతినిధి. కాగా యుఎంఎల్ అనేక వర్గాల మిశ్రమం కె.పి.ఓలి, మాధవ్ నేపాలీల వర్గం నేపాలీ కాంగ్రెసుకు సన్నిహితంగా వుంటుంది. మిగిలినవారు అలా వుండరు. కనుక ఈ పరిస్థితిలో తన అభ్యర్థిని బలపరచనందుకు యుఎంఎల్‌ను నేపాలీ కాంగ్రెసు విమర్శించటం సహజమే. కామ్రేడ్ బాబూరామ్ భట్టారాయ్ తదితర కామ్రేడ్ల అభిప్రాయాన్ని గురించి ఛైర్మన్ ప్రచండ పోటీనుండి తప్పుకోవాలా వద్దా అన్న అంశంపై భిన్నాభిప్రాయంగా వుంది. ప్రచండ, ఖనాల్‌ల మధ్య తక్షణ సమస్యలపై 7 అంశాల అంగీకారం కుదిరిన తర్వాతే ప్రచండ పోటీనుండి తప్పుకున్నారు.

ప్రశ్న: **మావోయిస్టులకు వివిధ మంత్రి వర్గపు పదవులిస్తారన్నది నిజమేనా? దీనిపై యుసిపిఎన్ (మావోయిస్టు) వైఖరి ఏమిటి? దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మీ నిర్దిష్ట ప్రతిపాదనలేమిటి?**

**బసంత:** ఒకసారి ప్రభుత్వంలో భాగస్తులమైన తర్వాత మంత్రి పదవులు తీసుకుంటాం. అయితే వాటి సంఖ్యను నిర్ణయించలేదు. రాజ్యాంగ నిర్ణయసభలో మీ బలాన్నిబట్టి ఆ సంఖ్య వుండాలని అడుగుతున్నాము.

ప్రశ్న: **సైన్యంలో పోరాటయోధులను సమైక్యపరిచే సమస్య ఎక్కడుంది?**

బసంత: సైన్యాలను సమైక్యపరిచే సమస్యను అభివృద్ధి నిరోధకులు వక్రీకరిస్తున్నారు. మా విప్లవ ఆశయాన్ని మేము వదులుకోలేదు. వదులుకోబోము. ప్రజలు చిందించిన రక్తమూ, చెమటనుండి అభివృద్ధి చెందిన ప్రజావిముక్తి సైన్యాన్ని సైన్య సమైక్యత సాకు చూపి లోబరచము. అయితే రెండు సైన్యాలనూ సమైక్యపరిచి జాతీయ సైన్యాన్ని ఏర్పరచటానికి మేము సిద్ధంగా వున్నాము.

ప్రశ్న: **(2004 నుండీ హైతీలోవున్న ఐరాస దళంలో వున్న) నేపాలీ సైనికులు తమతోపాటుగా హైతీలోకి కలరా జబ్బును తెచ్చి వ్యాపింపచేసారన్న ఆరోపణలున్నాయి. పేద దేశాలలో పేదలను అణచివేస్తున్న ఈ అంతర్జాతీయ దళాలపట్ల మీ వైఖరి ఏమిటి?**

బసంత: ఎవరెంత సంపద పోగేసుకున్నారన్న దాన్నిబట్టి నేడు మంచి చెడ్డలు నిర్ణయమౌతున్నాయి. చెడ్డ పనులన్నింటికీ పేదదేశాలనూ, పేద ప్రజలనూ నిందిస్తున్నారు. హైతీలో కలరా వ్యాధిని వ్యాపింపచేశారని పేద నేపాలీ సైనికులపై చేస్తున్న ఆరోపణ ఇలాంటిదే. ప్రపంచంలోని అభివృద్ధి నిరోధకులు తమ లాంటి వారిని కాపాడేందుకు ఐరాస ద్వారా సైన్యాలను పంపుతూ అందులో వెనుకబడిన దేశాల సైన్యాలను వాడుతున్నారు. మేము దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము. నేపాలులో మా పార్టీ నాయకత్వంలో పీడితులు రాజ్యాధికారాన్ని పొందిన తర్వాత ఒక దేశ పీడితులకు వ్యతిరేకంగా మరొక దేశ పీడితులను వినియోగించే ఎలాంటి చర్య అనుమతించబడదు.

ప్రశ్న: **ప్రస్తుతం పార్టీలోపల పరిస్థితెలా వుంది? ప్రచండ నాయకత్వానికీ, అతని మార్గదర్శనకు సవాళ్లున్నాయన్నది వాస్తవమేనా? అయితే అందులో సమస్యలేమిటి?**

బసంత: మాది సజీవమైన పార్టీ. దానిని సజీవంగా వుంచేందుకు లోతైన, విస్తృతమైన చర్చలు సాగాలన్నది స్పష్టమే. గత 25 ఏళ్లుగా కామ్రేడ్ ప్రచండ మా పార్టీకి నాయకత్వం వహిస్తున్నారన్న వాస్తవంవల్ల ఆయన తప్పులకతీతుడుకాబోడు. గతంలో కూడా ఇలా జరగలేదు. అధ్యక్షుడు ప్రచండగానీ, మరే నాయకత్వ కామ్రేడుగానీ కొన్ని సైద్ధాంతిక, రాజకీయ సమస్యలను ముందుకు తెచ్చినప్పుడు పార్టీ వాటిని కూలంకషంగా చర్చిస్తుంది. పంథాపై గతంలోనూ పోరాటాలు జరిగాయి. ఇప్పుడూ జరుగుతున్నది. కార్మికవర్గ పార్టీకి చోదకశక్తిగా పంథాపై పోరాటాన్ని కమ్యూనిస్టులు పరిగణిస్తారు. కనుక ప్రస్తుతం పార్టీలో సాగుతున్న పంథాపై పోరాటం గత పొరపాట్లను సరిచేసి, పార్టీని పురోగమింపచేసేందుకు సైద్ధాంతికంగా, రాజకీయంగా మరింత పటిష్టంచేసే లక్ష్యంతో సాగుతున్నది.

నేడు పరిస్థితి క్లిష్టంగా వుంది. సామ్రాజ్యవాద దారిదోపిడీగాంద్ర చుట్టివేతను విజయవంతంగా మేము అధిగమించాల్సివుంది. మరొకవైపున మేమెల శ్రామికవర్గ విప్లవాన్ని సాధించి, కాపాడి, పురోగమింపచేస్తామో ప్రపంచ ప్రజానీకానికి విశ్వసనీయంగా తెలియపరచాల్సి వుంది. సూటిగా చెప్పాలంటే, 20వ శతాబ్దపు కార్మికవర్గ విప్లవాలు ఎందుకు విఫలమయ్యాయి, అవి 21వ శతాబ్దంలో ఎలా నిలదొక్కుకుంటాయి వంటి ప్రశ్నలకు మేము ప్రజలకు జవాబు చెప్పాలి. దీనికోసం మా పార్టీలో గంభీరమైన సైద్ధాంతిక కృషి జరగాలి. ఇది నాయకుల మధ్య తగవులాటకాదు. నేడెదురౌతున్న తీవ్ర సవాళ్ల నెదుర్కొనేందుకు సాగుతున్న సైద్ధాంతిక, రాజకీయ పోరాటం. ప్రస్తుత పంథాపై పోరాటపు సారాంశమిదే.

---

á వస్తాయన్న నిర్ణయానికొచ్చిన తర్వాతే, ఈజిప్టులో పశ్చిమాసియాలో సామ్రాజ్యవాద ప్రయోజనాలకు హానికలగకుండా వుండాలంటే ముబారక్ గద్దెదిగక తప్పదన్న నిర్ధారణకు ముబారక్‌కు వత్తాసు పలికిన సామ్రాజ్యవాదులు వచ్చిన తర్వాతే ముబారక్ అధికారాన్ని వదలుకునేందుకు సిద్ధపడ్డాడు.

తాను అధికారాన్ని బదలాయించిన సైన్యమూ, తాను నియమించిన ఉపాధ్యక్షుడూ, ప్రధానమంత్రీ ముబారక్‌కు విశ్వసనీయులు. అతని నిరంకుశపాలనకు మూలస్థంభాలుగా వుండినవారే. సామ్రాజ్యవాద, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అమలు జరిపినవారే. పాలస్తీనీయులకు వ్యతిరేకంగా ఇజ్రాయిలు యూదు దురహంకారులతో సిగ్గుమాలిన ఒప్పందాలు చేసుకున్నవారే.

ఈజిప్టులో ప్రజావ్యతిరేక, ప్రజాస్వామిక వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను రూపుదిద్దటంలో 1990ల నుండీ చురుకైన పాత్ర వహించిన ఒమర్ సులేమాన్‌నే ఉపాధ్యక్షుడిగా ముబారక్ నియమించాడు. అతడు అమెరికా బంటు. అమెరికా గూఢచారి సంస్థ "అప్పగింత" కార్యక్రమం అమలులో ముఖ్యవాహకంగా పనిచేశాడు. "అప్పగింత" కార్యక్రమమంటే ప్రపంచంలో ఎక్కడైనా అమెరికాను వ్యతిరేకిస్తున్న లేదా వ్యతిరేకిస్తున్నారని అనుమానించిన వ్యక్తులను ఎత్తుకొచ్చిన అమెరికా గూఢచారి సంస్థ వారిని పశ్చిమాసియాలోని తమ అనుకూల ప్రభుత్వాలకు అప్పగిస్తుంది. ఆ ప్రభుత్వాలు వారిని హింసించి, ఒప్పుదల ప్రకటనలు రాబట్టుతాయి, లేదా చంపివేస్తాయి.

ముబారక్ అధికారాన్ని బదలాయించిన సైన్యం ఈజిప్టు రాజకీయాల్లో ప్రధాన పాత్రధారిగా వుంది. అమెరికాకు ఈ సైన్యంతో సన్నిహిత సంబంధాలున్నాయి; దానికి ద్రవ్యం సమకూరుస్తున్నది. అదెలా ప్రవర్తించాలో ఆదేశిస్తున్నది. నిరసనోద్యమం ఉచ్ఛస్థాయిలో వున్నప్పుడు ఈజిప్టు సైన్య ప్రధాన అధిపతి సామి హఫీజ్ అమెరికాలో వున్నాడు. ఈజిప్టుకు తిరిగి వచ్చేలాగా నిరసనోద్యమంతో ఎలా వ్యవహరించాలో అక్కడ పాఠాలు నేర్చుకుని వచ్చాడని పత్రికలే వ్యాఖ్యానించాయి. అమెరికా సామ్రాజ్యవాదులు ఈజిప్టు సైన్యాన్ని "నిజమైన అధికార కేంద్రం"గానూ, అధికార బదలాయింపు క్రమాన్ని ఒడిదుడుకులు లేకుండా సాఫీగా నిర్వహించగల సామర్థ్యం వున్నదానిగానూ పరిగణించారు. నిరసనోద్యమం సాగిన 18 రోజులూ, ప్రజల ద్వేషానికి గురైన ఆంతరంగిక భద్రతాదళం కంటే తాను భిన్నమైన దానిగా నిష్పక్షపాతమైనదిగా చూపెట్టుకునేందుకూ సైన్యం నాటకాలాడింది. ప్రదర్శకులతో స్నేహాన్ని నటించింది. వారితో ఘర్షణ పడకుండా ఆగింది. సైన్యానికి అధికార బదలాయింపు జరగగానే, అది తన అసలు రూపు బయటపెట్టుకుంది. రాజకీయ పరివర్తనను ఈజిప్టు పాలక వర్గాలకూ, వారి సామ్రాజ్యవాద వత్తాసుదారులకు అనుకూలంగా మలిచేందుకు పూనుకుంది. సామ్రాజ్యవాద యజమానులు నిర్దేశించిన పద్ధతిలోనే ఈజిప్టు సైన్యం వ్యవహరించింది.

వలసవాదులకూ, సామ్రాజ్యవాదులకూ పశ్చిమాసియా దేశాలు లాభాల పంట భూమిగా కన్పిస్తున్నాయి. అమెరికా తన ప్రపంచాధిపత్య వ్యూహంలో ఈ ప్రాంతాన్ని కీలకమైనదిగా పరిగణిస్తున్నది. అపార ముడిచమురు వనరులూ, ముఖ్యమైన సముద్ర మార్గాలూ ఇక్కడ వున్నాయి. మాతృభూమి కొరకు పాలస్తీనా ప్రజలు పోరాడుతున్నారు. లెబనాన్‌లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజీపడని శక్తిగా హిజ్‌బొల్లా వుంది. ఇరాక్ ప్రజలు అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అమెరికా ఆధిపత్యం ముందు లొంగిపోవటానికి ఇరాన్ ప్రజలు నిరాకరిస్తున్నారు. ఆఫ్ఘన్ల ప్రతిఘటన సాగుతూనేవుంది. అరబ్ దేశాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ ఉద్యమాలు అణచివేయలేని విధంగా సాగుతున్నాయి. ఇవన్నీ అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యానికి సవాలుగా వున్నాయి. తన మిత్రులు ఇజ్రాయిల్, సౌదిఅరేబియా పాలకులను బలీయంచేసే, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులను బలహీనపరిచి నాశనం చేసే, తనకనుకూలంగా అరబ్ దేశాల పరిస్థితిని మలిచే దీర్ఘకాల ఆర్థిక, రాజకీయ వ్యూహంతో అమెరికా సామ్రాజ్యవాదులు వ్యవహరిస్తున్నారు.

నాజర్ అనంతరం, ప్రత్యేకించి ముబారక్ పాలనాకాలంలో ఈజిప్టు అమెరికా మిత్రుడిగా వుంటున్నది. 1979లో ఇజ్రాయిలుతో శాంతి ఒప్పందమనే దానిని చేసుకుంది. ముబారక్ పాలనలో అమెరికా ఆయుధాలను కొనే దేశంగా ఈజిప్టు మారింది. ఇటీవల అమెరికానుండి 6వేల కోట్ల డాలర్ల ఆయుధాల కొనుగోలుకు ఈజిప్టు అంగీకరించింది. ఈజిప్టు ఆంతరంగిక భద్రత కొరకు అమెరికా ప్రతియేటా 200 కోట్ల డాలర్లు సహాయంగా ఇస్తున్నది. ముబారక్ నిరంకుశ పాలనకు అమెరికా ఇన్నాళ్లూ మద్దతునిస్తూ వచ్చింది. పాలస్తీనా పోరాటాన్ని చీల్చి బలహీనపరచటంలో ముబారక్ ప్రభుత్వం ముఖ్య పాత్ర వహించింది. ఆక్రమిత పాలస్తీనా భూభాగాన్ని తిరిగి ఇచ్చివేయవలసిన పరిస్థితి ఇజ్రాయిలుకు ఏర్పడినపుడు ఇజ్రాయిలు యూదు దురహంకారులకు తోడ్పడింది. పాలస్తీనా భూభాగాన్ని మరింత ఆక్రమించుకునే ధైర్యాన్ని ఇజ్రాయిలు కిచ్చింది. గాజా ప్రాంతంనుండి ఈజిప్టులోకి పాలస్తీనియన్లు రాకుండా 14 కి.మీ. పొడవునా ముబారక్ ప్రభుత్వం గోడను కట్టింది. గాజాప్రాంతాన్ని దిగ్బంధనంచేసే ఇజ్రాయిలు వ్యూహానికి తోడ్పడింది. ఈజిప్టులోని అమెరికా అనుకూల ప్రభుత్వం కూలిపోతే, ఇజ్రాయిలు పాలకులకు ఇబ్బందులు పెరుగుతాయి. పశ్చిమాసియాలో అమెరికా ఆయుధ వ్యాపారం దెబ్బతింటుంది. అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహం అమలు మందగిస్తుంది.

కనుక ఈజిప్టులోని పరిణామాలు అమెరికా సామ్రాజ్యవాదులకు ఆందోళన కలిగించాయి. ముబారక్‌ను కాపాడేందుకు చివరిక్షణం వరకూ ప్రయత్నించాయి. ముబారక్‌ను నిలపటం సాధ్యంకాదని తేలిన తర్వాత అతన్ని తప్పించారు; అధికారం సైన్యానికి బదలాయింపు జరిగేట్లు చూసారు. రాజకీయ పరివర్తనను తన ప్రయోజనాలకనువుగా తిప్పేందుకు పూనుకున్నారు. ట్యునీసియా పరిణామాలు వచ్చిన వెంటనే ఈజిప్టు సైన్యాధిపతి అమెరికా వెళ్లాడు. ఈజిప్టులో అలాంటి పరిస్థితే తలెత్తితే ఏంచేయాలో చర్చించాడు. నిరసనోద్యమం ఉచ్ఛదశలో వుండగా, ఈజిప్టులో అమెరికా గూఢచారిగా 40 ఏళ్లుపనిచేసిన ఫ్రాంక్ వీజ్నర్‌ను ఈజిప్టుకు ప్రత్యేక దూతగా అమెరికా పంపింది. సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదాలు, డిమాండ్లు నిరసనోద్యమం లేవనెత్తలేదు; అమెరికాకు విశ్వాసంగా వుండే వర్గానికీ రాజకీయ శక్తులకూ అధికార బదిలీ జరిగింది. గత ప్రభుత్వపు ఒప్పందాలన్నింటినీ గౌరవిస్తానని కొత్త ప్రభుత్వం ప్రకటించింది. దీనితో అమెరికా ఈజిప్టుకు సహాయ మందిస్తానని ప్రకటించింది.

అయితే అమెరికా నిర్దేశించిన మార్గంలోనే ఈజిప్టులోని రాజకీయ పరిణామాలక్రమం సాగిందని చెప్పలేము. ఈజిప్టు ప్రజలు తమ అసంతృప్తినీ, నిరసననూ, ఆకాంక్షలనూ వ్యక్తపరచగల ప్రతిఅవకాశాన్నీ వినియోగించుకున్నారు. సమగ్రతగల రాజకీయ నాయకత్వం లేకపోయినా, ప్రధానంగా అసంఘటితంగానే అప్రయత్నంగానే నిరంకుశ పాలనను వ్యతిరేకించారు. నిరసనోద్యమం ప్రజలకు ఒక పాఠశాల అయింది. తమ బలాన్నీ, బలహీనతలను గుర్తించేట్లు చేసింది. నిజమైన, బూటకపు మిత్రులను గుర్తించేట్లు చేసింది. శతృవు ఉపయోగిస్తున్న ఎత్తుగడలనూ, పద్ధతులనూ అర్థం చేసుకునేట్లు చేసింది. వలసవాదానికీ, సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాడిన అనుభవం ఈజిప్టు ప్రజలకుంది. పాలస్తీనా, ఇరాక్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, లెబనాన్ దేశాలలో సామ్రాజ్యవాద జోక్యం, పెత్తనం, బెదిరింపులు దురాక్రమణ విధానాలపై పోరాడుతున్న ప్రజలపట్ల సంఘీభావం వుంది. ఈజిప్టు ప్రజలు కూడా ప్రపంచీకరణ, ఆయుధ వ్యాపారం, టెర్రరిజంపై పోరు విధానాలతో పీడింపబడుతున్నారు. కనుక వారీ పోరాటాలనుండి తగిన గుణపాఠాలు తీసుకుంటారు. నిరసనోద్యమం ఇంకా సాగుతున్నది. ఒక నిరంకుశ పాలకుడు తొలగినంతనే ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థకు పరివర్తన ముగియలేదని వారు గుర్తించారు. ప్రజాస్వామ్యానికి శతృవులపై చైతన్యయుత, నిర్మాణయుత నిరంతర పోరాటం లేకుండా చిన్న విజయాలను కూడా నిలబెట్టుకుని, అనుభవించటం సాధ్యం కాదు. నిరంకుశ పాలనకు మూలస్థంభాలుగా వున్న భూస్వామ్య విధానానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా నిరంతరాయ పోరాటం సాగించకుండా నిజమైన అర్థంలో ఈజిప్టులో ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పటం సాధ్యంకాదని పోరాట జీవిత అనుభవం నుండి ఈజిప్టు ప్రజలు గుర్తిస్తారని ఆశిద్దాం.

**14-3-2011**

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం అమలు కూడా సంఘటిత ఉద్యమాల ద్వారానే సాధ్యం

**ఇటుక** ఇటుకనూ పేర్చి, ఇసుకా సిమెంటూ కూర్చి, నిర్మాణ రంగంలో పనిచేసే శ్రామికులు చెమటోడ్చటం ఫలితంగానే, ఎంతో రక్తం చిందించిన ఫలితంగానే నేడు మనం చూస్తున్న అనేకానేక ఆధునిక నిర్మాణాలుగానీ, ఒకనాటి పురాతన కట్టడాలుగానీ రూపొందాయన్నది నిరాకరించ వీలులేని వాస్తవం. బహుళ అంతస్థుల భవనాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు, పరిశ్రమలు, పోర్టులు, ప్రాజెక్టులు, విమానాశ్రయాలూ మొదలుకొని నిర్మాణ కార్మికుల శ్రమలేకుండా పూటగడవని స్థితి ఏర్పడిందంటే అతిశయోక్తికాదు.

2007-10 మధ్యకాలంలో-లభ్యమౌతున్న గణాంకాల ప్రకారం-మన రాష్ట్రంలోనే సుమారు నాలుగు వేల మంది కార్మికులు నిర్మాణ పనుల్లోనే ప్రాణాలు కోల్పోగా, మరో ఆరువేల మంది కార్మికులు నిర్మాణ పనులలో జరిగిన వివిధ ప్రమాదాల కారణంగా శాశ్వత వికలాంగులయ్యారు. కార్మికులు ప్రాణాలు కోల్పోవటమో, తీవ్రగాయాలపాలవటమో జరిగిన సందర్భాలలో ఆయానిర్మాణాల కాంట్రాక్టర్లు, యాజమాన్యం నామమాత్రపు పరిహారాన్ని చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. ఆయా కార్మికుల ప్రమాదానికి కారణమైన కనీసపాటి ప్రమాణాలు పాటించకపోవడం, కార్మికుల భద్రతా సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యంవంటి విషయాలను చర్చనీయాంశం కాకుండా ప్రభుత్వాధికారులను ముందుగానే 'సంతృప్తి' పరుస్తున్నారు. గట్టిగా నిలవేస్తే 'డిజైనింగ్'లో లోపమని దబాయిస్తూ, అదేదో తమకు సంబంధం లేని విషయంగా బుకాయిస్తున్నారు. ఇక అనారోగ్యాల పాలైన, వయసుపైబడిన కార్మికుల, వారి కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగావుంది. ఈ విధంగా నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అసంఖ్యాక కార్మికులు అతిసుందర కట్టడాలను నిర్మిస్తూనే అత్యంత దుర్భరజీవితాలను గడుపుతున్నారు.

## నిర్మాణరంగ కార్మికుల చట్టం-పూర్వాపరాలు

1991 తర్వాత వేగవంతమైన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు, నూతన ఆర్థిక విధానాలతో వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభానికి గురైంది. వివిధ పేర్లతో రైతుల భూములను గుంజుకొని, సంపన్నులకు కట్టబబెడుతూ, రైతులను భూమిలేని నిరుపేదలుగా మారుస్తున్న క్రమం ప్రారంభమై సాగుతున్నది. ఇక వ్యవసాయంపై ఆధారపడి జీవించే గ్రామీణ పేదలకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కరువై పొట్ట చేతబట్టుక పట్టణ ప్రాంతాలకు వలసలు పోతున్నారు.

ఇదే సమయంలో, సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడులను ఆకర్షించే పేరిట, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రహదారులు, నూతన కట్టుబడులు, నిర్మాణాలు సాపేక్షంగా ఊపందుకున్నాయి. పెద్ద సంఖ్యలో నిర్మాణరంగ కార్మికులు అవసరమయ్యారు. గత రెండు దశాబ్దాలకాలంలో వీరి సంఖ్య గణనీయంగా పెరిగింది. వ్యవసాయరంగంలో పనులు కోల్పోయి వలస కూలీలుగా పొట్ట చేతబట్టుకొని పట్నాలకు తరమబడిన వారి శ్రమ నిర్మాణ రంగంలో కారుచౌక సరుకైంది. లాభార్జనే ధ్యేయంగా, రాత్రింబవళ్ళు చేయించే ఈ పనులలో నిర్మాణరంగ కార్మికుల శ్రమను యాజమాన్యం లేదా నిర్మాణాల కాంట్రాక్టర్లు పెద్దఎత్తున దోచుకుంటున్నారు. మన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల నుండి పెద్దఎత్తున హైదరాబాద్, బెంగుళూరు వంటి అనేక ఇతర నగరాలకు, గల్ఫ్ ప్రాంతాలకు కూడా నిర్మాణ పనులకు కూలీలుగా వలసలు వెళ్తున్నారు.

ఎంతో విలువైన శ్రమ చేస్తున్నా వీరి జీవితాలు గాలిలో దీపంలా మారాయి. తమ జీవన భద్రతకోసం, కుటుంబ జీవన మెరుగుదల కోసం లక్షల సంఖ్యలో వున్న నిర్మాణరంగ కార్మికులు వివిధ రూపాల్లో దీర్ఘకాలంగా ఆందోళనలు సాగిస్తూ వస్తున్నారు. ఫలితంగా కేంద్రప్రభుత్వం 1996లో 'భవననిర్మాణ కార్మికుల, ఇతర నిర్మాణ రంగ కార్మికుల చట్టాన్ని' తీసుకువచ్చింది.

## భవన నిర్మాణ కార్మికుల చట్టం-విధివిధానాలు

ఈ చట్టం ప్రకారం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ ఆయారాష్ట్రాల పరిధుల్లో 'భవన నిర్మాణ కార్మికుల మరియు ఇతర నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ బోర్డు'లను ఏర్పాటు చేయాలి. ఈ సంక్షేమబోర్డుకు ఒక ఛైర్మన్‌తోపాటుగా ఇద్దరు ప్రజాప్రతినిధులు, ఇద్దరు నిర్మాణరంగ ప్రతినిధులు, ఇద్దరు కార్మిక ప్రతినిధులు, మరియు ఇతర ప్రభుత్వశాఖల అధికారులతో కలసి మొత్తం 13 మంది సభ్యులుగా వుంటారు. గత సంవత్సరం నిర్మాణ రంగంలో 90 రోజులు, ఆ పైబడి పని చేసిన వారందరూ ఈ సంక్షేమ మండలిలో తొలుత 50 రూ॥ రుసుం చెల్లించి సభ్యులుగా వారి పేరు నమోదు చేసుకోవాలి. గుర్తింపు కార్డు పొందాలి. ఆపై ప్రతి ఏటా 12 రూ॥ చెల్లించి సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలి. భవన నిర్మాణానికి అనుబంధంగా పనిసాగించే వడ్రంగి, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, పెయింటర్ తదితరులు; ఇతర నిర్మాణాల్లో 42 రకాల పనులు చేసే వారిని నిర్మాణరంగ కార్మికులుగా గుర్తిస్తూ ఈ చట్టంలో పేర్కొన్నారు. పని ప్రదేశంలో ప్రమాదకారణంగా మృతిచెందిన కార్మికుని కుటుంబానికి లక్ష రూ॥ పరిహారం; ప్రమాదానికి గురైన కార్మికులకు వైద్య సౌకర్యం, ప్రమాద తీవ్రతనుబట్టి (30 వేల రూ॥వరకు) పరిహారం; భవన నిర్మాణ రంగంలోని మహిళా కార్మికులకు 5 వేల రూ॥ ప్రసూతి సహాయం (మొదటి, రెండవ బిడ్డలకు మాత్రమే) అందజేస్తామని ఈ సంక్షేమ బోర్డు ప్రకటించింది.

భవన నిర్మాణ కార్మికులు-18-50 సం॥ వయసున్నవారు పెన్షన్ సౌకర్యం కోసం దరఖాస్తు చేసుకోవచ్చనీ, ఇందుకుగానూ ప్రతికార్మికుడూ తన వాటాగా ప్రతిఏటా 200 రూ॥ చెల్లించాలనీ, దీనికి అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం వెయ్యి రూ॥లు, కార్మికుల సంక్షేమబోర్డు మరో వెయ్యి రూ॥ దీనికి జత చేస్తాయనీ, మొత్తంగా ప్రతిఏటా కార్మికుని ఖాతాలో 2200రూ॥ జమ అవుతాయని, ఆ విధంగా ప్రతి సం॥రం జమ అయ్యే మొత్తాన్ని 60 ఏళ్ళు దాటిన కార్మికులకు పెన్షన్‌గా నెలకు వెయ్యిరూ॥ చొప్పున అందజేస్తామనీ భవన నిర్మాణ కార్మికుల చట్టంలో పేర్కొన్నారు.

ఇక, కార్మికుల సంక్షేమ బోర్డు తనకు కావలసిన నిధులను రాష్ట్రంలో జరిగే అన్ని రకాలైన 'పదిలక్షల రూ॥ పెట్టుబడిదాటిన నిర్మాణపనుల'పై ఒక శాతం సెస్సు విధించటం ద్వారా సమకూర్చుకుంటుందనీ, ఈ నిధి నుండీ పైన పేర్కొన్న కార్మికుల అవసరాలకు ఖర్చు చేస్తుందనీ చట్టంలో పేర్కొన్నారు.

ప్రతిఏటా ప్రభుత్వం సెస్సు రూపంలో సక్రమంగా వసూలు చేస్తే సంక్షేమ బోర్డుకు వెయ్యికోట్ల రూ॥ జమ అవుతుందని ఒక అంచనా. వ్యవసాయం తర్వాత ఉపాధి కల్పనలో భవన నిర్మాణ రంగం రెండవ స్థానాన్ని ఆక్రమించింది. 2 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో సగం మంది సభ్యత్వం తీసుకొంటే తొలివిడత కార్మికుల సభ్యత్వం (50రూ॥) వసూలు ద్వారా 50 కోట్ల రూ॥ ఆదాయం బోర్డుకు సమకూరుతుంది. ఇక సభ్యత్వ పునరుద్ధరణ ద్వారా ప్రతిఏటా 12 కోట్లు బోర్డుకు జమ అవుతాయి. ఇంతేగాక, బీమా ద్వారా ప్రతిఒక్క కార్మికుడూ ఏటా 200రూ॥ చొప్పున చెల్లిస్తే-200 కోట్ల రూ॥ పోగవుతాయి. 18-50 సం॥ వయసున్న కార్మికుల నుండి పెన్షన్ కోసం కార్మికుని వాటాగా దాదాపు 32 సం॥పాటు ప్రతి ఏటా డబ్బు బోర్డువద్ద పోగుపడ్తూనే వుంటుంది. కాగా, కార్మికునికి 60వ సం॥ నిండిన నాటి నుండి బోర్డు వెయ్యి రూ॥ చొప్పున పెన్షన్ అందజేస్తుంది. బ్యాంకుల వడ్డీ ప్రకారమే బోర్డువద్ద పోగుపడిన, కార్మికులు చెల్లించిన మొత్తాలే ఆరు సంవత్సరాల కొకసారి రెట్టింపు అవుతాయి. ఇవి కాక కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ నిమిత్తం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంటులూ వున్నాయి. సెస్సులూ, గ్రాంటులూ, కార్మికుల చెల్లింపులూ, వాటిపై లభించే వడ్డీలు, ఇతర ఆదాయలూ కలిపి బోర్డువద్ద పెద్ద మొత్తాలే నిల్వలు పేరుకుంటాయి. బోర్డువద్ద 400 కోట్లరూ॥ నిల్వలున్నపుడే 2007-09 సం॥ల మధ్యకాలంలో 2 కోట్ల 54 లక్షలు మాత్రమే కార్మికుల సంక్షేమానికి వినియోగించటాన్ని గమనించి నపుడు ఈ బోర్డు పనితీరు స్పష్టమౌతుంది. సభ్యత్వం పునరుద్ధరించుకోలేదనో, బీమా చెల్లింపులు సక్రమంగా చేయలేదనో (డిఫాల్ట్) కారణాలుగా అనేకమంది కార్మికులను అర్హుల జాబితా నుండి తప్పిస్తారనేది జగద్విదితమే! ఇప్పటికే ఏడాదిలో 90 రోజులు పనిచేస్తేనే బీమాసౌకర్యం వర్తిస్తుందనే పలు నిబంధనలను విధించారు.

## రాష్ట్ర ప్రభుత్వాల పట్టనితనం

కేంద్ర ప్రభుత్వం నిర్మాణరంగ కార్మికుల సంక్షేమానికి వుద్దేశించిన చట్టం తేవటానికి ముందే 1960లో కేరళ రాష్ట్రంలోనూ, 1994లో తమిళనాడు లోనూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుల నేర్పరచి కొన్ని చర్యలు చేపట్టాయి. అయితే, 1996లో కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిన తర్వాత కూడా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టానికి లోబడైనా సంక్షేమ బోర్డుల నేర్పరచటానికిగానీ, కార్మికులకు గుర్తింపు కార్డులనిచ్చి చట్టపరమైన సౌకర్యాలు కల్పించేందుకుగానీ పూనుకోలేదు.

కేంద్రప్రభుత్వం చట్టం చేసిన 11 సం॥ల తర్వాత 2007 జూన్‌లో జీవో నెం 52 ద్వారా మన రాష్ట్ర ప్రభుత్వం 'భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు' ఏర్పాటుకు పూనుకుంది. అప్పటికీ 'బోర్డు'లనే ఏర్పరచని రాష్ట్రాలు అనేకం వున్నాయి! ఈ చట్టం అమలుపై ఒక ప్రభుత్వేతర సంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన సుప్రీంకోర్టు-భవన నిర్మాణ కార్మికుల సామాజిక భద్రతకు ఉద్దేశించి దశాబ్ద క్రితం రూపొందించిన చట్టాన్ని అమలు చేయించటంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానించింది. కార్మిక సంక్షేమ బోర్డుల నేర్పరచేందుకు రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం తగిన మార్గదర్శకాలను రూపొందించక పోవటంతో, కార్మికుల సంక్షేమనిధి కోసం 'సెస్' వసూలు చేయబడకుండానూ, వసూలు అయిన కార్మిక సెస్సు పంపిణీకి నోచుకోబడకుండానూ మూలన పడిందని వ్యాఖ్యానించింది. 2010 జనవరి 18వ తేదీననే కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు ఇందుకు తగిన ఆదేశాల నిచ్చినా, ఇంతకాలపు జాప్యం ఎందుకు జరిగిందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ చట్టం అమలు తీరును సవివరంగా మూడునెలలలోగా తనకు నివేదించాలని ఆదేశించింది.

అంతేగాక పూర్తి సిబ్బందితో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డుల నేర్పరచాలనీ, ఈ బోర్డు ప్రతినిధులు ప్రతి రెండు నెలలకొకసారి సమావేశం కావాలనీ, ఈ చట్టం వలన కార్మికులు పొందగలగే ప్రయోజనాన్ని గురించి-ప్రభుత్వ, ప్రైవేటు ప్రచారసాధనాలు, ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా కార్మికుల మధ్య విస్తృత ప్రచారం కల్పించాలనీ, ప్రతీరాష్ట్రం భవన నిర్మాణ కార్మికులను నమోదు చేసుకోవటానికి అధికారులను నియమించి, నమోదైన కార్మికులందరికీ గుర్తింపు కార్డులివ్వాలనీ, ప్రభుత్వం ద్వారా అన్ని కాంట్రాక్టు నిర్మాణాలూ, ఇతర ప్రైవేటు నిర్మాణాలలో చట్టప్రకారం నమోదైన కార్మికులు ప్రయోజనం పొందేలా చర్యలు తీసికోవాలనీ, చట్టప్రకారం సెస్సు వసూలు చేయాలనీ, చట్ట ప్రకారం లభించే ప్రయోజనాలను, నమోదు చేసుకున్న కార్మికులకు నిర్ణీత కాల వ్యవధిలో త్వరితంగా అందించాలనీ, ఈ మొత్తం ఆదాయ, వ్యయాలను 'కాగ్' ఆడిట్ చేయాలనీ సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఈ విధంగా అంశాలవారీగా చేపట్టవలసిన నిర్దిష్ట చర్యలను పేర్కొంటూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా ప్రభుత్వాల పనితీరు 'దున్నపోతుపై వాన కురిసిన' చందంగానే మిగిలింది.

మన రాష్ట్ర ప్రభుత్వం పేరుకి 2007లలో సంక్షేమబోర్డు నేర్పరిచినా 2010 వరకు ఛైర్మన్ నియామకం జరగలేదు. 2010లో ఛైర్మన్‌ను నియమించినా బోర్డు ప్రతినిధుల నియామకం జరగలేదు. కనుక బోర్డు ప్రతినిధులు సమావేశమవటం, కార్మికుల విజ్ఞప్తులను పరిశీలించటం, పరిష్కరించటమనేదే జరగలేదు. దానితో కార్మిక శాఖ, సంబంధింత ఇతర ప్రభుత్వశాఖల అధికారులదే ఇష్టారాజ్యమైంది. కనీసం సభ్యులకు గుర్తింపుకార్డులందజేయటంలోనూ తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఇక బోర్డు సేకరించాల్సిన సెస్సు విషయానికొస్తే 2008-09లో 200కోట్లు, 2009-10లో 200 కోట్లు వసూలు చేశారు. వాస్తవానికి బోర్డుకు తగిన యంత్రాంగంవుండి 'సెస్సు' వసూలుకు శ్రద్ధ చూపితే వెయ్యికోట్లకు పైగా సం॥నికి ఆదాయం సమకూరుతుందని అంచనా.

రాష్ట్రవ్యాపితంగా భవన నిర్మాణరంగంలో పనిచేసే 21 లక్షల 15 వేలమందిని గుర్తించామని ప్రభుత్వం చెపుతున్నది (వాస్తవానికి ఆ సంఖ్య 40 లక్షలవరకు వుండవచ్చనేది ఒక అంచనా)-కాగా షుమారు 10 లక్షలమంది పేర్లు మాత్రమే ఇప్పటికి సభ్యులుగా నమోదయ్యాయి. వీటిలోనూ 50 శాతం కార్మికులకు మాత్రమే గుర్తింపు కార్డులు అందించారు. గుర్తింపు కార్డుల ప్రక్రియను సత్వరం పూర్తి చేయకుండా కార్మికులందర్నీ బోర్డు చుట్టూ తిప్పుకుంటున్నారు. 60 సం॥లు దాటిన భనవ నిర్మాణ కార్మికులకు పెన్షన్ పథకాన్ని ప్రకటించినప్పటికీ దానిపై ఎలాంటి నిర్ధిష్ట చర్యలూ చేపట్టలేదు. ఇంకా, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు తాను చేపట్టబోయే చర్యలుగా పేర్కొన్న-కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు, శిక్షణా నైపుణ్యం పెంపొందించేందుకు కార్మికులకు శిబిరాలు, కార్మికుల ప్రమాద బీమా సౌకర్యాలపై ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. 2010 నాటికి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డువద్ద సెస్సు రూపంలో పోగైన 400 కోట్ల నిధులున్నప్పటికీ రాష్ట్రంలోని 1323 కార్మికులకు 2 కోట్ల 54 లక్షల రూ॥ మాత్రమే ఖర్చు చేసింది! (కనీసం సభ్యత్వం మేరకు కార్మికులు చెల్లించిన 5 కోట్ల రూ॥ కూడా ఖర్చు పెట్టలేదన్నమాట!)

భవననిర్మాణ కార్మికులకు స్వంత ఇళ్ళ నిర్మాణానికి పావలావడ్డీకి రుణాలివ్వాలనీ; పనిప్రదేశంలో ప్రమాదానికి గురై మరణించిన కార్మికుల కుటుంబాలకు పరిహారాన్ని 5 లక్షల రూ॥కు పెంచాలనీ; గర్భిణీ స్త్రీల ప్రసూతి సహాయాన్ని 10 వేల రూ॥కు పెంచాలనీ; 60 సం॥ నిండిన వృద్ధులకు పెన్షన్‌ను అందజేయాలనీ, బీమా సౌకర్యాన్ని సక్రమంగా అందుబాటులోకి తేవాలనీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

అయితే ప్రభుత్వం మాత్రం 'మాటలు కోటలు దాటినా అడుగు గడప దాటలేదన్న' చందంగా ఈ నాటికీ నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో కార్మిక ప్రతినిధులకు ప్రాతినిథ్యం కల్పించలేదు. బోర్డు నిర్ణయాల అమలుకు తగిన యంత్రాంగాన్ని రూపొందించలేదు. పైగా ఆది నుండే ఈ బోర్డు ద్వారా నిర్వహించే కార్యక్రమాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే

á

---

పాట

## రాయి-సలాక

సుద్దాల అశోక్‌తేజ

రాయి-సలాక
ఇసుక-ఇటుక
తాపీ-తట్ట
సిమెంట్-చెమట
గోడమీదగోడ-మేడమీదగోడ
కట్టిపోర కూలోడా పట్టణాలలో మేడ
కాళ్ళు జాగర్త-వేళ్ళు జాగర్త
నడుం జాగర్త-నడువు జాగర్త

చిత్తోరో నలగొండో
ఇందూరో ఇనుకొండో
కృష్ణ ఖమ్మం గోదారీ
కష్టం కర్మం ఈదారీ
ఆకలిబాకీ-అప్పులకాకీ
తరిమిన బాధల వారసులం
బస్తికి బతుక వచ్చినం

పగలంత బంగులాల
రాతిరంత గుడెసెల్ల
చలిబువ్వ కారమురో
చాలకుంటె నీళ్ళున్నయిరో
అమ్మికరాదు అనియేడ్చి
పొల్లేని నాయినమ్మ
రొమ్ములు గుడిచే చంటోళ్ళు

కట్టెలమీద నిలబడరా
కట్టుతెగితె మనమెక్కడరా
రోజూ చచ్చిపుడతమురా
రాజుల మేడలు కడతమురా
మన ఎముకలలో 'బిర్లామందిర్'
మన చేతులలో 'చారిమినార్'
కనబడనోళ్ళే గుడ్డిజనాల్

'పనిలో పరమాత్ముడున్నాడురా
పనిలో సుఖశాంతున్నదిరా'
అనుకొని చేసే యంత్రాలం
మునుగని తేలని యెడ్డోళ్ళం
ఎవరో నడిపే చక్రాలం
మనలను చూసి గడియారం
కనిపెట్టిన తెలవి విడ్డూరం

('నేలమ్మ నేలమ్మా' పాటల సంకలనం నుండి)

# ఫిబ్రవరి 23న పార్లమెంటు ముందు కార్మిక ప్రదర్శన సమైక్య పోరాటమా? కార్మికుల అసంతృప్తినీ, మిలిటెన్సీని హద్దులు దాటకుండా ప్రయత్నమా?

**2011** ఫిబ్రవరి 23న దేశం నలుమూలలనుండీ ఢిల్లీ చేరుకున్న లక్షలాది కార్మికులు పార్లమెంటు ముందు ప్రదర్శన చేశారు. గత 63 సంవత్సరాలుగా పాలకవర్గాలు తమ ప్రభుత్వాలద్వారా అమలుచేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తమ అసంతృప్తినీ, ఆగ్రహాన్నీ వారు వ్యక్తంచేశారు.

దేశంలో కార్మికుల జీవన, పని పరిస్థితులు దిగజారి పోతూండటానికి మూలకారణమైన నయా ఉదారవాద ఆర్థిక విధానాల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అమలవుతున్న గత రెండు దశాబ్దాలుగా కార్మికుల్లో అసంతృప్తి, ఆగ్రహమూ రగులుతున్నాయి. ఈ కాలంలోనే వీరోచిత, కష్టభరిత పోరాటాలద్వారా కార్మికవర్గం సాధించుకున్న హక్కులను నిరాకరించటమేకాక కార్మికుల స్థాయిని పెట్టుబడికి బానిసలుగా దిగజార్చింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా వున్నామంటున్న రాజ్యమూ, ప్రభుత్వమూ కార్మిక చట్టాలనూ, మానవత్వ సూత్రాలనూ కాలరాచి అధిక లాభాలకొరకు కార్మికుల శ్రమశక్తిని దోచుకునేందుకు బడాబూర్జువాల చేతి పనిముట్టుగా తెగబడి పనిచేస్తున్నాయి.

పొరుగు సేవలూ, కాంట్రాక్టు పనుల పేరిట కార్మికులను ఏ హక్కులూ, భద్రతలూ లేని రోజు జీతగాళ్లుగా మార్చారు. పరిశ్రమల ప్రైవేటీకరణతో కార్మికులకు భద్రత లేకుండా చేశారు. పనిభద్రత, వేతనభద్రత, సామాజిక భద్రత లేని అనియత కార్మికులుగా మార్చారు.

వీటితోపాటు రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల, ఆహార ధరలు సంపదలు సృష్టిస్తున్న కార్మికులు సాధారణ గౌరవప్రద జీవనం సాగించ గలగటాన్ని అసాధ్యం చేస్తున్నాయి. వారి జీవితాలు దుర్భరమైనాయి. ఇది పాలకవర్గాలపై వారిలో అసంతృప్తినీ ఆగ్రహాన్నీ కలిగించింది.

మార్క్సిస్టు లేదా వామపక్ష కార్మికసంఘాలేకాక ఏ కార్మిక సంఘమైనా కార్మికులను దారిద్ర్యంలోకి నెడుతున్న వారికి వ్యతిరేకంగా కార్మికులను నిజమైన పోరాటాల్లోకి సమీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్మికుల జీవన-పనిపరిస్థితుల మెరుగుదల కోరుతూ నిరంతరాయ పోరాటాలను నిర్మించాల్సిన పరిస్థితి వాటి ముందుకువచ్చి వుంది.

అయితే పాలకవర్గ పార్టీలకూ, రివిజనిస్టు పార్టీలకూ, ప్రాంతీయ పార్టీలకూ, మార్బ్విజానికి కట్టుబడి వున్నామనే కొన్ని పార్లమెంటరీ పార్టీలకూ అనుబంధంగా వున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వం నిజమైన పోరాటాలలోకి కార్మికులను సమీకరించి, పాలకవర్గ పార్టీలకు ఇబ్బంది కలిగించే పంథాను ఎంచుకోవటంలేదు. పార్లమెంటరీ ఎన్నికల ద్వారా ప్రజల ఓట్లతో అధికారాన్ని పొందుతున్న పార్టీల ప్రయోజనాలను దెబ్బకొట్టేందుకు వాటికి అనుబంధంగావున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాలు పూనుకోవు.

కనుక ఈ కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వం కార్మికుల అసంతృప్తినీ, ఆగ్రహాన్నీ ప్రక్కదారి పట్టించే, నిష్ప్రయోజక దారిలోకి మళ్లించే పద్ధతి నెంచుకున్నాయి. అదేసమయంలో కార్మికవర్గ మొనగాళ్లుగా నాటకమాడు తున్నాయి.

నానాటికీ పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా నిలకడైన కార్మిక పోరాటాన్ని దశాబ్దం క్రితమే చేపట్టాల్సివుంది. ఆహారమూ, నిత్యావసరాల ధరలు అందరికీ అందుబాటులోకి వచ్చే వరకూ ఆపకుండా పోరాటాలు సాగించాల్సివుంది. కానీ ఈ కార్మిక నాయకులు నామకార్థపు కార్మిక ఆందోళననే చేపట్టారు. దానినే నిజమైన పోరాటంగా చూపెట్టుకుంటున్నారు. దీనిని చూపెట్టుకుని ప్రభుత్వాధికారంలో వున్న పాలకపార్టీకి సమానస్థాయిలో తాము కూడా గుర్తింపు పొందేందుకూ, తద్వారా పాలకపార్టీ నాయకత్వం పొందుతున్న సౌకర్యాలు తాము కూడా పొందేందుకూ ప్రభుత్వంతో బేరసారాలాడు కుంటున్నారు.

దేశంలో నయాఉదారవాద విధానాలను అమలు జరుపుతున్న పాలకవర్గ పార్టీలు ఐఎన్‌టియుసి అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి విమర్శించినట్టే, "దేనిని పట్టించుకునేది లేద"న్న వైఖరితో వున్నాయి. కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాలను సమాజంలోని ఇతర సెక్షన్లతో సమానంగా గుర్తించేందుకూ, 1947 అధికారమార్పిడి నాటినుండి ఇస్తున్న సౌకరాలను అందించేందుకూ నిరాకరిస్తున్నాయి.

మొండిగావున్న ప్రభుత్వంతో బేరసారాలాడేందుకే ఈ కేంద్ర కార్మిక సంఘాలు నాయకత్వాలు కార్మికుల ఆందోళనను చేపట్టాల్సిన పరిస్థితిలో పడ్డాయి. దీనికోసమే ఈ కార్మికవర్గ మొనగాళ్లు మూడేళ్లుగా అధిక ధరలూ, ఇతర డిమాండ్లపై కార్మికుల పోరాటమన్న తంతును సాగిస్తున్నారు.

గత మూడేళ్లుగా కేంద్ర కార్మిక సంఘాల (నాయకత్వాల) మధ్య ఐక్యతను సాధించేందుకు కృషిచేస్తున్నామని వీరు చెప్పుకుంటున్నారు. ఐఎన్‌టియుసి, ఏఐటియుసి, సిఐటియు, హెచ్‌ఎంఎస్, బిఎంఎస్,ఏఐసిసిటియు, టియుసిసి, యుటియుసిల సమన్వయ కమిటీ ఏర్పరచటంద్వారా ఐక్యత సాధించామనీ, యుపిఏ ప్రభుత్వంపై ఐక్యంగా పోరాటం సాగిస్తున్నామని చెప్పుకుంటున్నాయి. తమ ఐక్యత పర్యవసానంగా 1. 2009 అక్టోబరు 28న నిరసన దినం; 2. 2009 డిసెంబరు 6న పార్లమెంటు, అసెంబ్లీల ముందు నిరసన ధర్నాలు; 3, 2010 మార్చి 5న అఖిల భారత నిరాహారదీక్ష, జైల్‌భరో; 4. 2010 సెప్టెంబరు 7న ఒకరోజు సార్వత్రిక సమ్మె జరిగాయనీ చెప్పుకుంటున్నారు. ఈ ఐక్య కార్యాచరణ పరాకాష్టగానే 2011 ఫిబ్రవరి 23న పార్లమెంటు ముందు ప్రదర్శన జరిగిందని చెప్పుకుంటున్నారు. వారంతా కలిసి కార్మికవర్గపు ఐదు కీలక డిమాండ్లను రూపొందించ గలగటాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారు. అవి: 1. ధరల అదుపు, ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్టంచేయటం; 2. కార్మిక చట్టాల అమలు; 3. ఉద్యోగ భద్రతకు జోడించి కంపెనీలకు ఉద్దీపనా ప్యాకేజీలు; 4. సామాజిక భద్రత కల్పించేందుకు సంఘటిత రంగానికి జాతీయనిధి; 5. బడ్జెట్టు లోటును పూరించేందుకు ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి.

"పార్లమెంటుకు ప్రదర్శన" ను నిర్వహించటంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాలకున్న ఉద్దేశ్యాలూ, పథకాలూ ఎలా వున్నప్పటికీ, అన్ని రంగాలకూ చెందిన కార్మికులు, మహిళా కార్మికులూ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. తమ అసంతృప్తినీ ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. కార్మికులూ, ప్రజలపట్ల ప్రభుత్వాల ఉదాశీనతను నిరసించారు. తమ జీవన భృతి, హక్కులపై అంతు లేకుండా పాలకులు సాగిస్తున్న దాడులను ఎదుర్కొనే సంసిద్ధతను వ్యక్తంచేశారు. నిరసనలను తెలియపర్చిన, ఆగ్రహాలను వ్యక్తపరిచిన కార్మికులందరకూ అభినందన నందిస్తున్నాము.

పాలకవర్గాలూ, వారి ప్రభుత్వాలపట్ల ప్రజలు భ్రమలు కోల్పోతున్న స్థితిని ఒకవైపునా, "ఐక్యపోరాటం", "కార్మిక ఐక్యత" అన్న కేంద్ర కార్మిక సంఘ నాయకత్వాల పదాడంబరపు బోలుతనాన్ని మరోవైపునా ఈ ప్రదర్శన ఎత్తిచూపింది.

పార్లమెంటు ప్రదర్శన ముగిసిన తర్వాత కేంద్ర కార్మిక సంఘాల నాయకులూ, అవి అనుబంధంగా వున్న రాజకీయ పార్టీల నాయకులూ ఈ కార్మిక ప్రదర్శన ఇటీవలి కాలంలో జరిగిన వాటిల్లో పెద్దదనీ, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం దీనిని గమనించకుండా వుండలేదనీ చెప్పుకున్నారు. మువ్వన్నెల జెండా, ఎర్రజెండాలు ప్రదర్శనలో పాల్గొన్నందున కార్మిక సమస్యలపై చర్చించేందుకు కార్మిక సంఘాల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించకుండా ప్రభుత్వం తప్పించుకోజాలదని వారు మహోత్సాహాన్ని ప్రదర్శించారు. ఐఎన్‌టియుసి ఈ ప్రదర్శనలో పాల్గొనటాన్ని దేశంలో ట్రేడు యూనియన్ ఉద్యమపు ఐక్యతను సాధించినట్లుగా వారు చిత్రించారు. కార్మికుల డిమాండ్లు సాధించేందుకు దేశంలోని కార్మికులకు ఒక సాఫీదారి ఏర్పడిందన్న హామీగా చెప్పుకుంటున్నారు. ప్రధానమంత్రితో భేటీ అవటమే వారి అంతిమ లక్ష్యంగా ఈ రీతిలో వెల్లడించుకున్నారు.

ఈ కేంద్ర కార్మిక సంఘాల సమన్వయకమిటి (టియుసిసి) నాయకత్వాలు కోరుకున్న విధంగానే ప్రధానమంత్రి చర్చలకు ఆహ్వానించారు. ఐఎన్‌టియుసి, ఏఐటియుసి, సిఐటియు, హెచ్‌ఎంఎస్, బియంఎస్ తదితర సంఘాల ప్రతినిధుల బృందం ఐఎన్‌టియుసి అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి అధ్యక్షతన పార్లమెంటు సమావేశాలు ముగిసినతర్వాత ప్రధానమంత్రితో భేటీ అవుతుంది. ప్రధానమంత్రితో చర్చలు విఫలమైతే ఒక రోజు అఖిలభారత సమ్మెను చేస్తామని సమన్వయ కమిటీ నాయకత్వం ప్రకటించింది.

ఆ విధంగా ఒకరోజు నిరసన ప్రదర్శన, ఒకరోజు సమ్మెలతో కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వం కార్మిక డిమాండ్లను సాధించి పెట్టగలదని చెప్పుకుంటున్నాయి.

అయితే ఐఎన్‌టియుసి అధ్యక్షుడి ప్రకటనలనూ ఉద్దేశ్యాలనూ పరిశీలించినట్లయితే వీరు సాధించామంటున్న ఈ "ట్రేడు యూనియన్ల విశాల ఐక్యత" అసలు స్వభావమేమిటో అర్థమౌతుంది.

"....ప్రదర్శనలో ఐఎన్‌టియుసి పాల్గొన్నందున కమ్యూనిస్టులు ప్రదర్శనను రాజకీయం చేయలేక పోయారు. పేద ప్రజల డిమాండు రాజకీయం చేయబడ నందుకు కాంగ్రెసు సంతోషపడాలి. మా ప్రయత్నాలు విజయవంతమైతే, దేశానికి ఒకే ఒక ట్రేడ్‌యూనియన్ సెంటరు ఏర్పాటు గురించి ఆలోచించాల్సిన స్థితిలో వామపక్ష తదితర యూనియన్లు పడతాయి..... యుపిఏ ప్రభుత్వంలో గందరగోళం వుంది. దానికి సదుద్దేశా లున్నాయి; కానీ వాటిని అమలు చెయ్యలేకపోతున్నది. ఎక్కడో ప్రభుత్వం తప్పుదారి పట్టించబడుతోంది". (2011 మార్చి 25 ఫ్రంటులైను పత్రిక ప్రతినిధి టి.రాజ్యలక్ష్మికి సంజీవరెడ్డి ఇచ్చిన ఇంటర్వ్యూ).

దీనికి వివరణేమీ అవసరంలేదు. గత 20 ఏళ్లుగా అమలుజరిగిన, ఇంకా అమలు జరగాలని కోరుకుంటున్న సదుద్దేశాలేమిటో అందరికీ తెలుసు. "ట్రేడు యూనియన్ ఐక్యత", "ఐక్యపోరాటం" అన్న ఆయన చెబుతున్న దాని అసలు అర్థమేమిటో కూడా స్పష్టంగానే వుంది.

ఆంధ్రప్రదేశ్‌నుండి కాంగ్రెసు వర్కింగ్ కమిటీలో వున్న అందరినీ తొలగించి సంజీవరెడ్డిని ఆహ్వానితుడిగా నియమించారన్న వాస్తవాన్ని గుర్తుంచుకుంటే, ఇతర ట్రేడు యూనియన్లతో అతను కలవటం, పార్లమెంటు ప్రదర్శనలో పాల్గొనటంలో ఉద్వేశ్యాలేమిటో అర్థంచేసుకోవటం కష్టమేమీ కాదు. పార్లమెంటు ముందు ప్రదర్శనలో కార్మికులు చూపిన సమైక్యశక్తిని అతను చాకచక్యంగా వినియోగించుకొన్నాడు.

సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలకు అనుబంధంగా వున్న ట్రేడు యూనియను నాయకత్వాలు కార్మికుల ఐక్యతగానూ, కార్మికవర్గ ఐక్యతగాను చిత్రిస్తున్న ఈ ట్రేడు యూనియన్ల "ఐక్యత" వట్టి హుళ్లక్కి. ఈ కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాలు ఒక పథకం ప్రకారం నిర్వహిస్తున్న కార్మిక ఆందోళనలను ఐక్య ట్రేడు యూనియన్ల నాయకత్వాల చేతిలో కార్మిక ప్రయోజనాలు భద్రంగా చిత్రిస్తున్న ప్రయత్నాన్ని మనం చూస్తూ ఊరకుండరాదు.

మన దేశ కార్మిక వర్గపు రాజకీయ, మిలిటెంటు మొనను మొద్దుబార్చేందుకు కేంద్ర ట్రేడు యూనియన్ల నాయకత్వాలు చేతులు కలుపుతున్నాయనీ, పాలకవర్గ పార్టీలతో కలిసి కార్మికుల ఆందోళనలనూ మిలిటెన్సీనీ పార్లమెంటరీ వ్యవస్థ పరిధిలోకి కుదించేందుకు పనిచేస్తున్నాయని ఈ అనుభవం స్పష్టం చేస్తున్నది. కార్మికుల, పేదల డిమాండ్లను రాజకీయం చేయకుండా వుండటమన్న పేరుమీద, కార్మికవర్గ మొనగాళ్లమని చెప్పుకునే వీరు కార్మికులకు రాజకీయాలందకుండా చేస్తున్నారు; తన వర్గ రాజకీయాలకే కార్మికులను దూరం చేస్తున్నారు; దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలకు కార్మికులను లోబరుస్తున్నారు. వారిని బానిసత్వంలోకి నెడుతున్నారు.

ఈ నాయకత్వాల "ట్రేడు యూనిటీ ఐక్యత", "ఐక్యపోరాటం" అసలు స్వభావాన్ని అర్థంచేసుకుంటేనే తప్ప, భారత కార్మికవర్గ జనావళి తమ వర్గ రాజకీయాల ఆయుధాన్ని రక్షించుకోలేదు. ఆ వర్గ రాజకీయాలను చేపట్టినప్పుడే పాలకవర్గాల అమానుష దోపిడీనుండి తన్ను తాను రక్షించుకుని, దోపిడీనే అంతం చేయగలదు. ★

---

á ప్రయత్నాలూ ప్రారంభించారు. అందులో భాగంగానే 2010 జులైలో జీవో 61ని విడుదల చేసి, నిరసనలు వ్యక్తం కావటంతో వెనక్కు తీసుకున్నారు.

సంఘటిత రంగంలోని కార్మికులకూ, ఉద్యోగులకు, పెన్షను, ప్రావిడెండుఫండు ఇ.ఎస్.ఐ. వంటి సౌకర్యా లున్నాయి. వీటిని అసంఘటిత రంగానికి కూడా వర్తింప చేయాలన్న డిమాండు చాలాకాలం నుండి వుంది. దీనిలో భాగంగానే ఈ చట్టం చేస్తున్నట్లు ప్రభుత్వం చెప్పుకుంది. అయితే దాని అసలు లక్ష్యం వేరుగావుంది. ఇన్నాళ్లు పెన్షను, ప్రావిడెడ్‌ఫండు, ఇ.ఎస్.ఐ. సౌకర్యాలకు కార్మికులు ఉద్యోగులు చెల్లిస్తున్న నిధులను ప్రభుత్వం నిర్వహించేది. ప్రపంచ బ్యాంకు నిర్దేశాల మేరకు వీటిని స్వతంత్ర సంస్థలనే వాటికి అప్పగించారు. అవి ఈ నిధులను షేరుమార్కెట్టులో పెట్టుబడిపెట్టి వచ్చిన లాభాలతో కార్మికులకు వడ్డీ చెల్లించాలి. అంటే కార్మికులనుండి వసూలు చేసిన నిధులను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు అందజేస్తారు. భవన నిర్మాణ కార్మిక నిధిని కూడా ఇలాగే పెట్టుబడిదారులకు ద్రవ్య వనరుగా సమకూరుస్తారు. చట్టప్రకారం నియమించవలసిన సంక్షేమ బోర్డును నియమించినట్లు ప్రకటన చేసి, అధ్యక్షుడు, సభ్యులను నియమించకుండా, ఒకశాతం భవన సెస్సును వసూలు చేసి 400 కోట్లు రాష్ట్రప్రభుత్వం పోగుచేసుకుంది. దీని భారమంతా అపార్టుమెంట్లు కొన్న వారే చెల్లించారు. అంటే మరో రూపంలో పన్ను విధించారు. వసూలైన నిధిని ఖర్చు చేసేందుకు ఎలాంటి యంత్రాంగాన్ని ఏర్పాటు చెయ్యలేదు. ఈ నిధిని ప్రస్తుతం ప్రభుత్వం వాడుకుంది. చట్టప్రకారం విధివిధానాలు ఖచ్చితంగా అమలు జరిపినా, ఈ నిధులు షేరు మార్కెట్లలో జూదమాడేందుకు బూర్జువాలకు చేరుతుంది. అమలు జరపమని కేంద్రం రాష్ట్రాలను వత్తిడి పెట్టినా, అమలు ఆలశ్యం చేస్తున్నందుకు సుప్రింకోర్టు చివాట్లు పెట్టినా దీని కోసమే తప్ప కార్మిక సంక్షేమం కోసం కాదు.

అధికార మార్పిడి తదనంతరం ఆరు దశాబ్దాలపైగా కాలంలో భారత పాలకుల భూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల, కార్మిక-ప్రజావ్యతిరేక విధానాలను గమనించిన వారెవరూ-భవననిర్మాణ కార్మికులకు ఈ చట్టం ఏదో ఒరగబెడ్తుందని అపోహపడరు. కానీ కొన్ని కార్మిక సంఘాలు పనిగట్టుకొని ఈ భవననిర్మాణ కార్మిక చట్టం నిర్మాణరంగంలోని కార్మికుల జీవితాలను సమూలంగా మార్చివేస్తుందని భ్రమలు కల్పిస్తున్నారు. వాస్తవానికి, కార్మికులు సంఘటితమై పోరాడిన సందర్భాలలో ప్రస్తుత చట్టంతో నిమిత్తం లేకుండా కూడా కార్మికులు మెరుగైన పరిహారాలను, వేతనాలను పొందరనేది గమనార్హం. అయితే కార్మికుల పోరాటాల ఫలితంగా కొన్ని కార్మిక సంక్షేమ చట్టాలుగా ప్రభుత్వం రూపొందించినప్పటికీ, వాటిచుట్టూతా కార్మికులను త్రిప్పుతూ కార్మికుల చైతన్య స్థాయిని మరో అడుగు ముందుకు వేయనీయకుండా అడ్డుకునే కుట్రను, కార్మికులుగా ఉంటూనే మేస్త్రీల పేరుతో కాంట్రాక్టరకూ, యాజమాన్యాలకూ దళారీలుగా వ్యవహరించే వారిని తయారు చేసే కుట్రలను కార్మికులు జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయించుకోవాలన్నా నిర్మాణ కార్మికుల సంఘటిత ఉద్యమాలు లేకుండా సాధ్యంకాదు.

కార్మిక సంఘాలు కూడా కార్మికుల ఆర్థిక డిమాండ్ల మేరకే పూర్తిగా పరిమితమౌతున్న స్థితి నుండి బయట పడాలి. లక్షలాదికార్మికులు, వివిధ పేర్లతో ప్రభుత్వం వద్ద జమ చేసే కోట్లాది రూపాయలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వమే భవన నిర్మాణ కార్మికులకు, వారి కుటుంబాలకు కావలసిన కూడు, గూడు, గుడ్డలతో పాటుగా విద్య వైద్య సౌకర్యాలను కల్పించేందుకు డిమాండ్ చేసి సాధించుకోవాలి. లక్షలకోట్ల విలువైన సంపదలను సామ్రాజ్యవాదులకు దోచిపెట్టే పాలకులకు, వేల కోట్లరూపాయల పన్ను రాయితీలను బడాపెట్టుబడిదారీ వర్గాలకు కల్పించే పాలకులకు, నిర్నిబంధంగా అసంఘటితరంగంలో కారు చౌకగా శ్రమను ధారపోస్తున్న లక్షలాది కార్మికులకు కనీస సామాజిక భద్రత, సౌకర్యాలు కల్పించటం ఏ మాత్రం భారమైన విషయం కాదు. కార్మికులు ఈ దిశగా ఆలోచనలు సాగించి, తమ చైతన్యాన్ని పెంపొందించు కుంటూ చట్టపరిధిల్లో, చట్టభ్రమల్లో కూరుకుపోకుండా సమైక్య, సంఘటిత పోరాటాలను సాగించినప్పుడే వారి జీవితాల మెరుగుదలకు మార్గం సుగమమౌతుంది. ★


జనశక్తి ప్రచురణ

**విప్లవ ప్రజా ఉద్యమం**

**విప్లవ ప్రజా ఉద్యమ సమస్యలు సావధానంగా చర్చిద్దాం!**

**కామ్రేడ్ విశ్వం వ్యాస సంకలనం**

వెల: 10.00

**కాపీలకు: మైత్రీ బుక్ హౌస్**
**జలీల్ వీధి, అరండల్‌పేట,**
**విజయవాడ**

# ఒడిషా రైతుల ఆత్మహత్యలు

శంభుమిశ్రా

**ఒడిషా** ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన రాష్ట్రం. రాష్ట్రంలోని జనాభాలో నూటికి 65 మందిపైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్రస్థూల జాతీయోత్పత్తిలో నాల్గవ వంతూ, పారిశ్రామిక ఉత్పత్తిలో సగభాగంపైగానూ వ్యవసాయోత్పత్తుల ద్వారానే లభిస్తున్నది. కానీ వ్యవసాయ రంగంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం, తరుచూ సంభవిస్తున్న రైతుల ఆత్మహత్యలు పరిస్థితిని పూర్తిగా దిగజార్చాయి. రాష్ట్ర ప్రభుత్వ పాలక పార్టీలోని అంతర్గత గ్రూపు విభేదాలలో లేదా అవకాశవాద ప్రతిపక్షపార్టీలో ఈ సమస్యను అప్పుడప్పుడూ లేవనెత్తుతున్నాయి. కానీ ఈ సమస్యపై కూలంకుషమైన విశ్లేషణ అత్యవసరమైంది. ప్రస్తుత సంక్షోభంలోకి నూటిగా వెళ్ళబోయేముందుగా వలసవాదుల కాలం నుండీ అనుసరిస్తున్న వివిధ వ్యవసాయ విధానాలను ఒక్కసారి విహం వీక్షణం చేయటం అవసరం.

ఒడిషా 1803 నుండీ బ్రిటీష్ పాలనక్రిందకు వచ్చింది. బ్రిటిష్ పాలకులు తమ అనుకూల వర్గాన్ని తయారు చేసుకోవటంలో భాగంగా ఆనాటికి అమలులో వున్న భూ నియంత్రణ విధానాల స్థానంలో శాశ్వత ఫైసలా పద్ధతిని 1793లో రైతులపై రుద్దారు. తద్వారా భూమి అంతా జమీందార్ల, భూస్వాముల పరమైంది. ఆ కాలానికి ఒడిషాలో 24 జిల్లాలే (విభాగాలే) వుండేవి. భూమి శాశ్వతా ఫైసలా విధానంలో లోపం ఫలితంగా పెద్దస్థాయిలోని ప్రైవేటు భూములేవీ అభివృద్ధి చెందలేదు. అడవిని నిర్మూలించటం ద్వారా వ్యవసాయ భూములను కల్పించారు. వలస పాలకులు రుద్దిన భూ విధానాలకు కట్టుబడకుండా ఒరిస్సా ప్రజలు 1817లో పాయిక్ తిరుగుబాటువంటి, 1827లో వీర్ సురేంద్రసాయ్ నాయకత్వంలో ఉల్‌గులన్, 1888లో గోండుల తిరుగుబాటు వంటి అనేక నిరసన, ప్రజాఉద్యమాలను నిర్మించారు.

స్వాతంత్ర్యానంతరం, భూసంస్కరణలనేవి ప్రధాన అంశంగావుంది. ఈ కార్యక్రమంలో(1) జమీందారీ విధానరద్దు (2) రోయత్‌దారీలో సంస్కరణలు (3) భూ గరిష్ట పరిమితి నిర్ధారణ (4) మిగులు భూముల పంపిణీ మరియు (5) సర్క్యులర్ సెటిల్‌మెంట్ అంశాలు ప్రధానమైనవిగావున్నాయి. భూమిపై ఫ్యూడల్ కేంద్రీకరణను తగ్గించే ఉద్దేశంతో ఒడిషాలో 1951 'ఒరిస్సా ప్రొవిన్షియల్ లాండ్ ఎబాలిషన్' చట్టాన్ని చేశారు. జాతీయగణాంక సంస్థ 48వ నివేదిక ప్రకారం 1991-92లో 4.5 లక్షల హెక్టార్ల భూమిని 9 లక్షల కౌలు రైతులు సాగుచేస్తున్నారనీ, ఇది ఒడిషాలోని మొత్తం సాగుభూముల్లో 9.5 శాతమేననీ అర్థమౌతుంది. ఒడిషాలో కౌలు వ్యవసాయమనేది జీవనోపాధిగా సాగించటము మినహా పెట్టుబడి తరహాలో సాగటంలేదు. ఇక్కడ కౌలుదారులుగా ఎవరైతే వున్నారో వారు సన్నకారు రైతులుగాకానీ, భూమిలేని వ్యవసాయ కూలీలుగా కానీ వున్నారు.

1960లో ఒడిషా భూ సంస్కరణల చట్టం ప్రతిపాదించబడి 1965లో చట్టంగా రూపొందింది. చట్టంలోని అన్వయింపులు, అస్పష్టతలు, ప్రభుత్వ యంత్రాంగంలోని నిర్లక్ష్యం, అవినీతి, స్వార్ధశక్తుల కారణంగా ఈ చట్టం అమలులోకి రావటానికి ఆనాటినుండి 12 సం॥ల కాలం తీసుకున్నా నిరుప యోగంగా మిగిలిపోయింది. మరోవైపున 1960లోనే ప్రభుత్వం వ్యవసాయ విజ్ఞాన అభివృద్ధి పరికరాలను ప్రవేశపెట్టింది. ఫ్యూడలిజమ్ రద్దు చేయటంలో విఫలమైన ప్రభుత్వం పెట్టుబడిదారీ లేదా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని చేపట్టింది.

1997లో ఒడిషా రాష్ట్ర ప్రభుత్వం ఒక వ్యవసాయ విధానాన్ని రూపొందించింది. ఇది 1991లో ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు చేసింది మినహా మరొకటి కాదు. మొదటిసారి వ్యవసాయానికి పరిశ్రమలస్థాయి కల్పించబడింది. దీన్ని అమలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ చర్యలను చేపడ్తున్నది. రాష్ట్ర శాసనసభలో వ్యవసాయ ఉత్పత్తుల మార్పిడి (సవరణ) బిల్లు-2005 ప్రవేశ పెట్టారు. దీని ప్రధాన లక్ష్యమేమంటే కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహించటమే! నూతన విత్తన బిల్లు-2004 ప్రవేశ పెట్టటం ద్వారా దేశవాళీ విత్తన వాడకాన్నీ త్రోసిపుచ్చారు. దీని ప్రకారం విత్తనం యొక్క నాణ్యతను నిర్ధారించే అధికారం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోకి వస్తుంది.

ఒడిషాలో వరి ప్రధాన పంట కనుక అదే వాణిజ్యపంటగా కూడా పరిగణిస్తారు. 1965లో వరి కొనుగోలు, అమ్మకానికి సంబంధించి ప్రభుత్వం ఒక చట్టం చేసింది. ఇదంతా ఎఫ్.సి.ఐ., సరఫరా శాఖ మరియు ప్రభుత్వ లైసెన్స్ పొందిన సంస్థల ద్వారా సాగాలి. కానీ గత చాలా సంవత్సరాలుగా రైతులు వారి పంటను కనీస ధరకు కూడా అమ్ముకోలేక పోతున్నారు. దీనితో రైతుల ఆర్థిక భద్రత తీవ్ర ఇబ్బందులనెదుర్కొంది. రైతులు పేదరికంలోకి ఈడ్వబడ్డారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడటానికి అనేక సామాజిక-ఆర్థిక కారణాలు పనిచేస్తున్నాయి. మొదటగా మనం ఆత్మహత్యలకు పాల్పడిన కొందరు రైతుల స్థితిగతులను అంచనావేస్తే వారందరి మధ్యగల ఉమ్మడి సాధారణ పోలికలను గమనించగలుగుతాము. 1) వీరంతా సన్నకారు రైతులు లేదా కౌలు రైతులు 2) సాగునీటి సౌకర్యం లేని ప్రాంతాలకు చెందిన వారు 3) వీరిలో అత్యధికులు ప్రభుత్వేతర సంస్థలవద్ద రుణాలు తీసుకున్నారు 4) వీరిలో అత్యధికులు రైతు తరగతి లేదా దిగువ తరగతికి చెందినవారు 5) వీరిలో అత్యధికులకు వేరే ఇతర ఏ ఆదాయ వనరూలేని వారు 6) వీరిలో అధికులు దారిద్ర్యరేఖ దిగువనున్న కార్డులు కలిగి వున్నవారు.

1997-2005 మధ్యకాలంలో జాతీయ నేర గణాంక విభాగ నివేదికల ప్రకారం పది సంవత్సరాల కాలంలో దేశవ్యాపితంగా ఒకలక్షా 50 వేలమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇతర రాష్ట్రాలలో పత్తి, సోయాబీన్ వంటి వ్యాపార పంటల రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో అత్యధికులుగా వున్నారు. కానీ ఒడిషాలో వరిపంట వైఫల్యం చెందటమే ప్రధాన ఆత్మహత్యలకు కారణం. ఉదాహరణకు- రాధేశ్యామ్‌భాయ్ అనే రైతు ప్రభుత్వేతర సంస్థ నుండి 15 వేలరూ॥ అప్పుతీర్చలేక వత్తిడితో బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంబల్‌పూర్ జిల్లా శాసనథానా పరిధిలో ఇది జరిగింది. మైక్రోఫైనాన్స్ సంస్థల వత్తిళ్ళు, వేధింపులు భరించలేక సామ్రాట్ జగ్‌దాలా అనే రైతు జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదురుగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే విధంగా దిలీప్‌దాస్ అనే ఒక మత్స్యకారుడు కూడా రుణ చెల్లింపు వత్తిడి కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ వరుసలో జమన్‌కిరా బ్లాక్‌కు చెందిన సౌదామినీనాయక్ (45) అనే మహిళా రైతుకూడా ఆత్మహత్యకు పాల్పడింది.

తీవ్ర పేదరికం కారణంగా అధిక వడ్డీల కారణంగా కొద్దిపాటి అప్పుకూడా మోయలేని పెనుభారంగా పరిణమిస్తున్నది. ఒడిషాలోని పంచాయితీ పరిధుల్లో ప్రభుత్వం రెవిన్యూ శాఖ అందజేసిన ఒక అంచనా ప్రకారం 70 శాతం గానూ, సగటున 61 శాతంగానూ వ్యవసాయం దెబ్బతిన్నది. ఒక్క బెంగాలీ బ్లాక్‌లోనే 11 వందల హెక్టార్ల భూమి తీవ్రకరువు వాత పడింది. దీనితో 600 హెక్టార్లలో అసలు సాగే చేయలేదు. 1560 హెక్టార్లు చీడపీడల బారిన పడింది. సంబల్‌పూర్‌లో 1987 హెక్టార్ల భూమి సాగుచేయకుండా వుంది. 15,542 హెక్టార్ల భూమిలో పంట దెబ్బతిన్నది. 19,811 హెక్టార్ల భూమిలో పంట తెగుళ్ళ బారిన పడింది. జమిన్‌కిరాలో మాత్రమే 1378 హెక్టార్ల భూమి పశుగ్రాసానికి ఉపయోగపడింది. ఇది ప్రభుత్వం అందజేసిన అంచనా కనుక, వాస్తవం మరింత భయానకంగా వుండి వుంటుంది. కనుక వాస్తవ పరిస్థితిని సులభంగానే ఊహించవచ్చు. ఈ ప్రాంతాలలో రైతుల ఆందోళనలు సాగుతున్నాయి. 2005 నాటి జాతీయ గణాంక సంస్థ నివేదిక ప్రకారం దేశంలోని 89.35 లక్షల రైతు కుంబాలలో 42.3 లక్షల మంది రుణభారం ఉచ్చులో చిక్కుకుని వున్నారు. వ్యవసాయ పెట్టుబడులు పెరగటంతో రైతులు అనివార్యంగా అప్పులు చేయటానికి నెట్టబడుతున్నారు. ప్రభుత్వ బ్యాంకులలో రుణ సదుపాయం లభించదు. లభించినా దీనికోసం అనుసరించాల్సిన క్రమం చాలా పెద్దది. దీనితో రైతులు సమాంతరమార్గాలకు నెట్టబడుతున్నారు. మైక్రోఫైనాన్స్ లేదా స్వయం సేవా బృందాల ద్వారా రుణం లభించే క్రమం సులభంగానూ త్వరితంగానూ ఉంటుంది. అయితే వడ్డీ 80 శాతం వరకూ వుంది. కావున రైతులు బలవంతంగా ఈ విషకౌగిల్లోకి నెట్టబడుతున్నారు. ప్రభుత్వరంగంలోని బ్యాంకులు సైతం చక్రవడ్డీలు విధించటంతోపాటు అధిక కిస్తీలను రైతులపై రుద్దుతున్నాయి.

ఒక కుటుంబంలో తండ్రిపేరిట భూమి వుంటే భార్య, కొడుకులు, కూతుర్లు వీరెవర్నీ రైతులుగా పరిగణించరు. కనుక ఈ కుటుంబ సభ్యులలో ఎవరి బలవన్మరణమూ రైతుల ఆత్మహత్యల లెక్కలోకి రాదు. వ్యవసాయ రుణాలు వీరికి ఏ విధంగానూ వర్తించవు. ఈ విధంగా ఇది అతి కొద్ది మందికి మాత్రమే తోడ్పడేదిగా వుంది. వ్యవసాయ రుణం పెంచుతున్నట్లుగా ప్రభుత్వం ప్రకటిస్తున్నది. 55 లక్షల హెక్టార్ల భూమికి గానూ 3600 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. అంటే ఎకరానికి రూ. 250 కంటే తక్కువ లభించిందన్న మాట! బలరామ్‌భాయ్ మరణానంతరం అంత్యక్రియలు నిర్వహణ నిమిత్తం అతని భార్య 5 వేల రూ॥ రుణం తీసుకుంది. దీని అర్థమేమంటే అతను అప్పులో పుట్టి, అప్పులో పెరిగి, అప్పుతో మరణించి, మరణానంతర కార్యక్రమాలు కూడా అప్పుతోనే చేయవలసిన దుస్థితిలో వున్నాడనేదే!

ప్రభుత్వ ఈ వ్యవసాయ విధానం వ్యవసాయ పనిని నైపుణ్యం లేని శ్రమగా పరిగణిస్తోంది. ఇది వేతనాలను నిర్ధారించటంలో ఎన్నో సమస్యలను తెస్తోంది. ప్రత్యామ్నాయ జీవనానికి మార్గం వుంటే 43 శాతం రైతులు వ్యవసాయాన్ని విడనాడటానికి సిద్ధంగా ఉన్నారని రాధాకృష్ణన్ కమిటీ నివేదిక చెప్తోంది. ఈ రోజున, ఒక రైతు కుటుంబానికి రోజువారీ ఆదాయం 30 రూ॥ నుండి 35 రూ॥ మాత్రమే కాగా ఆరవ వేతన సంఘ సిఫార్సుల ప్రకారం ప్రభుత్వంలోని అతిక్రిందిస్థాయి ఉద్యోగివేతనం రోజుకు రూ. 100 గావుంది. జిల్లాకలెక్టర్ స్థాయిలో రోజుకు రూ 2000 నుండి 3000 వరకు వేతనం వుంది. వ్యవసాయం పట్ల పాలకులు పక్షపాత , నిర్లక్ష్య దృష్టికారణంగా పెరుగుతున్న అసమానత్వం, స్వీయ మరణాలు అనేవి రైతులను వ్యవసాయం నుండి పారిపోయేట్లు చేస్తున్నాయి.

విపత్తుల నుండి రైతాంగాన్ని కాపాడి రక్షణ కల్పించే బీమాసౌకర్యం లేకపోవటమనేది రైతుల ఆత్మహత్యలకు ముఖ్యమైన కారణాల్లో ఒకటిగా వుంది. 'బ్లాక్'ను ఒక యూనిట్‌గా పరిగణించి, ఆ ప్రాంతం మొత్తాన్ని కరువు పీడిత ప్రాంతంగా ప్రకటిస్తే తప్పితే, ఆ బ్లాక్‌లో ఏ గ్రామాల రైతులకీ బీమా అందదు. హెక్టారు భూమికి వ్యవసాయ పెట్టుబడులు రూ. 14 వేల నుండి రూ. 20 వేల వరకూ ఉండగా బీమా మాత్రం హెక్టారుకు రూ. 8,940గా నిర్ణయించారు. మరోవైపున, ఎకరాకు ఉత్పత్తిని 20 నుండి 35 బస్తాలకు పెంచారు. అంటే రైతు 9 బస్తాలకు లోపు పండిస్తే మాత్రమే అతను బీమా పొందటానికి అర్హుడౌతాడు, వర్షపాత లెక్కలు కూడా అదే విధంగా వున్నాయి. పంటవారీగా, అవసరానికి, నెలవారీగా ఎంత వర్షం నమోదైందనే దానితో నిమిత్తం లేకుండా జూన్ సెప్టెంబరు మధ్యకాలంలో కురిసిన వర్షపాతం సగటున లెక్కించటం జరుగుతోంది. ఈ విధమైన లెక్కల ఫలితంగా బీమా చేసిన పంటలకు కూడా రైతులకు పరిహారం నామమాత్రంగా దక్కకపోగా, బీమా కంపెనీలు మాత్రం పెద్దఎత్తున లాభాలు గడిస్తున్నాయి.

ఇక్కడ మనం సన్నకారు రైతాంగం, కౌలుదార్లకు సంబంధించిన కొన్ని మౌలికమైన సమస్యలను ప్రస్తావించాలి. వీరంతా కరువు ప్రాంత ప్రకటనలతోనూ, వ్యవసాయ రుణాల రద్దుతోనూ, బీమా సౌకర్యాలతోనూ లబ్దిపొందుతున్నట్లుగా చెప్తున్నారు. వారెవ్వరూ బీమా ప్రీమియం కూడా చెల్లించలేని స్థితిలో వున్నారు. రుణాల రద్దు ద్వారా కూడా వీరు పొందిన లబ్ధి ఏమీ లేదు. ఎందుకంటే వీరు చేసిన రుణమంతా ప్రభుత్వేతర సంస్థలనుండే కాబట్టి! దీనితోపాటుగా కౌలుదారీ రక్షణ చట్టం ఒడిషాలో లేదు. ఫలితంగా ఒనగూరే ప్రయోజనమంతా ధనిక రైతులు, భూస్వాములకే. కనుక, ఈ సౌకర్యాలు సన్నకారు రైతాంగానికి, కౌలురైతులకు ఏ విధంగా చేరుతాయి? అనేది ముఖ్యమైన సమస్య. వ్యవస్థలో, చట్టాలలో మౌలికమైన మార్పు తీసుకోకుండా, వేతనాలను సరైన విధంగా నిర్ధారించకుండా, కౌలుదార్ల సంస్కరణలు చేపట్టకుండా, కౌలుదార్ల చట్టాలను అమలు చేయకుండా ఈ సమస్యకు వాస్తవ పరిష్కారం సాధ్యంకాదు. ఒడిషా మొదటి ముఖ్యమంత్రి నవకృష్ణ చౌదరి చేసిన కౌలుదారీ రక్షణ చట్టం ఈ నాటికీ అమలుకు నోచుకోలేదు.

ప్రభుత్వ వ్యవస్థలోని బలహీన యంత్రాగం, ప్రభుత్వ యంత్రాంగ నిర్లక్ష్యధోరణి, ప్రభుత్వ యంత్రాగంపై రాజకీయ నాయకత్వ పట్టులేకపోవటం అనేది అన్ని కార్యక్రమాలను, అన్ని సహకారాలను నిస్తేజం చేస్తున్నాయి. గత సంవత్సరం పంట చీడపీడల బారిన పడినప్పుడు, నాణ్యమైన పురుగు మందులు, పిచికారీ పరికరాలు రైతులకు సకాలంలో అందలేదు. కావున సమస్య తీవ్రమైంది. ఆ పరికరాలు, మందులు బ్లాక్ ఆఫీసులల్లో ఈ నాటికీ గుట్టలుగా పడివున్నాయి.

ఈ కారణాలన్నీ ఒక వైపు వుండగా, రైతుల ఆత్మహత్యలకు ఇతర కారణాలూవున్నాయి. గతంలో వ్యవసాయానికి లభించిన సామాజిక హోదా, గౌరవం ఈనాడు లభించటంలేదు. ఎందుకంటే ఇది లాభదాయకంగా లేదు. తిరిగి ఈ నూతన పోటీ ప్రపంచం, ఎలక్ట్రానిక్ మాధ్యమాలు, ప్రకటనల మోజులో రైతు చిక్కుకు పోతున్నాడు. అతనూ టీవీ, మోటార్‌సైకిల్, రిఫ్రిజిరేటర్, సౌందర్యసాధనాలు, సెల్‌ఫోన్స్ తదితరాలకు అలవాటుపడుతున్నాడు. కానీ తనకు వ్యవసాయం నుండి వచ్చే ఆదాయంతో వీటన్నింటి ఖర్చులనూ భరించటం సాధ్యంకావటంలేదు. చుక్కలనంటే ధరలతో, వ్యవసాయం నుండి లభించే ఆదాయంతో రైతుకు ఈ ఖర్చులన్నింటినీ అందుకోవటం ఎలా సాధ్యమౌతుంది? వరకట్నం వంటి వాటిని చెల్లించక తప్పటంలేదు. విద్య, వైద్యం ప్రైవేటీకరించటమనేది ఈ ఖర్చులను మరెన్నో రెట్లు పెంచుతున్నాయి. అనారోగ్యం బారిన పడితే దానికి ఎంతైనా ఖర్చు పెట్టాల్సిందేకదా! రైతు తన బిడ్డలకు మంచి చదువు నందించాలని కోరుకుంటున్నాడు. చాలా నాసిరకంగా వున్న ప్రభుత్వ విద్యా సంస్థలకు పంపలేక ఖరీదు ఎక్కువైనా ప్రైవేటు విద్యా సంస్థలకు పంపక తప్పటంలేదు. ఇవన్నీ అతన్ని మరింత వత్తిడికి, ఆత్మహత్యలకు గురిచేస్తున్నాయి. మరిన్ని ఎక్కువ అప్పులు చేయటానికి ఈ పరిస్థితులు నెడుతున్నాయి.

ప్రభుత్వ అధికార యంత్రాగం వైపు నుండి మద్దతు లేకపోవటమనేది రైతు మరింత నిరాశలో కుంగి పోయేందుకు కారణమౌతున్నది. మరొక ముఖ్యమైన విషయమేమంటే, రైతుకు వ్యవసాయం మినహా మరో ప్రత్యామ్నాయం లేదు. వ్యవసాయ కూలీలకూ, కౌలు రైతులకూ సంవత్సరం పొడుగునా ఉపాధి లభించటం అసాధ్యం. కావున వారు ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు కాంట్రాక్టు కార్మికులుగానో, బంధిత కూలీలుగానో వలస వెళ్తున్నారు.

ఈ సమస్య పరిష్కారానికి ఒక దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం

1. భూ సంస్కరణలు మరియు కౌలురైతుల చట్టాలను అమలు చేయాలి.
2. వ్యవసాయాన్ని నైపుణ్యపు శ్రమగా గుర్తించాలి. తద్వారా ఒక ప్రభుత్వ ఉద్యోగి వేతనానికి, రైతు ఆదాయానికి మధ్య అంతరం తొలగించాలి. అత్యున్నత ప్రభుత్వోద్యోగి వేతనానికి పరిమితి విధించాలి.
3. వ్యవసాయ కూలీల వేతనాన్ని నిర్ణయించేటప్పుడు, వారి సగటు కుటుంబ సభ్యుల సంఖ్యను 3గా కాకుండా ఆరుగా పరిగణించాలి.
4. బ్యాంకుల చట్టాలను సవరించటం ద్వారా వ్యవసాయ రుణాలపై చక్రవడ్డీ విధించరాదు.
5. వ్యాపారం, వ్యవసాయం మధ్య అంతరాలను తగ్గించేందుకు వడ్డీని నాలుగుశాతానికి తగ్గించటంతోపాటు కాలపరిమితి 5 సం॥లకు పెంచాలి.
6. గ్రామాల్లోని వడ్డీ వ్యాపారులు, స్వయం సహాయక బృందాలు, సూక్ష్మరుణ సంస్థలపై కఠిన నియంత్రణ వుండాలి.
7. బీమా విషయంలో పరిహారాన్ని హెక్టారుకు రు. 8,940 నుండి రు. 18 వేలకు పెంచాలి.
8. బీమా విషయంలో గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలి.
9. పరోక్ష రుణం స్థానంలో ప్రత్యక్షరుణం అందించాలి-రుణం పెంచాలి. మొత్తంగా వ్యవసాయ రుణాలు మరింతగా పెంచాలి.
10. నాబార్డు తన కార్యకలాపాలను వ్యవసాయంలో విస్తృతం చేయాలి, టాక్స్ ఫ్రీగా వుండాలి.
11. గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికభాగాన్ని వ్యవసాయరంగపు పనులలో ఉపయోగించాలి.

అత్యవసరంగా కానీ, దీర్ఘకాలికంగాగానీ ఈ కార్యక్రమాలన్నీ సఫలీకృతం కావాలంటే ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని గుర్తించి ఒప్పుకో గలగాలి. ✶

# కునారిల్లుతున్న ప్రభుత్వ వైద్యం

**ప్రజలకు** కూడు, గూడు, చదువు, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వీటిని పొందటం ప్రజల హక్కు, భారత పాలకవర్గ ప్రభుత్వాలు ఈ బాధ్యతను విస్మరించిన ఫలితంగా పేదలు వీటికి దూరమై అనేక అవస్థలు పడుతున్నారు. అనేకమంది ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి.

దేశంలో వర్గ వ్యత్యాసాలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. ఒక వైపున పేదరికం పెరుగుతూ ఉంటే మరొక వైపున సంపన్న వర్గాల ఆస్తులు విపరీతంగా పెరుగుతున్నాయి. సేద్యపు భూములపై ఆధిపత్యం సంపాయించిన భూస్వాములు గ్రామీణ పేదలను దోచుకుంటూ ఉంటే, బడా పెట్టుబడిదారులు కార్మికులను దోచుకుంటున్నారు. ఫలితంగా గ్రామీణ పేదలు, పట్టణ కార్మికులు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. అందుకు కారణం, భూములపైన, పరిశ్రమలపైన వీరికి హక్కులేకపోవటమే.

శ్రమశక్తే కుటుంబ జీవనంగా బ్రతుకుతున్న గ్రామీణ పేదలు, పట్టణ కార్మికులు, తమకు వచ్చే ఆదాయంతో కుటుంబాలు గడవలేక దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. చాలీచాలని ఆహారం, సరైన నివాసం లేక దుర్గంధ పూరిత వాతావరణం మధ్య జీవిస్తూ అనేక వ్యాధుల బారినపడి, వైద్యంచేయించుకునే ఆర్థిక స్థోమత లేక మృత్యువుతో పోరాటం చేయలేక ప్రాణాలు విడుస్తున్నారు. దోపిడీవర్గ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న పాలక ప్రభుత్వాలు పేదలకు పోషకాహారాన్ని అందించలేక పోవటమే కాకుండా సరైన వైద్యం కూడా అందించలేకపోయింది. ఫలితంగా వైద్యం అందక అనేకమంది పేదల ప్రాణాలు అర్ధాంతరంగా ముగుస్తున్నాయి.

పేదలకు వైద్యం అందించటంలో పాలక ప్రభుత్వాల వైఫల్యంపై విమర్శలు వెల్లువెత్తటంతో, ప్రభుత్వ వైద్యశాలలను కొన్నింటినైనా ఏర్పాటు చేయక తప్పలేదు. వీటి ద్వారా ప్రారంభంలో పేదలకు కొంతమేర వైద్యసేవలు అందినప్పటికీ, అన్నిరంగాలకూ వ్యాపించిన అవినీతి ఈ వైద్యాన్నికి సోకింది. ప్రజలకు అందాల్సిన మందులు బ్లాక్ మార్కెట్‌కి తరలిపోతున్నాయి. డాక్టర్లు వ్రాసియిచ్చే మందులు బయట కొనుక్కోవలసి వస్తున్నది. ఎబిసి 'సర్వరోగ'నివారిణి బిళ్లలు, రంగునీళ్ల మాత్రమే ఆసుపత్రులలో పేదలకు లభించే మందులు. డబ్బులు లేని పేదలు వాటితోనే సరిపెట్టుకొంటూ ప్రాణాలు కోల్పోతున్నారు. డబ్బులేనిదే ప్రభుత్వ ఆసుపత్రులలో శస్త్రచికిత్సలు జరగటం లేదు. గేటు కాపలా దారుని దగ్గర నుండి పెద్దవైద్యుల వరకూ లంచాలు లేకుండా పని చేయటంలేదు. ఇక్కడ కూడా డబ్బుగలవారికే వైద్యం అన్న విధంగా మారింది.

### తగ్గిపోతున్న బడ్జెట్ కేటాయింపులు :

దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు అమలు ప్రారంభమైననాటి నుండి, ప్రపంచ బ్యాంక్ సూచనల మేరకు, ప్రభుత్వ రంగం ద్వారా అందించే సేవలకు నిధులు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులకు నిధులు కేటాయింపులు నామ మాత్రంగా ఉండటంతో, నామ మాత్రపు సదుపాయాలు కూడా కరువై ఆసుపత్రులు కునారిల్లుతున్నాయి. వైద్యాన్ని కూడా ప్రైవేటీకరించమని ప్రపంచబ్యాంక్ చెప్పటంతో, సర్వీస్ సేవల పేరుతో రోగుల నుండి యూజర్ ఛార్జీలు వసూలుకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆపరేషన్లకు డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. బడ్జెట్ కేటాయింపులూ తగ్గిస్తూ, ఆసుపత్రులను ప్రైవేటీకరించే చర్యలు చేపట్టింది. 2002లో ఆమోదించిన జాతీయ వైద్య విధానం ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో 7 శాతం నిధులు వైద్యరంగానికి కేటాయించాలి. కానీ బడ్జెట్‌లో 4 శాతం కూడా కేటాయించలేదు. గత సంవత్సరం బడ్జెట్‌లో 4,295 కోట్లు కేటాయించగా, 3,467 కోట్లను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సంవత్సరం 5,049 కేటాయించి నిధులు పెంచినట్లు ప్రచారం చేసుకొంటున్నది. ఇది వాస్తవం కాదు. గత సంవత్సరం కేటాయించిన బడ్జెట్‌లో 828 కోట్లు విడుదల చేయకుండా మిగిలి ఉంది దాన్ని మినహాయిస్తే గత సంవత్సరం కన్నా బడ్జెట్ కేటాయింపు తక్కువ. ఈ కేటాయింపులు ఎంత వరకు అమలు జరుగుతుందీ వేచిచూడాల్సిందే. వైద్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు నామమాత్రంగా ఉండటంతో కనీస మౌలిక సదుపాయాలు కూడా ఆసుపత్రులలో ఉండటంలేదు.

### మందులకు నిధులులేమి

గత సంవత్సరం రోగుల మందుల కోసం 180 కోట్లు కేటాయించినా, విడుదల చేసింది 91 కోట్లు మాత్రమే. ఈ సంవత్సరం 198 కోట్లను కేటాయించింది. ఈ కేటాయింపులో గత సంవత్సరం మిగిలివున్న 79 కోట్లు ఉన్నాయి. అంటే వాస్తవ కేటాయింపు 119 కోట్లు మాత్రమే. ఈ కేటాయింపులు మందుల కొనుగోలుకు ఏ మాత్రం సరిపోకపోవటం వలన, పేదలకు నామమాత్రంగా అందే మందులు కూడా లేకుండా పోతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఇవ్వకపోవటంపై ప్రజల్లో వ్యక్తమౌతున్న వ్యతిరేకతను ప్రక్కకు మళ్ళించేందుకు జన ఔషధ పథకం ప్రవేశ పెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం క్రింద మందుల ధరల్లో 50 శాతం తగ్గించి పేదలకు యిస్తామని చెప్పినా ఇంతవరకు షాపుల ఏర్పాటుగానీ, మందుల కొనుకోలుగానీ జరగలేదు. ఆరోగ్యశ్రీ పథకం క్రింద ప్రతిసంవత్సరం 11 వందల కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. 70 శాతం మందికి పైగా ప్రజలు వినియోగించుకొంటున్న ప్రభుత్వ ఆసుపత్రులలో పేదరోగులకు మాత్రం మందులు అందవు. ఆరోగ్యశ్రీ పథకం క్రింద గత నాలుగు సంవత్సరాలుగా కార్పోరేట్ ఆసుపత్రులకు 7,25,554 శస్త్ర చికిత్సల నిమిత్తంగా 2106 కోట్లు ఖర్చు చేసింది. ప్రభుత్వ ఆసుపత్రులలో 50 కోట్లతో ఒక్క సంవత్సరంలోనే 10.66 లక్షల శస్త్ర చికిత్సలు నిర్వహించారు. దీన్ని గమనించినప్పుడు ఆరోగ్యశ్రీ పథకం తరహాలో ప్రభుత్వ ఆసుపత్రులకు నిధులు కేటాయిస్తే వైద్య సేవలు ఇంకా విస్తృతంగా అందుతాయి. ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, వేలకోట్ల రూపాయలను కార్పోరేట్ సంతకు దోచిపెడుతున్నది. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆధీనంలోని 21 ఆసుపత్రుల్లో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు పరికరాలు, ఫర్నిచర్, సర్జికల్ పరికరాలు ఏర్పాటు చేయాల్సిఉంది. ఇందుకు పదికోట్లు మాత్రమే కేటాయించింది. ఇది పరికరాల కొనుగోలుకు ఏమాత్రం సరిపోదు. ఫలితంగా సిటిస్కాన్, సైంటిఫిక్ డయాగ్నస్టిక్ పరీక్షలు చాలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవటం వలన, ప్రైవేటు కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాల్సి వస్తున్నది.

### ఆసుపత్రుల్లో పడకల సమస్య

ప్రమాదకర వ్యాధులతో వస్తున్న రోగులు ఇన్ పేషంట్లుగా చేరాలి కాని వారికి పడకలు దొరకక అల్లాడుతున్నారు. రాష్ట్రంలోని మొత్తం 233 ఆసుపత్రుల్లో 15,864 పడకలు మాత్రమే ఉన్నాయి. ఇన్‌పేషెంట్లుగా ఆసుపత్రుల్లో చేరుతున్నవారి సంఖ్యను పరిశీలిస్తే పడకల కొరత ఏ విధంగా ఉందో అర్థమౌతుంది.

ఈ అంకెలను పరిశీలిస్తే ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న రోగుల సంఖ్య, ఇన్‌పేషంట్లుగా చేరేవారి సంఖ్య ఎంత తక్కువగా ఉందో అర్థమౌతుంది. ఇందుకు అణుగుణంగా ఆసుపత్రుల్లో వసుతుల ఏర్పాటులోను, పడకలు ఏర్పాటులోను ప్రభుత్వం వైఫల్యం స్పష్ట మౌతున్నది.

**2008-09 నుండి 2010-11 సం॥ వరకు రోగుల వివరాలు**

| వివరాలు | 2008-09 | 2009-10 | 2010-11 ఏప్రిల్ -డిసెంబరు 10 |
|---|---|---|---|
| పడకల సంఖ్య | 16,117 | 16,117 | 16,117 |
| ఔట్ పేషంట్లు | 74,88,003 | 78,49,669 | 49,97,247 |
| ఇన్ పేషంట్లు | 8,79,227 | 76,110 | 5,20,418 |
| సర్జరీలు | 2,76,873 | 2,27,736 | 1,79,574 |

### భర్తీకాని వైద్య పోస్టులు

మందులు, పరికరాలు, కనీస మౌలిక సదుపాయాలూ లేక రోగులు పడే అవస్థలతో పాటు, ఖాళీ అయిన వైద్య పోస్టులను భర్తీ చేయకపోవటం, అవసరమైన కొత్త పోస్టుల నియామకానికి చర్యలు తీసుకోక పోవటం వలన తగినంత మంది వైదులు, నర్సులు లేక రోగులకు వైద్యం అందటంలేదు. అనేక ఆసుపత్రుల్లో డాక్టర్ పోస్టుల భర్తీకోసం 2010 జులైలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అందుకు అనుగుణంగా 1,251 మంది అభ్యర్థులు ధరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల్లోని తొమ్మిది స్పెషలైజేషన్‌లకు గాను 411 మంది అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేశారు. ప్రత్యేక విభాగాల్లో 580 పోస్టులు ఉండగా 197 పోస్టులను మాత్రమే ఎంపిక చేశారు. ప్రత్యేక విభాగాల్లో 580 పోస్టులు ఉండగా 197 పోస్టులను మాత్రమే భర్తీ చేశారు.

పట్టికలోని భర్తీచేసిన పోస్టులను చూస్తే నోటిఫికేషన్ విడుదల చేసిన పోస్టుల్లో మూడవవంతు పోస్టులను మాత్రమే భర్తీ చేసింది. వైద్యరంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించటం, మందులు అందుబాటులో లేకుండా చేయటం, మౌలిక సదుపాయాలను విస్మరించటం, డాక్టర్లను నియమించక పోవటం రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేస్తున్నది. ప్రభుత్వరంగ వైద్యాన్ని ప్రైవేటీకరించాలన్న ప్రపంచ బ్యాంక్ సూచనల మేరకే ఇది జరుగుతున్నది. ఇది పేదలకు వైద్యం అందించే బాధ్యతనుండి ప్రభుత్వం తప్పుకోవటమే.

ప్రభుత్వం అనుసరిస్తున్న వైద్య విధానం ఫలితంగా నిధులు, సౌకర్యాలు లేమితో ప్రభుత్వాసుపత్రులు కునారిల్లుతున్నాయి. ప్రజలకు వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి స్థితిలో పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యం అందించే బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలని, ఉన్నప్రభుత్వ ఆసుపత్రులని ఆధునీకరించ టంతోపాటు, కొత్తగా ఆసుపత్రుల నిర్మాణం చేపట్టాలని, వేలకోట్ల రూపాయలను కార్పోరేట్ ఆసుపత్రులకు కట్టబెట్టే విధానాలని విడనాడాలని ప్రజలు ఉద్యమించాలి.

**భర్తీ చేయవలసిన పోస్టుల వివరాలు**

| డాక్టర్స్ స్పెషలైజేషన్ | ప్రకటించిన పోస్టులు | భర్తీ అయిన పోస్టులు |
|---|---|---|
| గైనకాలజీ | 50 | 27 |
| డైటీషియన్ | 95 | 40 |
| అనస్థీషియా | 59 | 26 |
| జనరల్ మెడిసిన్ | 100 | 25 |
| జనరల్ సర్జరీ | 148 | 38 |
| సైకియాట్రి | 19 | 4 |
| ఆర్థో | 36 | 11 |
| రేడియాలజీ | 15 | 1 |
| పాథాలజీ | 60 | 25 |
| మొత్తం | 580 | 197 |

## వలస కూలీని హత్యచేసిన ఇటుకబట్టీ యజమానిని కఠినంగా శిక్షించాలని ఏపిఎఫ్‌టియు ఆందోళన

**నర్సంపేట, 13-3-11 :**

నర్సంపేట మండలం సర్వాపురం గ్రామ శివారులోని పాఖాల కాలువ ప్రక్కనున్న ఒక ఇటుక బట్టీ యజమాని రత్నం, మధ్య దళారీ ద్వారా వేతనం కాంట్రాక్టు కుదుర్చుకుని ఒడిషా నుండి 12 మందిని తీసుకువచ్చి గత 5 నెలలుగా రాత్రింబవళ్ళు సరిఅయిన తిండి కూడా పెట్టకుండా పనిచేయిస్తున్నారు. ఫలితంగా ఆ వలస కార్మికులంతా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. తాము పనిచేసే స్థితిలో లేము అంటూ వలస కూలీలైన క్రిష్ణభాయి, లక్ష్మిబాయి దంపతులు యజమాని కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడ్డారు. కనికరం లేకుండా వారిని గొడ్లను బాదినట్లు కర్రతో బాది 11-3-11న లక్ష్మిబాయిని హత్య చేశాడు.

ఈ హత్యను కప్పిపుచ్చుకొనుటకు ఆరోజు రాత్రి వరకూ శవాన్ని బయటకు తీయకుండావుంచి. 10వేల రూపాయలు ఇచ్చి మధ్య దళారీతో దహన సంస్కారాలు చేయుటకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాడు. ఈ విషయం బయటకు పొక్కి పోలీసులు విచారించగా కూడా తాను ఎవరినీ కొట్టలేదనీ ఆమె అనారోగ్యంతో మృతిచెందిందనీ బుకాయించాడు. చివరకు పోలీసులు అనుమానస్పద కేసుగా నమోదు చేసి పోస్టుమార్టం జరిపించగా కర్రతో కొట్టటం వలనే చనిపోయినట్లు నిర్ధారణ అయినది.

వలస కూలి లక్ష్మిబాయిని హత్యచేసి తనకున్న డబ్బు, పలుకుబడితో కేసు నుండి తప్పించుకొనుటకు ప్రయత్నిస్తుండగా, అతనిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ 12-3-2011న ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో నర్సంపేట ఆర్‌డిఒకు 13-3-2011న వరంగల్ జిల్లా కలెక్టరుకు వినతి పత్రం అందించారు. అలాగే లక్ష్మిబాయి కుటుంబానికి 5 లక్షల రూ॥ల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వలస కూలీలందరికి కనీస సౌకర్యాలు కల్పించాలనీ, ఇక్కడి కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే యజమాని అరాచకాలను, గతంలో కూడ కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ ఏపిఎఫ్‌టియు వరంగల్ జిల్లా కార్యవర్గం కరపత్రాలు ప్రచురించి ప్రచారం నిర్వహించారు. ఈ ఆందోళన ఫలితంగా యజమాని రత్నంను హత్యానేరం క్రింద అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో కా॥ మోడెం మల్లేష్, ఐలన్న, క్రిష్ణ. తదితరులు పాల్గొన్నారు.

## థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు వ్యతిరేక ఆందోళనకారులపై కాల్పులకు నిరసన



**ఒంగోలు, 28-2-11 :**

శ్రీకాకుళంజిల్లా-సంతబొమ్మాళి మండలంలో థర్మల్ విద్యుత్ కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారిపై పోలీసుల కాల్పులను, అణచివేత చర్యలను నిరసిస్తూ సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో ఒంగోలులో ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కామ్రేడ్ డి.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో థర్మల్ విద్యుత్ కేంద్రాలతోపాటు, అణువిద్యుత్ కేంద్ర స్థాపనకు దళారీ పాలకులు అనుమతించారని, దీని ఫలితంగా రైతులు భూములను, మత్స్యకారులు తమ జీవనాన్నీ కోల్పోవటమేగాక ఇవి ప్రజలపై తీవ్ర దుష్పరిణామాలకు దారితీస్తాయనీ, వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిపై కాల్పులు జరిపి ఇద్దర్ని బలిగొనటం, అనేకమందిని గాయపరచటం, గ్రామంలో ఇళ్ళను తగులబెట్టటం వంటి చర్యలన్నీ ప్రభుత్వ ఫాశిస్టు నిర్బంధాన్ని సూచిస్తున్నాయన్నారు.

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ ఎస్. లలితకుమారి మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కనపర్తి ప్రాంతంలో జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించనున్న థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా కూడా నిరంతరాయ ఆందోళన సాగుతున్నదని, నెల్లూరు తీరంలో 25 కి.మీ. పరిధిలోనే 30 వరకూ థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపనకు పూనుకోవటమంటే తీరాన్నంతా తీవ్ర పర్యావరణ వినాశనంలో ముంచెత్తటమేననీ, ప్రభుత్వాల ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన పోలీసు కాల్పులలో మృతి చెందిన వారికి జోహార్లు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ ఎం.ఎస్. శాయి, ఎన్‌వైఎస్ రాష్ట్ర నాయకులు కా॥ బి. సుబ్బారావు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ రేణుక, ఏపిఎఫ్‌టియు నాయకులు కామ్రేడ్ ఉమామహేశ్వరరావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 'మహిళలపై హంతకదాడులు; మద్యం దోపిడీ-మైక్రోఫైనాన్స్ దౌర్జన్యాలూ-అవినీతి కుంభకోణాలు-అధిక ధరలకూ వ్యతిరేకంగా ఉద్యమిద్దాం'

# మార్చి8 'అంతర్జాతీయ శ్రామిక మహిళల దీక్షాదినం' సభలలో స్త్రీ విముక్తి సంఘటన పిలుపు

## బందరు

అంతర్జాతీయ శ్రామిక మహిళల దీక్షాదినాన్ని పురస్కరించుకొని స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సెంటర్ నుండి కోనేరు సెంటరు వరకు మహిళలు ప్రదర్శన నిర్వహించారు.

అనంతరం కోనేరు సెంటరులో జరిగిన బహిరంగ సభలో సంస్థ రాష్ట్ర అధ్యక్షులు డా॥ సి. విజయ ప్రసంగిస్తూ పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక దోపిడీ విధానాల ఫలితంగా దేశ ప్రజల జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారుతున్నాయనీ, పేదరికం వల్ల ఎదురయ్యే అనేక సమస్యలు మహిళల జీవితాలని మరింత క్రుంగదీస్తున్నాయని, అంతర్జాతీయ మహిళా దిన స్ఫూర్తినందుకోవటమంటే మహిళల జీవితాలను కష్టభరితం చేస్తున్న శ్రమ దోపిడీ, అణచివేతలకు, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించటమేనని వివరించారు. వివిధ ప్రపంచదేశాలలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు సంఘీభావాన్ని ప్రకటించారు.

ఈ సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న న్యాయవాది మరియు సైకాలజిస్టు సుగుణగారు మాట్లాడుతూ స్త్రీలలో నిరక్షరాస్యతను రూపుమాపాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. మరోవక్తగా పాల్గొన్న డిఎల్‌వి రాధికగారు మాట్లాడుతూ మహిళలపై సాగుతున్న హంతకదాడులను తీవ్రంగా ఖండించారు.

ఈ సభలో ఎపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ యద్దనపూడి సోనీ, ఎపిఎఫ్‌టియు నాయకులు ఎం. సుధాకర్, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకులు కామ్రేడ్ పి. అంజమ్మ, కె. ఉమామహేశ్వరరావు, టి. లీలామనోహర్, బి. నాగమణి ప్రసంగించారు. ప్రజాకళాకారుల నృత్యాలు, పాటలు ముఖ్యంగా బాలకళాకారుల నృత్యాలు, పాటలు ప్రజల్ని బాగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో 300 మంది శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

## విజయవాడ

స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో 'మార్చి 8'న స్థానిక శిఖామణి సెంటర్, చంద్రరాజేశ్వరరావు గ్రంథాలయంలో సంస్థ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ శేషమ్మ అధ్యక్షతన సభ నిర్వహించారు.

స్త్రీ విముక్తిసంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ అరుణ మాట్లాడుతూ పేదలపై పన్నుల భారాన్ని, అధిక ధరల భారాన్ని మోపుతున్న పాలకులు మరో వైపున లక్షలకోట్ల రూపాయల అవినీతి, కుంభకోణాలలో మునిగి తేలుతూ దేశ ప్రజల జీవితాల్ని ఘోరంగా దెబ్బతీస్తున్నారని, శ్రమదోపిడీతోపాటు మహిళలు పితృస్వామ్య దోపిడీ, అణచివేతలకు గురౌతున్నారని వివరిస్తూ మహిళల దీక్షాదినాన్ని వ్యాపార సరుకుల అమ్మకాల, ప్రచారదినంగా దిగజార్చటం శోచనీయమన్నారు. ఓపిడిఆర్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, అడ్వకేటు వి.ఎన్.వి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గృహహింసను అరికట్టే పేరిట చట్టాలెన్నివున్నా శూన్యమనీ మహిళలపై సాగుతున్న వ్యవస్థీకృత దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటమే పరిష్కారమన్నారు. ఎన్.వై.ఎస్. నాయకులు ఎస్‌కె. బాషావలి తదితరులు ప్రసంగించారు.

## నర్సంపేట

స్త్రీవిముక్తిసంఘటన రాష్ట్ర పిలుపు మేరకు అంతర్జాతీయ శ్రామిక మహిళా దీక్షాదినం సందర్భంగా మార్చి 8న స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో వరంగల్‌జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు స్త్రీవిముక్తి సంఘటన వరంగల్ జిల్లా అధ్యక్షులు కా॥ ఈర్ల పద్మ అధ్యక్షత వహించారు. ఈ సభలో సంస్థ జిల్లా కార్యదర్శి మోడెం శ్రీలత మాట్లాడుతూ మైక్రోఫైనాన్స్ సంస్థల దోపిడీ, దౌర్జన్యాలు, వేధింపులూ భరించలేక ఎంతోమంది ఆత్మహత్యల పాలౌతున్నారని, గిట్టుబాటు ధరలేక ఆత్మహత్యల పాల్పడుతున్న రైతుల కుటుంబాలలోని స్త్రీలు మరింత దుర్భరస్థితిని ఎదుర్కొంటున్నారని, అధిక ధరల కారణంగా కుటుంబంలో స్త్రీలకు అందే ఆహారం మరింతగా కుచించుకుపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

స్త్రీవిముక్తిసంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ టి. శ్రీదేవి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమాల కోసమేనంటూ ప్రజలపై పాలకులు పన్నులు విధిస్తూ, పెంపుచేస్తూ ఒకవైపున ఆ సంక్షేమ పథకాలను మాత్రం ఎత్తివేస్తూ మరోవైపు తమ దోపిడీ మద్యం విధానం ద్వారా ప్రజల నుండి పెద్ద ఎత్తున ఆదాయాలను కొల్లగొడుతున్నారని వివరించారు. మహిళల సంఘటిత పోరాటాల ఆవశ్యకతను వివరించారు. ఈ సభలో డా॥ ఎల్. విద్య ప్రసంగిస్తూ స్త్రీలపై హంతక దాడులకు, హింసకు మద్యం ఒక ప్రధాన కారణంగా ఉందన్నారు.

సభానంతరం 200 మంది మహిళలతో, జెండాలతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సభలో ప్రజా కళాకారులు, బాలకళాకారులు ఆలపించిన గేయాలు సభికులకు స్ఫూర్తినిచ్చాయి.

## శ్రీకాకుళం

అంతర్జాతీయ శ్రామిక మహిళాదినోత్సవం సందర్భంగా స్త్రీవిముక్తిసంఘటన ఆధ్వర్యంలో స్థానిక డైమండ్ పార్క్ నుండి ఏడురోడ్ల కూడలిమీదుగా డే, నైట్ జంక్షన్ వరకూ మహిళలందరూ స్త్రీలపై హత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుదామని, సామ్రాజ్యవాద సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుదామని నినదిస్తూ కాగడాలతో ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా హాజరైన మహిళలనుద్దేశించి స్త్రీవిముక్తిసంఘటన జిల్లా కార్యదర్శి కా॥ తాండ్ర అరుణ ప్రసంగిస్తూ మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 63 సం॥లు గడిచినా స్త్రీలపై అత్యాచారాలు, వరకట్న హత్యలు, భ్రూణహత్యలు, మద్యం కారణంగా నేరాలు, పతన సంస్కృతితో నేరాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రైవేటు పెట్టుబడిదారులు విచ్చలవిడిగా తమ భూముల దురాక్రమణకు పాల్పడటానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలలో మహిళలు ముందు భాగాన నిలుస్తున్నారన్నారు.

## అనంతపురం

'మార్చి 8' సందర్భంగా 200 మంది మహిళలతో స్థానిక కృష్ణకళామందిరం నుండి డిగ్రీకాలేజ్, ఎన్.టి.ఆర్. కూడలి, సప్తగిరి సర్కిల్ మీదుగా ఎన్.జి.ఓ. హోమ్ వరకు స్త్రీవిముక్తిసంఘటన ఆధ్వర్యంలో మహిళలు జెండాలు, బ్యానర్లు చేబూని నినాదాలు చేస్తూ క్రమశిక్షణగా ప్రదర్శన నిర్వహించారు.

ప్రదర్శన అనంతరం ఎన్.జి.ఓ. హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభకి సంస్థ పట్టణ కన్వీనర్ సరిత అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ కొండమ్మ మాట్లాడుతూ విద్యార్థినులపై, మహిళలపై హంతక దాడులు పెరుగుతున్నాయని వీటికి వ్యతిరేకంగా పోరాటంద్వారానే ప్రజాసంస్కృతిని సాధించుకోగలుగుతామని అన్నారు. సంస్థ జిల్లా కన్వీనర్ కా॥ భూదేవి పురుషులతో సమానంగా మహిళలకు సమానవేతనం లభించటం లేదన్నారు. ఇంకా సంస్థ నగర కో-కన్వీనర్ శ్రీలక్ష్మి, నగర కమిటి సభ్యులు కా॥ ప్రమీల తదితరులు ఈ సభలో మాట్లాడారు.

## ఒడిషా

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శతసంవత్సర సందర్భాన్ని పురస్కరించుకొని పూరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ప్రగతిశీల మహిళా మంచ్ (పిఎమ్ఎమ్) ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. కపిలేశ్వర పూర్‌లో 400 మంది మహిళలు ప్రదర్శన నిర్వహించి విదేశీ మద్యానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా పి.ఎమ్.ఎమ్. కన్వీనర్ కా॥ భవాని,, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కా॥ బ్రహ్మానంద మాలిక్ మార్చి 8 ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసంగించారు.

తిరిగి, మార్చి 14న బ్రహ్మగిరి ప్రాంతంలో 300 మంది పైగా మహిళలతో సభ నిర్వహించారు. మహిళలు భూమికోసం, తమ వేతనాల పెంపుదల కోసం ఈ సందర్భంగా నినదించారు. తాము ఎదుర్కొన్న నిర్బంధాలను పోరాటల్లో పాల్గొన్న మహిళలు వివరించారు. చిలకాసరస్సు ప్రాంతంలో పోలీసులు భూస్వాముల పక్షం వహించి మత్స్యకారులపై అత్యాచారాలకు పాల్పడిన భూస్వాములపై చర్యలు చేపట్టక పోవటాన్ని నిరసిస్తూ తిరిగి మార్చి 22వ తేదీన బ్రహ్మగిరి పోలీస్ స్టేషన్ ఎదుట మహిళలు బైఠాయించి ధర్నా చేపట్టి సభనిర్వహించారు. ✡

# ఢిల్లీ పౌరుల సమస్యలపై ఐక్య నిరసన ప్రదర్శన

**ఢిల్లీ, 6-3-11 :**

సిపిఐ(ఎం-ఎల్), ఎస్‌యుసిఐ(సి), సిజిపిఐ, పీపుల్సు ఫ్రంటుకు చెందిన వందలాది కార్యకర్తలు ఢిల్లీ పౌరులెదుర్కొంటున్న అధికధరలు, నిరుద్యోగం, అవినీతి, తదితర సమస్యపై ఢిల్లీ సెక్రటేరియట్ ముందు నిరసన ప్రదర్శన చేశారు. ప్రదర్శన ఐటిఓ సెంటరుకు చేరగానే పోలీసులు ఆపివేశారు. దానితో అక్కడే నిరసన సభను నిర్వహించారు. కా॥ జగదీష్ శర్మ, సిపిఐ(ఎంఎల్), కా॥ ఆర్.కె. శర్మ (ఎస్‌యుసిఐ), కా॥ సంతోష్ (సిజిపిఐ), కా॥ నరేందర్(పీపుల్స్‌ఫ్రంటు) అధ్యక్షవర్గంగా వున్న సభలో నాయకులు ప్రసంగించారు.

'అంతులేకుండా పెరిగిపోతున్న ధరలతో ప్రజల జీవితాలు దుర్భరమౌతున్నాయి. ఎన్‌డిఏ, యుపిఏ, ప్రాంతీయ పార్టీలు ఏవి అధికారం చెలాయించినా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోనందున విద్య, వైద్యం, ఆరోగ్యం, త్రాగునీరు వంటి సేవలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. నిత్యావసరాల వాణిజ్యాన్ని చేపట్టి, ప్రజా పంపిణీ వ్యవస్థను చేపట్టేబదులుగా, వీటికి బడ్జెట్టు కేటాయింపులను తగ్గిస్తున్నారు. బ్లాక్‌మార్కెట్టునూ, భవిష్యవాణిజ్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రజలనుపీల్చి పిప్పి చేసే అన్ని అవకాశాలూ వారికి కల్పిస్తున్నారు. ఈ సేవలను ప్రైవేటీకరిస్తున్నారు. దీనితో ప్రజల జీవనం దుర్భరమౌతున్నద'ని నాయకులు విమర్శించారు.

'దేశరాజధాని ఢిల్లీలో పౌరుల జీవన పరిస్థితులు దిగజారి పోతున్నాయి. ఢిల్లీలోని మురికి పేటలలో ఎలాంటి కనీస సౌకర్యాలూ లేకుండా 70 శాతం జనాభా నివసిస్తున్నారు. మంచినీరు, మురుగునీటి వ్యవస్థలు, కరెంటు, వైద్యసేవలు, పాఠశాలలు, పోస్టాఫీసులు, రవాణా లేక ప్రజల జీవితాలు దయనీయంగా వున్నాయ'ని నాయకులు వివరించారు.

'ప్రజల నిజవేతనాలు నానాటికి తగ్గిపోతుండగా, ఫ్యాక్టరీల యజమానులు ప్రకటిత కనీసవేతనాలను కూడా చెల్లించటంలేదు. పనిగంటలు, ప్రావిడెండు ఫండు, ఇఎస్‌ఐ వంటి సౌకర్యాలు అందించటంలేదు. ఫ్యాక్టరీ యజమానులు లాకౌట్లు, మూసివేతలు యధేచ్ఛగా సాగిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, నియత, అనియత రంగాల్లో ఉపాధి అవకాశాలు నానాటికీ తగ్గిపోతున్నాయ'ని అన్నారు.

'పట్టపగలే దోపిడీలు, హత్యలు, బలాత్కారాలూ, మహిళలు, పిల్లలు, వృద్ధులపై దాడులు సాగుతూ ఢిల్లీని నేరస్థుల రాజధానిగా మార్చాయి. సారా అమ్మకాలకు వందలాది షాపులను ప్రభుత్వం తెరచింది. సమాజపు నైతిక విలువలను మట్టిలో కలిపేందుకు అశ్లీల, అసభ్య సంస్కృతిని ప్రచార మాధ్యమాల ద్వారా వ్యాప్తిచేస్తున్నది. శృంగార సరుకులుగా మహిళలను చిత్రిస్తూ మహిళత్వపు గౌరవంపై దాడి చేస్తున్నది' అన్నారు.

ఈ దాడులకు వ్యతిరేకంగానూ, దిగజారుతున్న జీవన పరిస్థితుల మెరుగుదలకూ ప్రజాఉద్యమాన్ని నిర్మించటమే ప్రత్యామ్నాయమని నాయకులు పిలుపునిచ్చారు. ఈ క్రింది 15 డిమాండ్లతో కూడిన మెమోరాండంను ముఖ్యమంత్రికి సమర్పించారు.

1. సామాన్యులకందుబాటులోకి ధరలను తగ్గించే చర్యలు తీసుకోవాలి.
2. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ఠంచేసి అన్ని నిత్యావసరాలను దాని ద్వారా సరఫరా చేయాలి.
3. నిత్యావసరాల టోకు, చిల్లర వ్యాపారాన్ని ప్రభుత్వం చేపట్టాలి.
4. నిత్యావసరాల్లో భవిష్య వాణిజ్యాన్ని నిషేధించాలి.
5. కాంట్రాక్టు, తాత్కాలిక నియామకాలను ఆపాలి ఖాళీగా వున్న ఉద్యోగాలను నింపాలి.
6. అందరికీ ఉపాధి కల్పించాలి. అంతవరకు నిరుద్యోగ భృతి చెల్లించాలి.
7. తాగునీరు, విద్యా, వైద్యం, రవాణాల ప్రైవేటీకరణను ఆపివేయాలి.
8. కరెంటు, గ్యాసు, బస్సు, మెట్రోరైలు ఛార్జీల పెంపును ఆపాలి.
9. అవినీతిపై నిష్పాక్షిక విచారణ జరిపి దోషులను శిక్షించాలి.
10. ఐఎల్‌సి 15వ నివేదిక ప్రకారం కనీస వేతనాన్ని 15 వేల రూ॥లుగా నిర్ణయించాలి.
11. కార్మిక చట్టాలను అమలు జరపాలి. ఉల్లంఘనలను తీవ్రంగా శిక్షించాలి.
12. పేదల పేటలను నివాసిత ప్రాంతాలుగా గుర్తించాలి. అన్ని పౌర సౌకర్యాలు కల్పించాలి. వారిపై విధించిన అన్ని అభివృద్ధి ఛార్జీలన్నింటినీ తొలగించాలి.
13. అవసరాల ప్రాతిపదికగా వృద్ధులకూ, వికలాంగులకూ, వైధవ్యం పొందినవారికి పెన్షను చెల్లించాలి.
14. ఢిల్లీలో పెరుగుతున్న నేరాలను తగ్గించే చర్యలు తీసుకోవాలి. హింస, బలాత్కార నేరస్థుల విచారణ త్వరితం చేసి కఠినంగా శిక్షించాలి.
15. సామ్రాజ్యవాద, బూర్జువా అనుకూల పారిశ్రామిక, ఆర్థిక విధానాలను ఉపసంహరించాలి. ✡





వెలువడ్డాయి!

కాపీలకు:
మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, అరండల్‌పేట,
విజయవాడ




రెంటచింతలలో కాగడాల ప్రదర్శన


పిడుగురాళ్ళలో కాగడాల ప్రదర్శన


పొత్తూరులో విద్యార్థుల ప్రదర్శన

## భగత్‌సింగ్... (13వ పేజీ తరువాయి)

### గుంటూరు, 23-3-11 :

భగత్‌సింగ్ వర్ధంతిసభ స్థానిక చుట్టుగుంట సెంటర్‌లోని పున్నయ్య, శంకర్‌ల భవన్‌లో ఎన్‌వైఎస్, పిడిఎస్‌ఓల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిడిఎస్‌ఓ జిల్లా అధ్యక్షులు కా॥ యు. విజయభారతి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రజల సమస్త కష్టాలకూ కారణమైన పాలక ప్రభుత్వాలు, ప్రజల హృదయాల్లో భగత్‌సింగ్ పట్లనున్న ప్రేమాభిమానాలను సొమ్ముచేసుకొనేందుకు తామూ భగత్‌సింగ్‌కు జోహార్లు చెప్తూ ప్రకటనలు చేయటం సిగ్గుచేటైన విషయంగా పేర్కొన్నారు.

ఎన్‌వైఎస్ జిల్లా కార్యదర్శి కా॥ కె. దేవా మాట్లాడుతూ ఏ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగానైతే భగత్‌సింగ్ రాజీలేని పోరాటం సాగించాడో ఆ సామ్రాజ్య వాదం-ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదం, మొన్న ఇరాక్, నిన్న ఆఫ్ఘనిస్తాన్, నేడు లిబియాపై ఏకంగా దురాక్రమణ పూరిత సైనిక దాడులు సాగిస్తున్నదనీ, మనదేశ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సామ్రాజ్యవాదం చొరబడి సర్వవ్యాపిత సంక్షోభానికి కారణమైందనీ, సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీ పీడనలపై సాగే పోరాటంలో విద్యార్థి, యువత భగత్‌సింగ్ స్ఫూర్తిగా సమరశీలమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమ అనంతరం చుట్టుగుంట సెంటర్ నుండి, పల్నాడుబస్టాండ్, మార్కెట్ సెంటర్ వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించి అమరులకు జోహార్లర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నగర అధ్యక్షులు కా॥ పి. మల్లి, నగర నాయకులు కామ్రేడ్స్ అజయ్, బలరామిరెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా స్థానిక కె.ఎస్.పి.టి. మున్సిపల్ పాఠశాల నుండి విద్యార్థినీ విద్యార్థులు కె.వి.పి. కాలనీ, యతిరాజనగర్, వికలాంగుల కాలనీ వరకు ప్రదర్శన నిర్వహించారు. అమరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు.

### పొత్తూరు, 25-3-11 :

గుంటూరు రూరల్ మండలం పొత్తూరు గ్రామంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా విద్యార్థుల ప్రదర్శన, అనంతరం సభ పిడిఎస్‌ఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగిన ఈ సభకు ఎన్‌వైఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కా॥ ఎం. సురేష్ అధ్యక్షత వహించారు. ఎన్‌వైఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ దేవా ఈ సందర్భంగా ప్రసంగిస్తూ అతిచిన్న వయస్సునుండే భగత్‌సింగ్ దేశభక్తి భావాలను సంతరించుకొన్నాడనీ, జలియన్‌వాలాబాగ్ దురంతంలో రక్తంతో తడిసిన మట్టిని తీసుకొని ఈ దేశం నుండి బ్రిటీష్‌వారిని తరిమివేయటమే ధ్యేయంగా జీవిస్తానని ప్రతినబూని, కడవరకూ అదేవిధంగా జీవించాడనీ, 23 ఏళ్ళ చిరుప్రాయంలోనే చిరునవ్వుతో ప్రాణాలర్పించాడనీ భగత్‌సింగ్ తదితర అమరుల స్ఫూర్తితో ఈ నాటి విద్యార్థి యువత తమ సమస్యల పరిష్కారానికీ, దేశప్రజల సమస్యల పరిష్కారానికీ పోరాటంలో ముందు నిలవా లన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా కామ్రేడ్స్ రాజేశ్వరి, నాగరాజు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

### ఒంగోలు, 23-3-11 :

భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 80వ వర్ధంతి పురస్కరించుకొని ప్రకాశం జిల్లా ఒంగోలు, పొదిలి, వేటపాలెంలలో కారక్రమాలు నిర్వహించారు. ఒంగోలు ఈమనిపాలెంలోని పిడిఎస్‌ఓ కార్యాలయం నుండి విద్యార్థుల ప్రదర్శన ప్రారంభమై అంబేద్కర్ భవన్, ప్రకాశం భవన్, నెల్లూరు బస్టాండుల మీదుగా చర్చిసెంటర్ వరకూ సాగింది. అమరులకు జోహార్లర్పిస్తూ, సామ్రాజ్యవాద దోపిడీ, దుర్మార్గాల్ని నిరసిస్తూ ప్రదర్శనలో నినాదాలు చేశారు. ప్రదర్శన ముగింపులో అమెరికన్ సామ్రాజ్యవాద దిష్టిబొమ్మను దగ్ధంచేసి లిబియాపై అమెరికా సంకీర్ణసేనల దురాక్రమణ పూరిత సైనిక దాడిని ఎలుగెత్తి ఖండించారు.

నవ యువ సమాఖ్య రాష్ట్ర నాయకులు కా॥ ఎ. సతీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి చేయటానికి బదులు పాలకులు అభివృద్ధి పేరిట విధ్వంసం సృష్టిస్తున్నారనీ, తమ భూముల దురాక్రమణను అడ్డుకున్న ప్రజలపై కాల్పులు జరిపి రక్తపాతం సృష్టిస్తున్నారనీ, భోపాల్ యూనియన్ కార్బైడ్ దుర్మార్గానికి కారకులైన అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రతినిధి అండర్‌సన్‌ను నిస్సిగ్గుగా అమెరికాకు తరలించిన సామ్రాజ్యవాద సేవకులైన పాలకులు, వేలాది భోపాల్‌లను సృష్టించే అణువిద్యుత్ కేంద్రాలను ప్రజల గుండెలపై స్థాపించేందుకు తహతహలాడుతున్నారనీ, పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా సాగే ప్రజా ఉద్యమాలన్నింటిలో విద్యార్థి యువత భుజం భుజం కలపాలనీ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఓ జిల్లా కన్వీనర్ కా॥ స్ఫూర్తి, కన్వీనర్ కా॥ శ్రావణ్ ఇంకా కా॥ ఈశ్వర్, చందూ, రవీంద్ర తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

### పొదిలి, 23-3-11 :

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పిడిఎస్‌ఓ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు అమరులకు జోహార్లు చెబుతూ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో ఈ ప్రదర్శనలో పాల్గొని సామ్రాజ్యవాద వ్యతిరేక, నిరుద్యోగ వ్యతిరేక, అవినీతి వ్యతిరేక నినాదాలు చేశారు. విశ్వనాథపురం, బస్టాండు సెంటర్‌ల మీదుగా ప్రదర్శన సాగింది.

పిడిఎస్‌ఓ జిల్లా కోకన్వీనర్ కా॥ రవీంద్ర ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ అందవలసిన, అవసరమైన విద్యా, వైద్యరంగాలను సమూలంగా పాలకులు ప్రైవేటీకరించారనీ, పెద్దఎత్తున నిత్యావసర సరుకుల ధరల భారం మోపుతున్నారనీ, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన అట్లుంచి, సెజ్‌ల పేరిట, కారిడార్‌ల పేరిట భూములు గుంజి వేసుకుంటూ అనేకమంది ఉపాధిని కొల్లగొడుతున్నారని, ప్రభుత్వాల సామ్రాజ్యవాద విధానాల వ్యతిరేకంగా పోరు సాగించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఓ నాయకులు నవీన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

### వేటపాలెం, 24-3-11 :

షహీద్ భగత్‌సింగ్ 80వ వర్ధంతి సందర్భంగా స్థానిక గడియారం స్థంభం సెంటర్ నుండి ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన ప్రారంభమై లైబ్రరీ మీదుగా అమరుల స్థూపం వరకూ సాగింది. ఈ సందర్భంగా హాజరైన ప్రజలనుద్దేశించి ఎన్‌వైఎస్ రాష్ట్ర నాయకులు కా॥ ఎ. సతీష్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల అమలుతో సామ్రాజ్యవాద దోపిడీ మరింత తీవ్రమైందని, భగత్‌సింగ్ తదితర జాతీయోద్యమ అమరవీరులు కలలుగన్న నూతన సమాజం కోసం మరో స్వతంత్ర పోరాటం సాగించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. లిబియాప్రజలు అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇంకా కామ్రేడ్ తేజా, కామ్రేడ్ ఆజాద్, రాజా తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

### నెల్లూరు, 23-3-11 :

నవయువ సమాఖ్య (ఎన్‌వైఎస్), ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్‌ఓ)ల ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ కూడలిలోని దత్తశాయి మందిరం వద్ద కార్యాలయంలో షహీద్ భగత్‌సింగ్ రాజగురు, సుఖదేవ్‌ల 80వ వర్ధంతిసభ జరిగింది. ఎన్‌వైఎస్ జిల్లా నాయకులు కా॥ వై. రవి అమరులకు జోహార్లు పలికి ఆహ్వానం పలకగా, పిడిఎస్‌ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కా॥ జి. కృష్ణప్రసాద్ సభకు అధ్యక్షత వహించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో 1931 మార్చి 23న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీసినా, ఎందరో జాతీయోద్యమ నాయకులను కాల్చిచంపినా అంతిమ లక్ష్య సాధన వరకూ పోరాటం కొనసాగాలన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి కాంగ్రెస్ పార్టీ విద్రోహం చేసి 'అధికార మార్పిడి' చేసుకుందనీ, అమరుల ఆశయాలు పరిపూర్తికాలేదని, సామ్రాజ్యవాద దోపిడీ అంతం కాలేదనీ అన్నారు.

సామాజిక కార్యకర్త, రైతు శ్రీ తిక్కవరపు సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ భగత్‌సింగ్ 24 సం॥ల తన జీవిత కాలంలో చిరుప్రాయం నుండీ జాతీయోద్యమ ప్రభావితులై, కార్యరంగంలో నిలచి పోరాడారన్నారు.

ఏపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ ఎన్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భారతదేశ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను భగత్‌సింగ్ కాంక్షించారనీ, స్వాతంత్ర్యం లభించిందంటున్న 64 సం॥ల కాలంలోనూ ప్రజలకు అవి అందలేదనీ, భారత రాజ్యాంగంలో రాసుకున్న 'సంక్షేమం' స్థానంలో ప్రజల జీవనం సంక్షోభ భరితమైందన్నారు.

పెరియార్ స్మారక కమిటీ నాయకులు ఎస్. చంద్రన్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదం నశించాలనే నినాదాన్ని ఆచరణ యుతం చేయవలసివుందన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయసాధనకోసం విద్యార్థి యువతరం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట స్ఫూర్తితో నడుంబిగించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా శరవణన్, సింథిల్, దీప్తి, నాగమణి, చలపతి, వెంకటేశ్వర్లు, ఏపిఎఫ్‌టియు, స్త్రీవిముక్తిసంఘటన, రైతుకూలీసంఘం కార్యకర్తలు పాల్గొని ఘననివాళులర్పించారు.

### అనంతపురం, 23-3-11 :

బాలసంఘం, ఎన్‌వైఎస్, పిడిఎస్‌ఓల ఆధ్వర్యంలో స్థానిక మండ్ల సుబ్బారెడ్డి నగర్ నుండి విద్యార్థి యువకులు, బాలలు మహిళలు, సిద్ధిరాంపురం, వై.కొత్తపల్లి, రజకనగర్, స్టాలిన్ నగర్‌ల నుండి హాజరైన మొత్తం 300 మంది విద్యార్థి, యువకులతో బాల కళాకారుల నృత్యాలతో, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదాలతో, అమరులకు జోహార్లతో కాగడాల ప్రదర్శన స్ఫూర్తిదాయకంగా సాగింది. స్థానిక నందమూరి నగర్‌లోని పెద్దమ్మ గుడివీధి నుండి తిరిగి ఎం.ఎస్‌నగర్ చేరుకున్న అనంతరం ఎన్‌వైఎస్ నాయకులు కా॥ బాలు అధ్యక్షతన భగత్‌సింగ్ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో జనసాహితి రాష్ట్ర నాయకులు, రచయిత, డా॥ సూర్యసాగర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలబాధ్యత నుండి తప్పుకుంటూ ప్రైవేటీకరిస్తున్నదనీ, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నత, సాంకేతిక, వృత్తి విద్యా కళాశాలలను పెంపొందించటం కాకుండా ఫీజు రీఎంబర్స్‌మెంట్ పేరిట కోట్ల రూ॥ ప్రజాధనాన్ని ప్రైవేటు కళాశాలలకు దోచిపెడ్తున్నదని; అదేవిధంగా ప్రభుత్వ వైద్య, ఆరోగ్య రంగాన్ని పడకెక్కించి ఆరోగ్యశ్రీ పేరిట ప్రతి సం॥రం కోట్లాది రూ॥లు కార్పొరేట్ ఆస్పత్రులకు కట్టబెడ్తున్న దన్నారు. అందరికీ కూడు, గూడు, గుడ్డ, విద్యా, వైద్యం అందాలని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ప్రతి ఒక్కరూ జీవించాలని కాంక్షిస్తూ, తమ జీవితాలను అర్పించిన అమరుల త్యాగాలు వృధా కారాదని, విద్యార్థి యువత ఆ కర్తవ్యాలను చేబూని శక్తివంతంగా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు.

ఏపిఎఫ్‌టియు నాయకులు, ఆటో యూనియన్ కార్యదర్శి కా॥ ఎ. నాగభూషణం మాట్లాడుతూ భగత్‌సింగ్ పిలుపునిచ్చిన విధంగా యువత కార్మిక, రైతాంగం వద్దకు వెళ్ళి వారి ఉద్యమాలతో మమేకమవ్వాలన్నారు. ఇంకా ఈ సభలో స్త్రీవిముక్తిసంఘటన జిల్లా కన్వీనర్ కా॥ భూదేవి, పిడిఎస్‌ఓ నాయకుడు కా॥ హరి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

### విజయనగరం జిల్లా, 23-3-11 :

మార్చి 23న మక్కువ మండలం, దుగ్గేరు ఏరియా మూలవలస గ్రామంలో నవయువ సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు 150 మంది యువతీ యువకులు పలు గ్రామాల నుండి హాజరైనారు. ఈ సభకు నవయువ సమాఖ్య జిల్లా కార్యదర్శి కా॥ పీడిక అసిరి అధ్యక్షత వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి జోహార్లు తెలియజేశారు. ఈ సభలో ముఖ్యవక్తగా హాజరైన రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ మాట్లాడుతూ భగత్‌సింగ్ యొక్క ఆశయాల్ని ముందుకు తీసుకెళ్లవలసిన కర్తవ్యం మన అందరిపైన వుందని, సామ్రాజ్యవాదానికి భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించడం మనందరి బాధ్యత అని యువతీయువకులను ప్రక్కదారి పట్టించే విషసంస్కృతికి వ్యతిరేకంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సభలో మూలవలస గ్రామ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) అధ్యక్షులు పీడిక అప్పారావు జిల్లా కమిటి సభ్యులు చిన్నప్ప పాల్గొని మాట్లాడారు.

సభానంతరం 40 కాగడాలతో 200 మంది యువతీయువకులు సాయంత్రం గం. 6.30 ని॥లకు మూలవలస గ్రామం నుండి దుగ్గేరు గ్రామం వరకు ప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్యవాదం నశించాలని, అమరవీరులకు జోహార్లంటూ ప్రదర్శన చేసిన పలు నినాదాలు యువతలో స్ఫూర్తినింపాయి.

కొమరాడ మండలం పెదశాఖ గ్రామంలో 100 మంది యువతి యువకులతో భగత్‌సింగ్ వర్ధంతి సభ మార్చి 23న జరిగింది. ఈ సభకు ఎన్‌వైఎస్ నాయకులు బోడి సింగన్న అధ్యక్షత వహించారు. ఈ సభకు ఎన్‌వైఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కా॥ కద్రక వెంకటస్వామి, జిల్లా కమిటి సభ్యులు కా॥ హిమరక మిన్నారావు మాట్లాడారు.

ఎన్‌వైఎస్, పిడిఎస్‌ఓ ప్రచురణ
జైలు డైరీల సాక్షిగా క్రాంతదర్శి భగత్‌సింగ్
వెల: 5.00

ఎన్.వై.ఎస్. ప్రచురణలు
అప్పుల ఊబికి అందమైన పేరే
మైక్రోఫైనాన్స్
వెల: 5.00

ఎన్.వై.ఎస్. ప్రచురణలు
తరతరాల విధ్వంసం
భోపాల్‌లో నాడు జరిగిందేమిటి?
మళ్ళీ జరగవని గ్యారంటీ ఏమిటి?
వెల: 5.00

ప్రతులకు
మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి, అరండల్‌పేట, విజయవాడ

## ప్రజాస్వామిక శక్తుల ప్రకటన:

# నియామత్ అన్సారీకి న్యాయం

**కోపే** గ్రామ పంచాయితి (లాతేహర్‌జిల్లా, జార్ఖండ్)లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం(ఎన్ఆర్ఇజిఏ) కార్యకర్త నియామత్ అన్సారీ హత్యనూ, అదే రోజున అతని స్నేహితుడు భుఖాన్‌సింగ్‌పై హత్యాప్రయత్నాన్నీ మేము తీవ్రంగా ఖండిస్తున్నాము.

క్లుప్తంగా, గతంలో ఒకసారి భుఖాన్, నియామత్‌లపై హత్యాప్రయత్నంతో సహా సాగిన వేధింపుల పర్వం పరాకాష్టగా ఈ హత్య జరిగింది. ఎన్ఆర్ఇజిఏలో పనిచేస్తున్న వారి హక్కుల కొరకూ భుఖాన్, నియామత్‌లు పోరాడారు. ఈ ప్రాంతంలో అవినీతిపరుల నేరస్తుల ముఠాను ఎదిర్చారు. రంకికలాం గ్రామ పంచాయితీలో ఉపాధిహామీ పథకంలో కుంభకోణాన్ని నియామత్, ఇతరులు కలిసి బయటపెట్టిన కొన్ని రోజులకే ఈ హత్య జరిగింది.

అసలు సమస్యలనుండీ, నేరస్తులనుండీ దృష్టిమరల్చేందుకు నియామత్‌ను "నేరస్తుడి"గా చిత్రించే ప్రయత్నంగా ప్రధాన స్రవంతి మాధ్యమాలలో వచ్చిన ఆయనపై నిరాధార ఆరోపణలను చూసి మేము ఆందోళన చెందాము. ఈ ఆరోపణలు అవాస్తవం. సంబంధిత ప్రచురణకర్త మరునాడు పత్రికలో క్షమాపణ తెలిపాడు.

ఆధారపడదగ్గ వర్గాలనుండి తెలిసిన సమాచారం ప్రకారం స్థానిక మావోయిస్టు దళం ఈ హత్య చేసింది. వాస్తవానికి సిపిఐ(మావోయిస్టు) దక్షిణ లాతేహర్ సబ్ జోనల్‌కమిటీ ఈ హత్యను తానే జరిపినట్లు ప్రకటించింది. నియామత్, భుఖాన్‌లు పోలీసు ఇన్ఫార్మర్లువంటి అర్థంలేని ఆరోపణలతో ఈ హత్యను సమర్థించుకునే ప్రయత్నం చేసింది. ఎన్ఆర్ఇజిఏ నిధులను కొల్లగొడుతున్న కంట్రాక్టర్లు, అవినీతి పరులతో స్థానిక మావోయిస్టు దళం చేతులు కలిపిందన్న వదంతులలో వాస్తవముందని ఈ ఘటన నుండి మేమర్థంచేసుకోవాలా?

ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ప్రధాన ముద్దాయిలను తక్షణమే అరెస్టు చేయాలనీ, నియామత్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలనీ, భుఖాన్‌సింగ్‌కు రక్షణ కల్పించాలనీ, నియామత్ హత్యపై సిబిఐతో విచారణ జరిపించాలనీ డిమాండు చేస్తున్నాము.

సిపిఐ(మావోయిస్టు) కేంద్రకమిటీనుండి వివరణనూ, క్షమాపణనూ, సబ్‌జోనల్‌కమిటీ ప్రకటిత "వాంటెడ్" లిస్టులో ఇంకా పేరున్న భుఖాన్‌సింగ్ భద్రతకు హామీనీ మేము డిమాండు చేస్తున్నాము. ప్రజల హక్కులకోసం పోరాడుతున్న వ్యక్తి సంగతలా వుంచి, రక్షణలేని వ్యక్తి పాశవిక హత్యకు ఎలాంటి వివరణా సమర్థన కాజాలదు. ఇది పూర్తిగా ఖండనీయ చర్య. దీనికి బాధ్యులైన వారందరూ శిక్షింపబడాలి.

| | | |
|---|---|---|
| **అరుణారాయ్** | **అరుంధతీరాయ్** | **బెలా భటియా** |
| (మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్) | (రచయిత్రి) | (మానవహక్కుల కార్యకర్త) |
| **సెడ్రిక్ ప్రకాష్** | **గౌతమ్ నవాల్కా** | **హరీష్ ధావన్** |
| (మానవ హక్కుల కార్యకర్త) | (పియుసిఎల్) | (పియుసిఎల్) |
| **కె.ఎన్.పణిక్కర్** | **నందితాదాస్** | **నిఖిల్ డే** |
| (చరిత్ర శాస్త్రజ్ఞుడు) | (నటి) | (ఎన్‌సిపిఐ) |
| **కవిత శ్రీవాత్సవ** | **నందినీ సుందర్** | **రాజేంద్ర సచార్** |
| (పియుసిఎల్) | (ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఇకనామిక్స్) | (పియుసిఎల్) |
| **సత్యా శివరామన్** | **షబ్నమ్ హష్మి** | **శశిభూషణ్ పాఠక్** |
| (జర్నలిస్టు) | (అన్‌హద్) | (పియుసిఎల్) |
| **బృందా గ్రోవర్** | **హర్ష్ మందెర్** | **డీన్ డ్రీజ్** |
| (సుప్రీంకోర్టు లాయర్) | (ఆమన్ బర్‌దారీ) | (అలహాబాద్ విశ్వవిద్యాలయం) |
| **రీతికా ఖేరా** | **స్వామి అగ్నివేశ్** | |
| (ఐఐటి, ఢిల్లీ) | (మానవ హక్కుల కార్యకర్త) | |

## వందలాది... (చివరి పేజీ నుండి)

వ్యతిరేకిస్తూ ప్రజలు పోరాటటాలు నిర్మించాలన్నారు.

సభా ప్రారంభంలోనే కా॥ కానూసన్యాల్‌కు వివిధ ప్రజాసంఘాల నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ వేజెండ్ల రామారావు, జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పి. కోటేశ్వరరావు, ఏపిఎఫ్‌టియు జిల్లా నాయకులు కా॥ కొండలరావు, స్త్రీవిముక్తిసంఘటన జిల్లా నాయకులు కామ్రేడ్స్ శాంత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

**పిడుగురాళ్ళ, 23-3-11 :**

సిపిఐ(ఎం-ఎల్) అగ్రనేత కామ్రేడ్ కానూసన్యాల్ ప్రధమ వర్ధంతి సభ స్థానిక లెనిన్ నగర్‌లోని కా॥ విశ్వమోహనరెడ్డి భవన్‌లో స్ఫూర్తిదాయకంగా జరిగింది. ముందుగా కా॥ కానూసన్యాల్ చిత్రపటానికి సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ డివిఎన్ స్వామి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సభకు రైతు కూలీసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ కాండ్రగుంట ముసలయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ పీడిత ప్రజలను నిరంతరం అంటిపెట్టుకొని వుండటం, వారిని సంఘటిత పరచటం, ప్రజాయుద్ధ పంథా ప్రాతిపదికన విప్లవోద్యమంలోకి సమీకరించటం నేడు మనముందున్న కర్తవ్యాలని, వాటిని కొనసాగించటవే కా॥ కానూసన్యాల్‌కు అర్పించే నివాళి అన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ డివిఎన్ స్వామి మాట్లాడుతూ మహత్తర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట అనంతర కాలంలో తిరిగి నగ్జల్బరీ వసంత కాల మేఘగర్జన భారత విప్లవపు సరైన పంథాను ముందుకు తెచ్చిందన్నారు. ఒక వైపున మితవాదం మరోవైపున అతివాద దుస్సాహసిక వాదానికి వ్యతిరేకంగా విరామ మెరుగక సిద్ధాంత, రాజకీయ, ఆచరణ రంగాల్లో కా॥ కె.ఎస్. కృషి సాగించారని పేర్కొన్నారు. కానూసన్యాల్ రాజకీయ జీవితం మొత్తం కమ్యూనిస్టు విలువలతో నిండివుందనీ, సామాన్యులతో కలసి పోయిన వ్యక్తిత్వమనీ, ఆయన కడవరకూ ఆదర్శప్రాయమైన జీవనం సాగించారనీ, నిజాయితీకి మారుపేరనీ పేర్కొంటూ కా॥ కానూసన్యాల్ మార్గంలో ముందుకు సాగుదామని ప్రతినబూనారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ పోలీసులు, రాజ్యం ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నప్పుడు రాజీలేని పోరాట యోధుడిగా కానూసన్యాల్ కడవరకూ అలుపెరగని పోరుచేశారన్నారు. జీవిత కాలమంతటా విప్లవ కమ్యూనిస్టుగా సిద్ధాంత, ఆచరణ రంగాల్లో కృషి సాగించిన కా॥ కానూసన్యాల్‌కు అరుణాంజలి ఘటిస్తూ ముగించారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ నీలాద్రి రాంబాబు; స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ ఎం. నిర్మల ఇంకా కామ్రేడ్స్ ఇజ్రాయిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

**రేపల్లె, 23-3-11 :**

భారతవిప్లవ ప్రజాయుద్ధ పోరాట యోధుడు కా॥ కానూసన్యాల్ ప్రధమ వర్ధంతి సభను స్థానిక మైనేని వారి కళ్యాణ మండపంలో సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ మండవ శోభారాణి అధ్యక్షత వహించి కా॥ కానూసన్యాల్ పోరాట పటిమను, జీవిత విశేషాలను వివరించారు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం ప్రాతిపదికగా దేశంలో ఒక నిజమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కామ్రేడ్ కానూసన్యాల్ జీవిత చరమాంకంవరకూ అంకితమయ్యారన్నారు. పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయిగా విశాఖపట్నం జైలులో వుండగా 'నగ్జల్బరీపై మరింత కొంత వివరణ' ద్వారా ప్రజాయుద్ధ పంథాను విస్పష్టంగా ప్రకటించారన్నారు.

ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘ నాయకులు కా॥ కె. సీతారామయ్య మాట్లాడుతూ ప్రజాసమస్యలు నానాటికీ తీవ్రమౌతూ సంక్షోభం తీవ్రమౌతున్న నేపథ్యంలో ప్రజాపోరాటాలను మరింత ముందుకు తీసుకువెళ్ళాల్సివుందన్నారు. గిట్టుబాటు ధరలేని కౌలు రైతుల, రైతన్నల ఆత్మహత్యలు; మైక్రోఫైనాన్స్ నిలువు దోపిడీ సాగించిన ఫలితంగా ఆత్మహత్యలు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, పాలక రాజకీయ కుట్రలకు బలై నిరాశా నిస్పృహలకు లోనైన విద్యార్థి యువకుల ఆత్మహత్యలు; అసంఘటితరంగంలోని కార్మిక వర్గపు తీవ్ర సమస్యలతో సమాజం కల్లోలభరితంగావుందని పేర్కొన్నారు.

ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి కా॥ వి. హనుమంతరావు మాట్లాడుతూ నానాటికీ ప్రజలపై పెరుగుతున్న పీడన, అణచివేతలను ప్రశ్నించకుండా ప్రజల మనసులను ప్రక్కదారి పట్టించేలా, గందరగోళం విచ్చిన్నాలతో పాలకులు ప్రజలమీద భౌతిక, మానసిక యుద్ధాల్ని చేస్తున్నారన్నారు. వీటిని గుర్తెరిగి ప్రజలు ఐక్య పోరాటాలు సాగించాలన్నారు.

**మంగళగిరి, 23-3-11 :**

కామ్రేడ్ కానూసన్యాల్ ప్రధమ వర్ధంతి సందర్భంగా పాత మంగళగిరిలోని కార్యాలయంలో సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో వర్ధంతి సభ జరిగింది. తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలు కా॥ కానూసన్యాల్‌కు నివాళులర్పించారు.

ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ రాచకొండ సాంబశివరావు ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సభలో సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ కానూసన్యాల్ భారత విప్లవోద్యమంలో కీలకపాత్ర పోషించిన నేత అన్నారు. 14 సం॥ జైలు జీవితం, ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని భారత విప్లవ పంథాకోసం, విప్లవకారుల ఐక్యత కోసం కడవరకూ కృషి చేశారన్నారు. 1979లో జైలు నుండి విడుదలైన కామ్రేడ్ కానూసన్యాల్ విప్లవ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కొల్లా వెంకయ్య తదితరులతో సంబంధాలు నెరిపారన్నారు. 2005లో విజయవాడలో జరిగిన అఖిలభారత కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యత సదస్సులో ఏర్పడిన సిపిఐ(ఎం-ఎల్) పార్టీకి కా॥ కానూసన్యాల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై తుదిశ్వాస వరకూ విప్లవాచరణలో నిలిచారన్నారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ జగ్గారపు సుబ్బారావు మాట్లాడుతూ విప్లవ శ్రేణులందరికీ కామ్రేడ్ కానూసన్యాల్ జీవితం స్ఫూర్తి దాయకమన్నారు. దోపిడీ పీడనలు లేని సమాజం కోసం, సోషలిస్టు వ్యవస్థ కోసం అకుంఠిత దీక్షతో కా॥ కానూసన్యాల్ పోరాడారనీ, ఈనాడు దేశవ్యాపితంగా అన్ని సెక్షన్ల ప్రజానీకం సమస్యలతో సతమతమౌతున్నారనీ, పాలకుల విధానాలపై తిరగబడుతున్నారనీ, ఆయిల్ వనరులపై పెత్తనం కోసం అమెరికా లిబియా దేశంపై బాంబు దాడులు సాగిస్తున్నదనీ, అమెరికా దాడులను తక్షణం ఆపివేయాలని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం తీవ్రం చేయాలన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ మారెళ్ళ అంజిరెడ్డి, దానబోయిన భాస్కరరావు, ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం నాయకులు కూరపాటి కోటేశ్వరరావు, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు. ✡

# తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికై చెరుకు రైతుల ఆందోళన




**ఉయ్యూరు, 15-3-11 :**

చెరకు రైతాంగపు నిరవధిక ఆందోళన ఫలితంగా ఉయ్యూరు కె.సి.పి. షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం గత వ్యవసాయ సీజన్‌లో టన్ను చెరకుకు రు. 2100/- ధరను ప్రకటించింది. ఉయ్యూరులో 4.50 లక్షల టన్నుల నుండి 5.30 లక్షల టన్నులకు, చల్లపల్లిలో 1.5 నుండి 2.5 లక్షల టన్నులకు రైతులు ప్లాంటేషన్ పెంచారు. అయితే గత సీజన్‌లో ఇచ్చిన ధరను కూడా ఇపుడు దిగకోస్తూ రు. 1900గా (ఇందులో రు. 60/-లు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కొనుగోలు పన్ను కలిపి) కె.సి.పి. యాజమాన్యం ప్రకటించింది. టన్నుకి రు॥ 200 కోత విధించటంతో రైతాంగం తీవ్ర ఆగ్రహంతో వున్నారు. ఈ స్థితిలో అఖిలపక్ష కార్యాచరణ కమిటీ నాయకత్వాన 25-1-11న ఉయ్యూరులో రైతు నాయకులతో బహిరంగసభ జరిపి టన్నుకి రు॥ 2500/- ఇచ్చి నరకుడు, తోలుడు ఛార్జీలు ఫ్యాక్టరీలే భరించాలని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని కోరుతూ మెమోరాండం ఇచ్చారు.

అయినప్పటికీ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందనా లేక పోవటంతో 15-3-11న కెసిపి ఫ్యాక్టరీ ఎదుట చెరకు రైతులు అఖిలపక్ష కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా శిబిరానికి కార్యాచరణ కమిటీ కన్వీనర్ వెలగపూడి అజాద్ అధ్యక్షత వహించారు.

ధర్నా శిబిరాన్ని మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రారంభించి, రైతుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించటంలో ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యవైఖరితో వ్యవహరించడం సరైందికాదని, ఫ్యాక్టరీకి గత సీజన్‌లో రు॥ 23 కోట్లు లాభం వచ్చినా, రు॥ 100 కోట్లు రిజర్వు ఫండ్ వున్నా రైతులకు సరైన ధర ఇవ్వకుండా చెరకు రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి నెడ్తున్నదని, కావున రైతాంగం సమైక్యంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి చెరకు ఉత్పత్తి దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్‌విఎస్ శర్మ మాట్లాడుతూ ఒకవైపున ఫ్యాక్టరీ యాజమాన్యాలు లాభాలు గడిస్తూవుంటే రైతాంగం నష్టాలతో పంట పండించనవసరంలేదని, రైతాంగానికి ఆర్థిక భద్రత లేకుండా పోయిందని, కేంద్ర ప్రభుత్వం బడా చక్కెర మిల్లులకు లాభం చేకూరేవిధంగా ఏ సుంకాలు లేకుండా ముడి చెక్కెరను దిగుమతి చేసుకునే అవకాశాలు కల్పించిందనీ, రైతులు మేల్కొని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తర్వాత రైతుకూలీసంఘం రాష్ట్రకార్యదర్శి కా॥ కోటయ్య మాట్లాడుతూ మన కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రపంచబ్యాంక్, ఐఎమ్ఎఫ్, ట్రాన్స్ మల్టీనేషనల్ కంపెనీలతో చేతులు కలిపి రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారనీ; కార్పోరేట్, కాంట్రాక్టు వ్యవసాయ విధానాలను అమలు చేసే దానిలో భాగంగా చెరకు రైతులను దివాళా తీయిస్తున్నారనీ, కెసిపి యాజమాన్యం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై á

á సమైక్యంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ శిబిరంలో చెరకు రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. కేశవరావు, సిడిసి ఛైర్మన్ వీరంకి చింతయ్య, లోక్‌సత్తా జిల్లా పార్టీ కార్యదర్శి చెన్నుపాటి నజీర్ తదితరులు సందేశాలిచ్చారు.

ధర్నా శిబిరం ముగింపుగా చెరకు ఫ్యాక్టరీ గేట్ ముందు బైఠాయించి, మెమోరాండాన్ని ఫ్యాక్టరీ జిఎం వచ్చి తీసుకోవాలని డిమాండ్ చేయటంతో జిఎం అందుబాటులో లేనందున ఎజిఎం ఇతర సిబ్బంది వచ్చారు. కార్యాచరణ కమిటీ నాయకులు కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ మెమోరాండం ఇవ్వటానికి ముందు, చెరకు రైతాంగం ఇప్పటిదాకా చాలా సహనంగా వున్నారని, జనవరి 25న మెమోరాండం ఇచ్చినా, ఈనాడు వందల మంది రైతులతో ధర్నా జరిపినా ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించక పోవటంతో రైతులు తీవ్ర ఆవేదనతో, ఆగ్రహంతోవున్నారనీ, ఇప్పటికైనా చెరకు ధర పెంచుతూ యాజమాన్యం వెంటనే ప్రకటించకపోతే ఫ్యాక్టరీని దిగ్బంధనం చేస్తారని హెచ్చరించారు.

బైఠాయింపులో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు కొల్లిపర శాయివరప్రసాద్, గన్నె రవికుమార్, సుంకర కుటుంబరావు, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, రైతుకూలీ సంఘం నాయకులు వీరబాబు, బొట్టా సాంబశివారెడ్డి, తదితర నాయకులు చెరకు రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను వివరించారు. చివరగా ఫ్యాక్టరీ అధికారులకు మెమోరాండం సమర్పించారు

ధర్నా సందర్భంగా ఫ్యాక్టరీ యాజమాన్యం పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి భయవాతావరణాన్ని సృష్టించింది. అలానే ఫ్యాక్టరీగేట్‌వద్ద పెద్దలాఠీలతో ఎక్కువ సంఖ్యలో గార్డులను దించింది. రైతులు యాజమాన్య చర్యలకి బెదిరి పోకుండా నిబ్బరంగా కార్యక్రమంలో పాల్గొనన్నారు. ధర్నాకి సన్నాహకంగా పోరంకి, కంకిపాడు, తోట్లవల్లూరు, వీరంకిలాకు సెంటరులలో జరిగిన రైతాంగ సదస్సులకు వెలగపూడి అజాద్, ముప్పాళ్ళ భార్గవశ్రీ హాజరయ్యారు. ధర్నాకి ముందురోజు అన్ని సెంటర్‌ల గ్రామాల్లో మైక్ ప్రచారం జరిగింది. ✡

# 'వందలాది నగ్జల్బరీలను నిర్మించండనే కా॥ కానూసన్యాల్ పిలుపునందుకుందాం!'

## కామ్రేడ్ కానూసన్యాల్ ప్రథమ వర్ధంతి సభలలో వక్తల ఉద్ఘాటన

*భారత విప్లవోద్యమ అగ్రనేత, సిపిఐ(ఎం-ఎల్) ప్రముఖ నాయకులు కా॥ కానూసన్యాల్ మనల్ని వీడి మార్చి 23కి సంవత్సరం గడిచింది. కా॥ కానూసన్యాల్ ప్రథమ వర్ధంతి సభలను జరపమని సిపిఐ (ఎం-ఎల్) కేంద్రకమిటి ఇచ్చిన పిలుపులో భాగంగా పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులోనూ, మరియు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో స్థానికంగానూ వర్ధంతి సభలు జరిగాయి. ఇంకా మరికొన్ని ప్రాంతాలలో జరగనున్నాయి. అందిన మేరకు రిపోర్టులను సంక్షిప్తంగా అందిస్తున్నాం*

*-సంపాదకుడు*



హైదరాబాద్-వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ నిఖిలేశ్వర్; వేదికపై (ఎడమనుండి) కామ్రేడ్స్ కోటయ్య, ఎం.టి. ఖాన్, గుర్రం విజయకుమార్, సి. పెద్దన్న; సభకు హాజరైన ప్రజానీకం

**హైదరాబాద్, 23-3-11 :**

నగ్జల్బరీ ఉద్యమ నిర్మాత, భారత విప్లవోద్యమ అగ్రనేత కామ్రేడ్ కానూసన్యాల్ ప్రథమ వర్ధంతిసభ సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో స్థానిక బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగింది.

సభ ప్రారంభంలో సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్, కా॥ కానూసన్యాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. సభకు హాజరైన విప్లవకవి నిఖిలేశ్వర్, పౌరహక్కుల నాయకులు యం.టి. ఖాన్, సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥ కోటయ్య, కా॥ పెద్దన్న; ఇంకా వరంగల్, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, హైద్రాబాద్‌ల నుండి హాజరైన వివిధ ప్రజాసంఘాల నాయకులు కా॥ కానూసన్యాల్‌కు విప్లవ జోహార్లర్పించారు. కా॥ కానూసన్యాల్ ఆశయాల్ని తుదికంటా కొనసాగిస్తామని ప్రతినబూనారు.

ఈ సభకు అధ్యక్షత వహించిన సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ కోటయ్య మాట్లాడుతూ కా॥ కానూసన్యాల్ విప్లవదీక్షతో కడవరకూ ప్రజా ఉద్యమాలలో మమేకమై పనిచేశారన్నారు. టీ తోట కార్మికులు, అనేకమంది బడుగు, బలహీన వర్గాల ప్రజల్ని సంఘటిత పరిచి ఉద్యమాలలోకి పురోగమింపజేశారని, ఆ ఒరవడిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

విప్లవకవి కామ్రేడ్ నిఖిలేశ్వర్ మాట్లాడుతూ దిగంబర కవులనుండి విప్లవ కవులుగా తాము పరివర్తన చెందే క్రమంలో తెలంగాణా రైతాంగ సాయుధపోరాటం, నగ్జల్బరీ పోరాటాలు తమకు ప్రేరణగా నిలిచాయనీ, కానూసన్యాల్, చారుమజుందార్, సుబ్బారావు పాణిగ్రహి లాంటి వారు తమకు కలిగించిన ఉత్తేజాన్ని స్మరించుకున్నారు. పార్వతీపురం కుట్రకేసు సందర్భంగా విశాఖజైలులో కా॥ కానూసన్యాల్ మరికొంతమంది కమ్యూనిస్టు నాయకులు వున్నప్పుడు-జ్వాలాముఖి, తాను వారిని కలిసి చర్చించిన అనేక విషయాలను, కోర్టు హాలులో నినాదాలిస్తూ కామ్రేడ్స్ ప్రదర్శించిన తెగువను నెమరు వేసుకున్నారు. తాము కా॥ కానూసన్యాల్‌ను కలిసినపుడు వ్యక్తిగత హింసావాదాన్ని గురించి ప్రశ్నిస్తే 'విప్లవోద్యమం ఒక సరళరేఖలాగా తిన్నగా వుండదనీ, అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ, ఆచరణలో సంఘర్షించటం ద్వారానే సరైన మార్గం రూపుదిద్దుకుంటుంటుందని వివరించారన్నారు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వెలుగులో ప్రజల్ని సమీకరించటం, నడిపించటం, ఆ వైపుగా ఆచరణ వుండాలనే స్పష్టమైన అవగాహన కలిగివున్న కమ్యూనిస్టు నాయకుడు కా॥ కానూసన్యాల్ అని పేర్కొన్నారు. యాంత్రికంగా కాకుండా, భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు తగిన విధంగా మార్క్సిజం-లెనినిజం-మావోఆలోచనా విధానాన్ని అన్వయించటంలో కా॥ కానూ సన్యాల్ కృషిని పేర్కొన్నారు. చారు మజుందార్ వ్యక్తిగత హింసావాదాన్ని తిరస్కరించిన సరైన విప్లవ ప్రజాపంథా అమలు కోసం కృషిచేశారన్నారు. ఐక్య శ్రామిక, కర్షక, ప్రజా ఉద్యమాల ఆవశ్యకతను గుర్తించి విడివిడిగా పనిచేస్తున్న వివిధ విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ఆ దిశగా కృషిసాగించాలని, సరైన ప్రజాపంథా అమలుకోసం కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా కృషి చేయాలన్నారు. భారత విప్లవాన్ని విజయవంతం చేయాల్సిన చారిత్రక కర్తవ్యాన్ని చేపట్టిన విప్లవ కమ్యూనిస్టుపార్టీలు ఆచరణలో ఎదురౌతున్న వివిధ ధోరణుల నెదుర్కొంటూ సరైన దిశగా సాగాల్సిన అవసరాన్ని కా॥ నిఖిలేశ్వర్ ఈ సందర్భంగా ప్రముఖంగా ప్రస్తావించారు.

పౌరహక్కుల ఉద్యమనాయకులు, ప్రముఖ ప్రజాతంత్రవాది యం.టి.ఖాన్ మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తికోసం కా॥ కానూసన్యాల్ సల్పిన కృషిని కొనసాగించటమే ఆయనకు మనమందించే సరైన నివాళి అని పేర్కొన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రనాయకులు కా॥ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ కా॥ కానూసన్యాల్ తన తొలినాళ్ళలో కమ్యూనిస్టులపై ఆనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ కార్యక్రమాలలో పాల్గొని ఉద్యోగాన్ని కోల్పోయాడనీ, ఆ విధంగా ఉద్యోగాన్ని వీడి ప్రజలమధ్య పనిచేయాలనే నిర్ణయంతో ముందుకు సాగాడని గుర్తు చేశారు. నగ్జల్బరీ పోరాటంలో కా॥ కానూసన్యాల్ ఆ ప్రాంత ప్రజల్ని కదిలించి, సంఘటిత పరిచిన తీరు వివరించారు. పాలకులు మన దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తున్న ప్రస్తుత తరుణంలో కా॥ కానూసన్యాల్ పేర్కొన్న విధంగా 'వందలాది నగ్జల్బరీలను నిర్మించాల్సిన' కర్తవ్యం మనందరిమీద వుందన్నారు. లిబియాపై అమెరికా సంకీర్ణ సేనలు సాగిస్తున్న దురాక్రమణ దాడులను ఖండించాలంటూ పిలుపు నిచ్చారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥ పెద్దన్న మాట్లాడుతూ, కా॥ కానూసన్యాల్ మితవాద, అతివాద, అవకాశవాదాలకు వ్యతిరేకంగా సరైన విప్లవ పంథాకోసం జీవిత పర్యంతం కృషి సాగించారన్నారు. వ్యక్తిగత హింసావాదం ప్రజాఉద్యమాలకు కల్గిస్తున్న ఆటంకాలను, నష్టాలను వివరించారు. కామ్రేడ్ కానూసన్యాల్ అందించిన ఒరవడిని ముందుకు తీసుకువెళ్ళటమంటే ప్రజాస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్ని తీవ్రం చేయడమేనని కా॥ పెద్దన్న పేర్కొన్నారు.

లిబియాపై అమెరికా, సంకీర్ణసేనల దురాక్రమణ దాడిని ఖండిస్తూ సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

కామ్రేడ్ కానూసన్యాల్ కృషిని, పోరాట జీవితాన్ని ఎలుగెత్తి చాటుతూ ప్రజా కళాకారులు పాడిన పాటలు సభికుల్ని ఉత్తేజపరిచాయి.

**ఒంగోలు, 23-4-11 :**

భారత విప్లవోద్యమ అగ్రనేత కామ్రేడ్ కానూసన్యాల్ వర్ధంతి సభ స్థానిక ఈమనిపాలెంలోని సిపిఐ(ఎం-ఎల్) కార్యాలయం వద్ద జరిగింది. ఈ సభలో సిపిఐ(ఎం-ఎల్) ప్రకాశం జిల్లా నాయకులు కా॥ ఎస్. లలితకుమారి ప్రసంగిస్తూ భారత ప్రజల్ని శ్రమదోపిడీ నుండి విముక్తం చేయాలంటే భారత విప్లవోద్యమాన్ని కా॥ కానూసన్యాల్ చూపిన మార్గంలో పురోగమింపజేయడమే కర్తవ్యమని పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, పీడిత ప్రజల ఉద్యమంలోనూ, మితవాదం, పార్లమెంటరీ పంథా పై చేయి సాగిస్తున్నకాలంలో, భూమి సమస్య చట్టాల ద్వారా పరిష్కరించబడుతుందన్న మితవాదధోరణులపై కా॥ కానూసన్యాల్ పోరాడారనీ; వ్యవసాయక విప్లవం, విప్లవ ప్రజా ఉద్యమ చైతన్యమే నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసని చాటి చెపుతూ 1967లో కారుచీకటిలో కాంతిరేఖలా ప్రభవించిన నగ్జల్బరీ పోరాట నిర్మాత కా॥ కానూసన్యాల్ అనీ పేర్కొన్నారు.

సభకు అధ్యక్షత వహించిన సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ ఎం.ఎస్. శాయి మాట్లాడుతూ 14 సం॥ జైలు జీవితం విప్లవోద్యమంలో ఆటుపోట్లు వంటివెన్ని ఎదురైనా అటు నగ్జల్బరీ ప్రాంత ప్రజల్ని, ఇటుభారత విప్లవ పంథాకోసం సాగుతున్న పోరాటాన్ని వదిలిపెట్టక కామ్రేడ్ కానూసన్యాల్ చేసిన కృషి, సాగించిన పోరాటాలు గొప్ప ఉత్తేజకరమైనవన్నారు. దుష్ప్రచారాలూ, నిందలూ, ఉపేక్షా, నిర్లక్ష్యాల నడుమ కూడా హడావుడి, ఆందోళన చెందకుండా నిబ్బరంగా పని చేసుకుంటూ పోవాలని ఆయన నేర్పారన్నారు.

ఏపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఎమ్.వి. కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పాలకులు ఏ ప్రజా సమస్యలనూ పరిష్కరించకపోగా, తాముసృష్టించిన సంక్షోభాలనే తమదాడికి సాధనంగా చేసుకుంటున్నారని, తమ భూముల కోసం పోరాడుతున్న ప్రజలపై కాల్పులు జరిపి రక్తపాతాన్ని సృష్టిస్తున్నారనీ; అమెరికన్ సామ్రాజ్యవాదం ఆయిల్‌వనరులపై ఆధిపత్యం కోసం లిబియాపై తెగబడి సైనిక దాడులు సాగిస్తున్నదనీ, వీటిని

**(తరువాయి 15వ పేజీలో)**



పిడుగురాళ్ళ-వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ డి.వి.ఎన్. స్వామి



ఒంగోలు-వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ లలిత



రేపల్లె-వర్ధంతి సభకు హాజరైన ప్రతినిధులు

**Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**
**and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2**
**Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**